సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 166

మంగళవారం 6-9-2022



'ఎవరినైనా బలహీనవర్గాలు అని అంటున్నామంటే అది వాళ్ళ ఆర్థిక స్తోమతను బట్టే. మేధస్సులో వాళ్ళు ఎవరికీ తీసిపోరు'

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


జన హృదయనేతకు
స్వాగత సుమాంజలి
మేకపాటి గౌతం రెడ్డి సంగం బ్యారేజి
మేకపాటి గౌతమ్‌రెడ్డి
సంగం బ్యారేజి
మరియు నెల్లూరు బ్యారేజి
ప్రారంభోత్సవానికి
నేడు నెల్లూరు జిల్లాకు విచ్చేయుచున్న
జన హృదయనేత
గౌ॥ ముఖ్యమంత్రి వర్యులు
శ్రీ వై.యస్. జగన్‌మోహన్ రెడ్డి గారికి
YSRCP నాయకులకు, కార్యకర్తలకు,
అశేష ప్రజానీకానికి,
రైతు సోదరులకు, అధికారులకు
స్వాగతం
సుస్వాగతం
మేకపాటి విక్రమ్ రెడ్డి
శాసనసభ్యులు, ఆత్మకూరు నియోజకవర్గం,
SPSR నెల్లూరు జిల్లా



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 166

మంగళవారం 6-9-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 166

మంగళవారం 6-9-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మెద్వదేవ్‌కు చుక్కెదురు

యూఎస్ ఓపెన్ ప్రీక్వార్టర్స్‌లోనే వెనుతిరిగిన వరల్డ్ నంబర్ వన్ - 8లో



17,650పైకి నిఫ్టీ

మళ్లీ 59 వేలు దాటిన సెన్సెక్స్.. 443 పాయింట్ల లాభం - 9లో



యాత్రతో రాత మారేనా?

కాంగ్రెస్‌కు జవసత్వాలు అందించే ఉద్దేశంతో ఆ పార్టీ నేత రాహుల్ బుధవారం 'భారత్ జోడో' యాత్రకు శ్రీకారం చుడుతున్నారు.

వివరాలు 6లో



సంజయ్ రౌత్ కస్టడీ పొడిగింపు

మనీలాండరింగ్ కేసులో శివసేన ఎంపీ సంజయ్ రౌత్ జ్యుడీషియల్ కస్టడీని ప్రత్యేక కోర్టు మరో 14 రోజులు పొడిగించింది.

వివరాలు 6లో



విశ్వాస పరీక్షలో నెగ్గిన హేమంత్

జార్ఖండ్‌లో జరిగిన విశ్వాస పరీక్షలో హేమంత్ సోరెన్ ప్రభుత్వం నెగ్గింది. తీర్మానానికి అనుకూలంగా 48 మంది ఓటువేశారు.

వివరాలు 6లో



సాధనతోనే కీర్తి కిరీటం

మిసెస్ ఇండియా వరల్డ్ వైడ్ 2022 విజేత స్వాతితో ఇంటర్వ్యూ. విశాఖలో పుట్టి పెరిగిన ఆమె.. మీడియా రంగంలోనూ పనిచేశారు.

వివరాలు IVలో

బంగారు భవిష్యత్

విద్యార్థులను అన్ని విధాలా తీర్చిదిద్దేందుకే విద్యా రంగ సంస్కరణలు

గురుపూజోత్సవంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- ఈ మార్పులు టీచర్లను ఇబ్బంది పెట్టేవి ఎంతమాత్రం కావు
- గత ప్రభుత్వంలో మాదిరి ప్రభుత్వ టీచర్లను, స్కూళ్లను నిర్వీర్యం చేసే మార్పులు కావు
- మన విద్యా విధానంతో పిల్లలకు మేలు కలుగుతుందా.. లేదా? ఆత్మపరిశీలన చేసుకోవాలి
- విద్యా రంగ కార్యక్రమాలపై రూ.53 వేల కోట్లు ఖర్చు
- ఉచితంగా నాణ్యమైన, ఉపయోగపడే విద్యను ఇవ్వాలన్నది ప్రభుత్వ విధానం
- గత ప్రభుత్వంలో ఉద్యోగుల సమస్యలను ఏమాత్రం పట్టించుకోలేదు
- ఇప్పుడు మనం మంచి చేస్తుంటే వ్యతిరేకంగా రెచ్చగొడుతున్నారు
- ఉద్యోగుల పెన్షన్ సమస్య పరిష్కారం దిశగా అడుగులు ముందుకు వేస్తున్నాం



ముద్దాడ ఆదినారాయణకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

"ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, ఇతర పేద పిల్లలకు చదువే ఆస్తి. మన విద్యా విధానం ఆ ఆస్తిగా ఉందా? లేక భారంగా ఉందా? అని ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. కేవలం పట్టా మాత్రమే పిల్లల చేతిలో పెట్టేలా మన చదువుల తీరు ఉందా? అని ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ఈ పరిస్థితులను మార్చి, మన పిల్లలకు బంగారు భవిష్యత్ ఉండేలా దారి చూపాలనేది మనందరి ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసమే ఈ రంగంలో మార్పులు చేశాం తప్ప.. ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టడానికి ఎంతమాత్రం కాదు."

\- సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: విద్యార్థులకు బంగారు భవిష్యత్తు కల్పించే దిశగా బాటలు వేసేలా విద్యా రంగంలో సంస్కరణలు అమలు చేస్తున్నామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ సంస్కరణలు ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టేవి కావని, ఆ ఉద్దేశంతో తీసుకొచ్చినవి కాదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో మాదిరి ప్రభుత్వ టీచర్లకు నష్టం చేయడానికో, ప్రభుత్వ స్కూళ్లను నిర్వీర్యం చేయడానికో ఈ చర్యలు తీసుకోలేదని చెప్పారు. సోమవారం విజయవాడలో నిర్వహించిన గురుపూజోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఇప్పటి మన విద్యా విధానంతో పిల్లలకు ప్రయోజనం కలుగుతోందా లేదా అని

మిగతా 2వ పేజీలో ▶

బ్రిటన్ పీఠం ట్రస్‌దే

పోరాడి ఓడిన రిషి సునాక్

ప్రధానిగా నేడు ట్రస్ ప్రమాణం

మూడో మహిళా పీఎంగా రికార్డు



విజయం అనంతరం లిజ్ ట్రస్ ఆనందోత్సాహం

■ బ్రిటన్ ప్రధాని పీఠం కోసం జరిగిన పోరులో విదేశాంగ మంత్రి మేరీ ఎలిజబెత్(లిజ్) ట్రస్ (47)దే పైచేయి అయ్యింది. హోరాహోరీ పోరులో భారత సంతతికి చెందిన మాజీ ఆర్థిక మంత్రి రిషి సునాక్(42)పై విజయం సాధించి కన్జర్వేటివ్ పార్టీ నేతగా ట్రస్ ఎన్నికయ్యారు. మార్గరెట్ థాచర్, థెరిసా మే తర్వాత బ్రిటన్ ప్రధాని కానున్న మూడో మహిళ ట్రస్. సోమవారం వెల్లడైన ఫలితాల్లో ట్రస్ 81,326 ఓట్లు సాధించగా.. రిషికి 60,399 ఓట్లు పోలయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం ట్రస్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరిస్తారు.

6లో

రాష్ట్రంలోనే క్యాన్సర్‌కు చెక్

వైద్యానికి బయటకు వెళ్లకూడదన్నది రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశం

- 'సాక్షి' ఇంటర్వ్యూలో ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు నోరి దత్తాత్రేయుడు
- క్యాన్సర్ కట్టడికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు భేష్
- చికిత్స సదుపాయాలు మెరుగుపరుస్తోంది
- సమర్థవంతంగా నియంత్రించేందుకు నోటిఫైడ్ జబ్బుగా క్యాన్సర్‌ను గుర్తించింది
- రాష్ట్రంలో 3 ప్రాంతాల్లోనూ సమగ్ర క్యాన్సర్ కేంద్రాలు

10లో



న్యూస్‌రీల్

నిశ్చింతగా 2 నెలలు నిల్వ



కూరగాయలు, పండ్ల నిల్వ సామర్థ్యాన్ని పెంచే అద్భుత లేపనాన్ని గౌహతి ఐఐటీ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. లేపనం వల్ల కూరగాయలు, పండ్లు రెండు నెలలపాటు చెక్కుచెదరలేదని వారు తెలిపారు.

వివరాలు IVలో ▸

9న అల్పపీడనం!



ఈ నెల 9న బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం తెలిపింది. దీని ప్రభావంతో ఈనెల 8 నుంచి కోస్తాంధ్ర, రాయలసీమల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే వీలుందని వివరించింది.

వివరాలు 5లో ▸

భారీగా పెరగనున్న ఉద్యోగుల పింఛన్ల వ్యయం



ఉద్యోగుల పింఛన్ల భారం రాష్ట్ర ప్రభుత్వంపై భారీగా పెరిగిపోతోంది. 2021–22లో పింఛన్ల ఖర్చు రూ.20,326.67 కోట్లుగా ఉండగా.. 2024కు రూ.25,520.04 కోట్లకు, 2031 నాటికి రూ.34,251.89 కోట్లకు పెరుగుతుందని ఆర్థిక శాఖ తెలిపింది.

వివరాలు 3లో ▸

చైనాలో భూకంపం.. 46 మంది మృతి



చైనాలోని సిచువాన్ ప్రావిన్స్ లుడింగ్ కౌంటీలో సోమవారం భూకంపం సంభవించగా.. 46 మంది మృతి చెందారు. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.8గా నమోదైంది.

వివరాలు 6లో ▸

రూ.1,26,622.23 కోట్లు

రాష్ట్రంలో 36,380 మందికి ఉపాధి లభించేలా పెట్టుబడులు



- సీఎం జగన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్ఐపీబీ ఆమోదం
- ఒక్క గ్రీన్ ఎనర్జీ రంగంలోనే రూ.81,043 కోట్ల పెట్టుబడులు
- రూ.43,143 కోట్లతో రామాయపట్నం వద్ద ఇండోసోల్ సోలార్ ప్యానెల్, సోలార్ యూనిట్
- కాకినాడ సెజ్‌లో రూ.1,900 కోట్లతో లైఫిజ్ ఫార్మా యూనిట్
- వైఎస్సార్ జిల్లా కొప్పర్తిలో రూ.386.23 కోట్లతో కాసిస్ ఎలక్ట్రిక్ బస్సుల తయారీ యూనిట్
- కృష్ణా జిల్లా మల్లవల్లి వద్ద రూ.150 కోట్లతో అవిశా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్
- గ్రీన్ ఎనర్జీ యూనిట్లతో రాష్ట్ర ఆర్థిక ముఖ చిత్రం మారుతుందన్న సీఎం
- నిరర్థక భూముల ద్వారా రైతులకు ఏటా ఎకరాకు లీజు ద్వారా రూ.30 వేలు

2లో



నేడే రెండు బ్యారేజీలు ప్రారంభం

పెన్నా పారవశ్యం!

- మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజ్, నెల్లూరు బ్యారేజ్‌లను జాతికి అంకితం చేయనున్న సీఎం వైఎస్ జగన్
- 'నెల్లూరు' ప్రజల వందేళ్ల కల సాకారం
- ఆంగ్లేయుల హయాంలో కట్టిన ఆనకట్టలు శిథిలం
- జలయజ్ఞంలో భాగంగా రెండు బ్యారేజ్‌ల నిర్మాణానికి వైఎస్సార్ శ్రీకారం
- తండ్రి చేపట్టిన బ్యారేజ్‌లను తనయుడు పూర్తి చేయడం చరిత్రలో ఇదే ప్రథమం
- సంగం బ్యారేజ్‌తో 3.85 లక్షలు, నెల్లూరు బ్యారేజ్‌తో 99,525 ఎకరాల ఆయకట్టు సస్యశ్యామలం
- పెన్నా పరీవాహకంలో ముంపు ముప్పు, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- బ్యారేజ్ కమ్ రోడ్ బ్రిడ్జిలతో సంగం–పొదలకూరు, నెల్లూరు–కోవూరుల మధ్య సజావుగా రాకపోకలు

3లో

'నవయుగ' అప్పీల్‌లో కీలక పరిణామం

- ధర్మాసనంలోని ఓ న్యాయమూర్తికి పరస్పర విరుద్ధ ప్రయోజనాలున్నాయి
- ఆయన గతంలో నవయుగ కంపెనీతో కలసి ఉన్నారు
- అలాంటి విషయాలన్నీ ముందే చెప్పాలని సుప్రీం ఆదేశించింది
- అందుకే విరుద్ధ ప్రయోజనాల విషయాన్ని మీ దృష్టికి తెస్తున్నాం
- రాష్ట్ర సర్కార్ తరఫున ధర్మాసనానికి అడ్వొకేట్ జనరల్ నివేదన
- అప్పీల్ విచారణకు ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటు చేస్తానన్న సీజే

7లో



బెంగళూరు అతలాకుతలం

■ భారీ వర్షాల ధాటికి బెంగళూరు అతలాకుతలమయ్యింది. 13 సెంటీమీటర్ల వర్షపాతం నమోదవ్వగా.. రోడ్లు, పలు ప్రాంతాలు నీట మునిగాయి. జన జీవనం అస్తవ్యస్తం అయ్యింది. సహాయక చర్యలకు అధికారులు పడవలను ఆశ్రయించారు.

- వివరాలు 6లో

ఇదండీ సంగతి



నిజమే సార్! ఇప్పుడు జైళ్లు చాలా అవసరం!

క్లుప్తంగా

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న అరుణ



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 45 మంది ఉపాధ్యాయులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ సోమవారం ఢిల్లీలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను ప్రదానం చేశారు. విజయవాడ సమీపంలోని కానూరు జెడ్పీహెచ్ స్కూల్లో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న డాక్టర్ రావి అరుణ రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. అలాగే తెలంగాణలో నవాబ్ పేట జెడ్పీ స్కూల్‌కు చెందిన టీఎస్ శ్రీధర్, అబ్బాపూర్ జెడ్పీ స్కూల్‌కు చెందిన కందాళ రామయ్య, హైదరాబాద్ నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ సునీతరావు కూడా ఈ అవార్డులు అందుకున్నారు.

భవితనిచ్చేది గురువులే

ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి : జ్ఞానాన్ని పంచి, నడత నేర్పించే పూజ్య గురువులందరికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తల్లిదండ్రులు జన్మనిస్తే, ఆ పిల్లలకు భవితనిచ్చేది గురువులేనని సోమవారం ఆయన ట్వీట్ చేశారు.

గురువర్యా.. ఇదిగో మీ కళ్లజోడు!



కింద పడిన ఉపాధ్యాయుడి కళ్ల జోడును పైకి తీస్తున్న సీఎం వైఎస్ జగన్

విజయవాడ/చీరాల అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన గురుపూజోత్సవంలో అరుదైన సంఘటన చోటుచేసుకుంది. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన ఉపాధ్యాయులకు సీఎం వైఎస్ జగన్ అవార్డులను అందజేస్తుండగా.. అవార్డు అందుకుంటున్న బాపట్ల జిల్లా చీరాల రూరల్ మండలం ఈపూరుపాలెం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మొలబంటి వెంకటేశ్వర్ల కళ్లజోడు కింద పడిపోయింది. ఆ విషయం గమనించిన సీఎం జగన్.. దానిని చేత్తో పైకి తీసి, ఆ ప్రధానోపాధ్యాయుడి జేబులో పెట్టారు. ఓ గురువు పట్ల సీఎం వినయం ప్రదర్శించిన తీరును అక్కడ ఉన్న వారంతా ప్రశంసించారు.

ఉపాధ్యాయుల సేవలు ఎనలేనివి

మంత్రి ఆదిమూలపు సురేష్



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మంత్రి సురేష్

సాక్షి, అమరావతి: భవిష్యత్ తరాలను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. ఇందులో ఉపాధ్యాయుల సేవలు కూడా ఎనలేనివని కొనియాడారు. సోమవారం గుంటూరులోని తన క్యాంపు కార్యాలయంలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అజ్ఞానాన్ని తొలగించి, విజ్ఞానాన్ని పంచి, క్రమశిక్షణను అలవర్చి, జీవితాన్ని సన్మార్గంలో నడిపించే గురువులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

560 ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పోస్టులకు నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 560 ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్(గ్రేడ్–2) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సంచాలకులు అట్టాడ సిరి సోమవారం విడుదల చేశారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే కాంట్రాక్టు వర్కర్లు, సూపర్‌వైజర్లతో 560 పోస్టులను భర్తీ చేయనున్నట్టు చెప్పారు. అర్హులైన వారు ఈ నెల 12లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు హాల్‌టికెట్లు జారీ చేసి.. 18వ తేదీన పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని నాలుగు జోన్లు(విశాఖ, ఏలూరు, ఒంగోలు, కర్నూలు) పరిధిలో.. నిర్దేశించిన కేంద్రాల్లో అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉంటుందని సిరి పేర్కొన్నారు.

రూ.1,26,622.23 కోట్లు

రాష్ట్రంలో 36,380 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించేలా పెట్టుబడులు | సీఎం జగన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్ఐపీబీ ఆమోదం

సాక్షి, అమరావతి : రాష్ట్ర పారిశ్రామిక రంగంలో నూతన శకాన్ని లిఖిస్తూ రూ.1,26,622.23 కోట్ల విలువైన పెట్టుబడులకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) ఆమోదం తెలిపింది. గ్రీన్ ఎనర్జీ, ఫార్మా, ఎలక్ట్రిక్ వాహనాలు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు చెందిన వివిధ పెట్టుబడుల ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. ఆయా కంపెనీల ఏర్పాటు ద్వారా 36,380 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది. ఇందులో ఒక్క గ్రీన్ ఎనర్జీ రంగంలోనే రూ.81,043 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇండోసోల్ సోలార్, ఆస్ట్రా గ్రీన్, షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్, అరబిందో రియాల్టీ అండ్ ఇన్‌ఫ్రా, ఏఎం గ్రీన్ ఎనర్జీ, గ్రీన్‌కో వంటి సంస్థలు పర్యావరణ ఉపయుక్తమైన ఆరు పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నాయి. ఈ ఆరు గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ల ద్వారా 17,930 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కానుంది. ఈ యూనిట్ల ద్వారా 20,130 మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. వీటితో పాటు నెల్లూరు జిల్లా రామాయపట్నం వద్ద ఇండోసోల్ సోలార్ కంపెనీ మరో రూ.43,143 కోట్లతో మెటలర్జికల్ గ్రేడ్ సిలికాన్, పాలీ సిలికాన్, ఫ్లోట్.. రోల్డ్ గ్లాసెస్ తయారీ యూనిట్‌తో పాటు సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. కాకినాడ సెజ్ వద్ద రూ.1,900 కోట్ల పెట్టుబడితో లైఫిజ్ ఫార్మా, వైఎస్సార్ జిల్లా కొప్పర్తి వద్ద కాసిస్ రూ.386.23 కోట్లతో ఎలక్ట్రిక్ బస్సుల తయారీ కేంద్రం, కృష్ణా జిల్లా మల్లవల్లి వద్ద రూ.150 కోట్లతో అవిశాఫుడ్స్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రతిపాదనలకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి (గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ) బూడి ముత్యాలనాయుడు, విద్యుత్, అటవీ, పర్యావరణ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, పరిశ్రమలు, పెట్టుబడులు, మౌలిక వసతుల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, కార్మిక, ఉపాధి, శిక్షణ శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్, సీఎస్ సమీర్ శర్మ, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పెట్టుబడుల ప్రతిపాదనల వివరాలు

■ రూ.286.23 కోట్లతో కాసిస్ ఎలక్ట్రిక్ బస్సుల తయారీ యూనిట్. ■ వైఎస్సార్ జిల్లా కొప్పర్తిలో పరిశ్రమను ఏర్పాటు చేయనున్న కాసిస్ ఇ–మొబిలిటీ ప్రైవేట్ లిమిటెడ్. ■ రూ.386.23 కోట్ల పెట్టుబడి పెట్టనున్న కంపెనీ. ఇందులో ఎలక్ట్రిక్ బస్సుల తయారీ కోసం రూ.286.23 కోట్లు, చార్జింగ్ మౌలిక సదుపాయాల కోసం రూ.100 కోట్ల పెట్టుబడి. ■ తొలి విడతలో అత్యాధునిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని 1,000 ఎలక్ట్రిక్ బస్సులు తయారు చేయాలని లక్ష్యం. ■ 1200 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు.



ఎస్ఐపీబీ సమావేశంలో మంత్రులు, అధికారులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

రూ.43,143 కోట్లతో ఇంటిగ్రేటెడ్ సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్

- ■ మెటలర్జికల్ గ్రేడ్ సిలికాన్, పాలీ సిలికాన్, ఫ్లోట్ అండ్ రోల్డ్ గ్లాసెస్ తదితర వాటి తయారీ కోసం పరిశ్రమతో పాటు సోలార్ విద్యుత్ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్న ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్.
- ■ మూడు విడతల్లో మొత్తంగా రూ.43,143 కోట్ల పెట్టుబడి.
- ■ 11,500 మందికి ప్రత్యక్షంగా, 11 వేల మందికి పరోక్షంగా ఉద్యోగాలు.
- ■ నెల్లూరు జిల్లా రామాయపట్నం వద్ద 5,147 ఎకరాల్లో తయారీ పరిశ్రమ, దీంతో పాటు 50 గిగావాట్లు, 10 గిగావాట్ల సోలార్ విద్యుత్ ప్రాజెక్టులను నెలకొల్పనున్న ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్.

రూ.1,900 కోట్లతో లైఫిజ్ ఫార్మా యూనిట్

■ కాకినాడ ఎస్ఈజెడ్‌లో యూనిట్ ఏర్పాటు చేయనున్న లైఫిజ్ ఫార్మా. ■ మొత్తంగా రూ.1,900 కోట్ల పెట్టుబడి పెట్టనున్న కంపెనీ. ■ 2 వేల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు. ■ ఏప్రిల్ 2024 నాటికి కంపెనీ ఏర్పాటు పూర్తి చేయాలని లక్ష్యం. ■ ఏపీఐ డ్రగ్ తయారీలో చైనా దిగుమతులపై ఆధార పడకుండా.. స్వయం సమృద్ధి సాధించే దిశగా అడుగులు. ■ పరిశ్రమ కోసం ఇప్పటికే 236.37 ఎకరాలు సేకరించిన కంపెనీ.

రూ.150 కోట్లతో అవిశా ఫుడ్స్ ప్రాసెసింగ్ యూనిట్

■ కృష్ణా జిల్లా మల్లవల్లిలో మెగా ఫుడ్‌పార్క్‌ను ఏర్పాటు చేయనున్న అవిశా ఫుడ్స్ లిమిటెడ్. ■ రూ.150 కోట్ల పెట్టుబడి, 2,500 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు. ■ 2023 మార్చి నాటికి పూర్తి చేసే దిశగా కంపెనీ అడుగులు. ■ ఇందు కోసం 11.64 ఎకరాల భూమి కేటాయింపు.

రైతుల ఆదాయం పెరుగుతుంది: సీఎం

రాష్ట్రంలో కొత్తగా వస్తున్న పెట్టుబడులతో రాష్ట్ర ఆర్థిక ముఖ చిత్రం మారడంతో పాటు క్లీన్ ఎనర్జీలో రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పెద్దగా ఆదాయం రాని భూముల్లో గ్రీన్ ఎనర్జీ యూనిట్లు ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు లీజు రూపంలో ఏటా ఎకరాకు రూ.30,000 ఆదాయం వస్తుందన్నారు. 'గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు రాష్ట్ర ఆర్థిక ముఖ చిత్రాన్ని మార్చబోతున్నాయి. ప్రాజెక్టుల్లో భారీగా ఉద్యోగాల కల్పన జరుగుతుంది. ఆర్థిక వ్యవస్థ పురోగమించడమే కాకుండా క్లీన్ ఎనర్జీలో దేశానికి ఆదర్శంగా నిలుస్తాం. రైతులకు పెద్దగా ఆదాయాలు రాని భూములకు లీజు కింద డబ్బు వస్తుంది. దీనివల్ల వారికి ఆదాయాలు పెరుగుతాయి. పరిశ్రమల ఏర్పాటు, వాటి నిర్వహణ తదితర వాటి కోసం పెద్ద ఎత్తున సంస్థలు ప్రవేశిస్తాయి. వాటి ద్వారా నైపుణ్యాభివృద్ధి జరుగుతుంది' అని చెప్పారు.

ఆరు గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు ఇవీ..

- ■ వైఎస్సార్ జిల్లా వొంగిమల్ల వద్ద 1,800 మెగావాట్ల పంప్డ్ హైడ్రో స్టోరేజీ పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్న ఆస్ట్రా గ్రీన్ ఎనర్జీ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్. దీనికోసం రూ.8,240 కోట్ల పెట్టుబడి. ప్రత్యక్షంగా 4 వేల మందికి ఉద్యోగాలు. 1,390 ఎకరాల్లో ప్రాజెక్టు ఏర్పాటు. డిసెంబర్ 2029 నాటికి ఏర్పాటు చేయాలని లక్ష్యం.
- ■ సోమశిల, ఎర్రవరం వద్ద రెండు పంప్డ్ హైడ్రో స్టోరేజీ పవర్ ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం. సోమశిల వద్ద 900 మెగావాట్లు, ఎర్రవరం వద్ద 1,200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి. 2,100 మెగావాట్ల ప్రాజెక్టు కోసం రూ.8,855 కోట్లు ఖర్చు చేయనున్న షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్. 1600 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు. జూలై 2029 నాటికి పూర్తి చేయాలని లక్ష్యం.
- ■ అవుకు, సింగనమల వద్ద రెండు పంప్డ్ హైడ్రో స్టోరేజ్ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపిన ఎస్ఐపీబీ. మొత్తంగా రూ.6,315 కోట్ల పెట్టుబడి పెట్టనున్న అరబిందో రియాల్టీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్. 1,600 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు. అవుకు వద్ద 800 మెగావాట్లు, సింగనమల వద్ద 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులు. డిసెంబర్ 2028 నాటికి ఈ రెండు ప్రాజెక్టులు పూర్తి చేయాలని లక్ష్యం.
- ■ వైఎస్సార్ జిల్లా పైడిపాలెం వద్ద పంప్డ్ హైడ్రో, సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనున్న ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్. 7,200 మెగావాట్ల కరెంటు ఉత్పత్తి కోసం రూ.33,033 కోట్లు ఖర్చు చేయనున్న కంపెనీ. పైడిపాలెం ఈస్ట్ 1,200 మెగావాట్లు, నార్త్ 1,000 మెగావాట్లు, 3,500 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టు, 1500 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటు. 7,200 మందికి ప్రత్యక్షంగా ఉపాధి. డిసెంబర్ 2028 నాటికి పూర్తి చేయాలని లక్ష్యం. ఈ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపిన ఎస్ఐపీబీ.
- ■ కర్నూలు, నంద్యాల జిల్లాల్లో సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనున్న ఏఎం గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్. రూ.5 వేల కోట్ల పెట్టుబడి. ఆమోదం తెలిపిన ఎస్ఐపీబీ. 1,000 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు. 700 మెగావాట్ల సోలార్, 300 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనున్న కంపెనీ. మార్చి 2025 నాటికి ప్రాజెక్టులు పూర్తి చేయాలని లక్ష్యం.
- ■ కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పంప్డ్, సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనున్న గ్రీన్‌కో. 1,680 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు, 2,300 మెగావాట్ల సోలార్, 250 మెగావాట్ల విండ్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనున్న గ్రీన్‌కో. మొత్తంగా రూ.19,600 కోట్ల పెట్టుబడి. 4,230 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు. సెప్టెంబర్ 2026 నాటికి పూర్తి చేయాలని లక్ష్యం.

గురువులకు గౌరవం

- గత ప్రభుత్వానికి భిన్నంగా ఈ ఏడాది గురుపూజోత్సవం
- 180 మందికి స్వయంగా అవార్డులు అందజేసిన సీఎం వైఎస్ జగన్
- వీల్ చైర్‌లో వచ్చిన వారికి కిందకు వంగి అవార్డు అందజేత

సాక్షి, అమరావతి: విద్యా శాఖ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం గురుపూజోత్సవాలను ఘనంగా నిర్వహించింది. రాష్ట్ర, జిల్లా, పాఠశాలల స్థాయిలో ఉపాధ్యాయులు, అధ్యాపకులకు గౌరవ పురస్కారాలు అందించింది. కొన్ని ఉపాధ్యాయ సంఘాలు గురుపూజోత్సవాల బహిష్కరణకు పిలుపునిచ్చినా టీచర్లు ఎక్కడా దానిని పట్టించుకోలేదు. గతంలో కన్నా ఎక్కువ ఉత్సాహంతో ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ముఖ్య అతిథిగా హాజరై గురువులను సన్మానించారు. గతంలో గురుపూజోత్సవాలకు భిన్నమైన వాతావరణంలో ఈసారి వేడుకలు జరిగాయి. గతంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన గురువులకు సరైన గౌరవం దక్కేది కాదు. నేతలు, ఇతరుల ప్రసంగాలకే ఎక్కువ సమయం వెచ్చించేవారు. సీఎం చేతుల మీదుగా నలుగురైదుగురికి అవార్డులు పంపిణీ చేయించి మమ అనిపించేవారు. దీంతో మిగతా వారు నిరాశ, నిస్పృహలకు గురయ్యేవారు. అయితే ఈసారి ఉత్తమ ఉపాధ్యాయులుగా 180 మందిని ఎంపిక చేయగా.. ప్రతి ఒక్కరికీ సీఎం జగన్ స్వయంగా మెమెంటో, బెస్ట్ టీచర్ ధ్రువపత్రాన్ని అందజేశారు. అవార్డు అందుకున్న వారిలో కొంత మంది వీల్ చైర్‌లో రాగా, సీఎం ఎంతో గౌరవంగా కిందకు వంగి కూర్చొని మరీ వారికి అవార్డులు అందించారు. గురువుల పట్ల సీఎం వినయ విధేయతలు చూపడం సర్వత్రా ప్రశంసలు అందుకుంది. ఈ కార్యక్రమంలో మంత్రి జోగి రమేష్, అధికారులు పాల్గొన్నారు.

స్నేహ పూర్వక ప్రభుత్వమిది: మంత్రి బొత్స సత్యనారాయణ

ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల స్నేహ పూర్వకంగా ఉండే ప్రభుత్వం ఇది. వారి ప్రయోజనాల పరిరక్షణలో సీఎం జగన్ ఎప్పుడూ ముందుంటారు. మన పిల్లలను గ్లోబల్ సిటిజెన్‌గా తీర్చిదిద్దాలనే తపనతో సీఎం విద్యా రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. నాడు–నేడు కింద సుమారు రూ.3 వేల కోట్లకు పైగా నిధులతో మొదటి విడత దాదాపు 16 వేల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, పిల్లలకు బైజూస్ కంటెంట్, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు, తదితర ఎన్నో పథకాలు చేపట్టాం. పాఠశాలలన్నీ దశల వారీగా సీబీఎస్ఈకి అనుసంధానిస్తున్నాం. ఉపాధ్యాయుల ప్రయోజనాలు కాపాడేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అధ్యాపక వృత్తిలో ఉన్న వారందరికీ పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాం. పదోన్నతులు కల్పిస్తున్నాం.



గురుపూజోత్సవం సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి సీఎం వైఎస్ జగన్ నివాళులు



గురుపూజోత్సవం కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు, అధికారులు

బంగారు భవిష్యత్

▶ మొదటి పేజీ తరువాయి

ప్రతి ఒక్కరూ ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థిని ఉన్నతంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతోందని, ఇవి సత్ఫలితాలు ఇచ్చి పిల్లలు అత్యున్నత స్థాయిలోకి వెళ్లేలా చేయడంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులదే కీలక భూమిక అన్నారు. ఈ దిశగా అందరూ ప్రభుత్వానికి తోడ్పాటు అందించాలని కోరారు. 'కొన్ని సామాజిక వర్గాలు వేల సంవత్సరాలపాటు చదువులకు దూరంగా ఉన్నాయి. ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు, పేదల పిల్లలు వారి మీద రుద్దిన చదువులను వేరే గత్యంతరం లేక చదువుకుంటున్నారు. వాటిని మార్చడంపై మన ప్రభుత్వం దృష్టి పెట్టింది. అత్యంత ప్రాధాన్యతా రంగంగా విద్యారంగాన్ని గుర్తించడంతో పాటు మూడేళ్ల కాలంలో అనేక అడుగులు ముందుకు వేశాం' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

> ఒక మంచి టీచర్
> ఒక స్కూలును, ఒక వ్యవస్థను మార్చగలడు. గ్రామంతో మొదలు పెట్టి.. గొప్ప విప్లవాన్ని తీసుకు రాగలుగుతాడు. తన కన్న పిల్లల కోసమే కాదు, తరగతిలో ఉన్న పిల్లలందరూ బాగు పడాలని టీచర్ ఆరాట పడతారు.
> పిల్లలకు కేవలం సబ్జెక్టు మాత్రమే కాకుండా, వారి వ్యక్తిత్వాన్ని కూడా మలుస్తారు. వివేకాన్ని పెంచుతారు. పిల్లల్లోని ప్రతిభను బయటకు తీయడంలో కీలక పాత్ర పోషిస్తారు. క్రమశిక్షణతో జీవించడం నేర్పుతారు. బతకడం ఎలాగో టీచర్ నుంచే నేర్చుకుంటారు. తన కన్నా తన శిష్యులు గొప్ప వాళ్లు కావాలని ఆరాట పడతారు.







రిటైర్డ్ టీచర్ పఠాన్ లియాఖత్ అలీఖాన్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకుంటున్న సీఎం

విజయనగరం జిల్లాకు చెందిన ప్రభుత్వ టీచర్ బలగా సుమన, కర్నూలు ప్రభుత్వ మహిళా కాలేజ్ అధ్యాపకురాలు ఇర్ఫాన్ బేగంలకు పురస్కారాలు అందజేస్తున్న సీఎం జగన్

> గత ప్రభుత్వంలో మాదిరి విద్యా రంగం నుంచి ప్రభుత్వం తప్పుకుని, కార్పొరేట్ వర్గాలకు ఈ రంగాన్ని అమ్మేసి.. పేద సామాజిక వర్గాలకు అన్యాయం చేయడానికి ఈ సంస్కరణలు తీసుకురాలేదు. పెద్ద చదువులకు, మంచి చదువులకు.. పేదరికం ఏమాత్రం అడ్డు కాకూడదు అన్న ఉద్దేశంతో తెచ్చిన మార్పులివి. గతంలో మాదిరి కార్పొరేట్ రంగంతో కుమ్మక్కై ఇంగ్లిష్ మీడియం, క్వాలిటీ ఎడ్యుకేషన్‌ను పేదలకు దూరంచేసే మార్పులు కావు. ప్రభుత్వ టీచర్లను ఏమాత్రం ఇబ్బంది పెట్టేవి కావు. ప్రభుత్వ స్కూళ్లను నిర్వీర్యం చేసేవి అంతకంటే కావు.

గురువులందరికీ వందనం

- ➡ రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ విద్యా సంస్థల్లో పని చేస్తున్న టీచర్లకు, లెక్చరర్లకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు. గురువులందరికీ శిరస్సు వంచి వందనం చేస్తున్నా. ఉపాధ్యాయులు అందరికీ శిఖరం లాంటి వ్యక్తి సర్వేపల్లి రాధాకృష్ణన్. ఆయన రాష్ట్రపతి స్థాయికి ఎదిగి, అందరికీ స్ఫూర్తిగా నిలిచారు.
- ➡ 'నాకు జన్మనిచ్చినందుకు నా తండ్రికి రుణపడి ఉంటాను. ఈ జన్మను సార్థకం చేస్తూ.. మెరుగైన జీవితాన్ని పొందడం ఎలాగో నేర్పినందుకు నా గురువుకు రుణపడి ఉంటాను' అనేవి స్ఫూర్తిదాయకమైన మాటలు. ఇవి నేను చెప్పడమే కాదు.. ఒకప్పుడు ప్రపంచాన్నే ఏలిన గొప్ప నాయకుడు అలెగ్జాండర్ కూడా చెప్పారు. సానపట్టక ముందు వజ్రమైనా రాయి లాగే ఉంటుంది. మంచి శిల్పి చేతిలో పడితే రాయి కూడా అద్భుతమైన శిల్పంగా మారుతుంది. అలాంటి అద్భుత శిల్పాలను చెక్కే వారు మన ఉపాధ్యాయులు.

దేశంలోనే ముందుండాలని..

- ➡ దేశంలో అన్ని రాష్ట్రాలకన్నా.. మెరుగ్గా ఉండేలా విద్యా రంగాన్ని తీర్చిదిద్దుతూ అడుగులు వేస్తున్నాం. ప్రపంచంలో చాలా వేగంగా మార్పులు వస్తున్నాయి. అందుకు అనుగుణంగా మన పిల్లలనూ తీర్చిదిద్దాల్సిన అవసరముంది. అందుకే విద్యా రంగాన్ని అత్యంత ప్రాధాన్యతా రంగంగా గుర్తించాం. ఈ మూడేళ్లలో అనేక అడుగులు ముందుకు వేశాం.
- ➡ నేను ముఖ్యమంత్రి అయ్యాక విద్యా శాఖ మీద చేసిన రివ్యూలు బహుశా మరే శాఖ మీదా చేయలేదు. ఎందుకంటే.. మన రాష్ట్రంలోని పిల్లలు, వారి కుటుంబాల తలరాతలను మార్చగలిగే ఒక అస్త్రం చదువు మాత్రమే. అందుకే విద్యా రంగంపై అంతగా దృష్టి పెట్టాను.

> విద్యా రంగం మీద ప్రేమ, సానుభూతి ఉన్న ఏకైక ప్రభుత్వం మనది. పేదలకు ఉచిత విద్యను, నాణ్యమైన విద్యను, జీవితంలో వారు నిలదొక్కుకోవడానికి ఉపయోగపడే విద్యను ఇవ్వాలన్నది మన విధానం. ఇందులో చదువు చెప్పడం మాత్రమే కాకుండా, శిలలను శిల్పాలుగా చెక్కినట్లు.. వ్యక్తిత్వాన్ని సైతం మలిచే ఉపాధ్యాయులుగా మీ తోడ్పాటు చాలా ముఖ్యం.

ప్రభుత్వ బడికి ఘన వైభవం

- ➡ గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యానికి గురైన విద్యా సంస్థలను అభివృద్ధి పరిచి, వాటికి ఘన వైభవం చేకూర్చే తపనతో ప్రభుత్వం ఈ మార్పులు చేపట్టింది. నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇతర పేదలు దశాబ్దాలుగా ఆశించిన ఫలితాల కోసం చేపట్టిన మార్పులు ఇవి. పిల్లల చదువులను ప్రోత్సహించేందుకు తల్లులకు మద్దతుగా ఉండేందుకు తెచ్చిన మార్పులివి. ప్రభుత్వ బడి కార్పొరేట్ బడికన్నా బాగుండాలని చేసిన మార్పులివి. టీచర్లు తమ పిల్లలను కూడా ప్రభుత్వ స్కూళ్లలోనే చదివించాలన్న మంచి సంకల్పంతో తీసుకొస్తున్న మార్పులివి. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడం ఎలా? లిటరసీని పెంచడం ఎలా? నాణ్యమైన విద్యను అందించడం ఎలా? అను ప్రశ్నలకు సమాధానంగా తీసుకొస్తున్న మార్పులు ఇవి.

> అమ్మ ఒడి, సంపూర్ణ పోషణ, గోరుముద్ద, విద్యా కానుక, మనబడి నాడు–నేడు, ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్, సబ్జెక్ట్ టీచర్స్ కాన్సెప్ట్, బైజూస్‌తో ఒప్పందం, ఎనిమిదవ తరగతి పిల్లలకు ట్యాబ్‌ల పంపిణీ, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, బై లింగువల్ టెక్ట్స్ బుక్స్ పంపిణీ, సునాయాసంగా బోధించేందుకు టీచర్లకు స్కిల్స్ అప్‌గ్రేడేషన్ ప్రోగ్రాం, ఉన్నత విద్యలో విద్యా దీవెన, వసతి దీవెన, కరిక్యులమ్‌లో మార్పులు.. ఇలా వీటన్నింటి కోసం ఈ మూడేళ్లలో మనందరి ప్రభుత్వం ఖర్చు చేస్తున్న సొమ్ము రూ.53 వేల కోట్లు.

- ➡ ఉన్నత విద్యలో కనీసంగా 70 శాతం జీఈఆర్ రేషియో ఉండాలన్న ఉద్దేశంతో అడుగులు ముందుకేస్తున్నాం. ఇవన్నీ బాగుండాలంటే, ఈ లక్ష్యాలు చేరుకోవాలంటే.. మనం అంతా ఒక్కటిగా ముందుకు సాగితేనే సాధ్యం అవుతుంది.

గత ప్రభుత్వంలో కార్పొరేట్‌కు అందలం

- ➡ గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ విద్యా రంగాన్ని నిర్వీర్యం చేసి, కార్పొరేట్ విద్యా రంగానికి పెద్దపీట వేశారు. ప్రభుత్వ స్కూళ్లకు, ఆస్పత్రులకు, చివరకు ఆర్టీసీ బస్సు ఎక్కడం కూడా వేస్ట్ అన్న రీతిలో వ్యవహారం సాగింది. తుదకు ఉద్యోగులను తీసేసే పరిస్థితిలోకి వెళ్లింది.
- ➡ మన ప్రభుత్వం వచ్చాక ఉపాధ్యాయులను, ఉద్యోగులను ఎంతో గౌరవిస్తోంది. ఎవరూ అడక్కపోయినా 62 ఏళ్లకు పదవీ విరమణ వయసును పెంచాం. ఎస్జీటీలను ఎస్ఏలుగా, ఎస్ఏలను గ్రేడ్–2 హెడ్మాస్టర్లుగా, హెడ్మాస్టర్లను ఎంఈఓలుగా ప్రమోషన్లు ఇస్తున్నాం. విద్యా రంగాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దడానికి ఇవి అవసరమని భావించి, క్షేత్ర స్థాయిలో విద్యా బోధనను పటిష్టం చేసేందుకు అడుగులు ముందుకేస్తున్నాం.

చిత్తశుద్ధితో పెన్షన్ సమస్యకు పరిష్కారం..

- ➡ ఏ ఒక్కరూ కూడా పట్టించుకోని ఉద్యోగుల పెన్షన్ విషయం మీద పూర్తి చిత్తశుద్ధితో, వారికి మేలు చేసేలా అడుగులు వేస్తున్నాం. మంచి పరిష్కారం కోసం వెతుకుతున్న ప్రభుత్వం మనదే. ఇప్పుడున్న ప్రతిపక్షం గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోలేదు. వారికి మంచి చేయాలని ఏనాడూ ప్రయత్నించలేదు.
- ➡ కానీ ఇప్పుడు మంచి చేస్తున్న మన ప్రభుత్వానికి వ్యతిరేకంగా వారిని రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తోంది. ఉద్యోగులకు చేస్తున్న మేలు గురించి, వారి పెన్షన్‌పై చేస్తున్న కృషికి సంబంధించి ఒక్క వాక్యం కూడా రాయని, చూపని ఎల్లో మీడియా.. ఇప్పుడు మనం పరిష్కారం కోసం చిత్తశుద్ధితో అడుగులు ముందుకు వేస్తోంటే రెచ్చగొట్టేలా కుతంత్రాలు పన్నుతోంది.
- ➡ వీటన్నింటినీ గమనించాలని మిమ్మల్ని కోరుతున్నాను. అన్ని వర్గాలకు మంచి చేసిన చరిత్ర కలిగిన.. టీచర్లకు, ప్రభుత్వ స్కూళ్లకు ఎన్నడూ లేని గౌరవాన్ని పెంచిన ఈ ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండదండలు అందించాలి.

క్లుప్తంగా

ఏఎంఆర్ సమస్యను ఎదుర్కొనేందుకు చర్యలు

వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణబాబు, పక్కన నవీన్ కుమార్ తదితరులు

సాక్షి, అమరావతి: యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) సమస్యను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ రంగంలో భారీ స్థాయిలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు చెప్పారు. 'ఏపీ యాక్షన్ ప్లాన్ ఫర్ కంటైన్మెంట్ ఆఫ్ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్'పై మంగళగిరిలోని వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో సోమవారం వర్చువల్ సమావేశం నిర్వహించారు. కృష్ణబాబు మాట్లాడుతూ ఇన్ఫెక్షన్ల నియంత్రణకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇందు కోసం సుశిక్షితులైన సిబ్బందిని నియమిస్తున్నామని పేర్కొన్నారు. అనుభవం గల వ్యక్తులతో కూడిన బృందాలు ఆస్పత్రులు, ల్యాబ్‌లను పరిశీలించి ఇన్ఫెక్షన్ల నియంత్రణపై సలహాలు, సూచనలు ఇస్తాయని చెప్పారు. ఈ సమస్యపై కృష్ణా జిల్లాలో ఇప్పటికే ఇండో–డచ్ పైలట్ ప్రాజెక్టు కింద అధ్యయనం పూర్తయిందన్నారు. శరీరంలో ఏఎంఆర్ పెరిగితే వ్యాధి నిరోధకత తగ్గిపోయి వ్యాధులను అదుపు చేయడం సాధ్యం కాదన్నారు. ఈ విషయంలో డ్రగ్ కంట్రోల్ అథారిటీ, ఇతర భాగస్వామ్య విభాగాలన్నీ తమ బాధ్యతలను సీరియస్‌గా నిర్వర్తించాల్సి ఉందన్నారు. యాంటీ బయోటిక్స్ విచ్చలవిడిగా వినియోగించడం వల్ల కలిగే నష్టాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. దేశంలో ఏఎంఆర్‌ను అమలు చేస్తున్న రాష్ట్రాల్లో ఏపీ నాలుగోది అని వివరించారు. ఈ సమావేశంలో వైద్య శాఖ ప్రత్యేక కార్యదర్శి నవీన్‌కుమార్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్, డ్రగ్ కంట్రోల్ డీజీ రవిశంకర్ నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

పెన్నా పారవశ్యం!

మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజ్, నెల్లూరు బ్యారేజ్‌లను జాతికి అంకితం చేయనున్న సీఎం జగన్



నాడు

2008 ఏప్రిల్ 29న నెల్లూరు బ్యారేజ్ పనులకు శంకుస్థాపన చేసిన వైఎస్సార్



నేడు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి చేసిన నెల్లూరు బ్యారేజ్

సాక్షి, అమరావతి: పెన్నా యవనికపై చారిత్రక ఘట్టం ఆవిష్కృతమవుతోంది. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా జీవనాడులైన మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజ్, నెల్లూరు బ్యారేజ్‌లను జలయజ్ఞంలో భాగంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టారు. ఈ రెండు బ్యారేజీలను పూర్తి చేసిన ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం జాతికి అంకితం చేయనున్నారు. తండ్రి చేపట్టిన రెండు బ్యారేజీలను తనయుడు పూర్తి చేసి జాతికి అంకితం చేయడం దేశ చరిత్రలో ఇదే ప్రథమమని అధికారవర్గాలు చెబుతున్నాయి. వందేళ్ల స్వప్నమైన రెండు బ్యారేజీలు సాకారమవడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. సంగం బ్యారేజ్ కింద 3.85 లక్షల ఎకరాలు, నెల్లూరు బ్యారేజ్ కింద 99,525 ఎకరాల ఆయకట్టుకు సమృద్ధిగా నీళ్లందించేందుకు మార్గం సుగమమైంది.

ఏటా ఇసుక బస్తాలకు భారీ వ్యయం

- నెల్లూరు జిల్లాలో కనిగిరి, కావలి, కనుపూరు కాలువల ద్వారా ఆయకట్టుకు నీళ్లందించేలా పెన్నా నదిపై సంగం వద్ద 1882–83లో 846 మీటర్ల పొడవు, 0.9 మీటర్ల ఎత్తుతో బ్రిటీష్ సర్కార్ ఆనకట్ట నిర్మించింది. ఆనకట్టకు దిగువన నదీ గర్భంలో నిర్మించిన రోడ్డు ద్వారా సంగం–పొదలకూరు మండలాల మధ్య రాకపోకలు సాగించేవారు. సంగం ఆనకట్ట శిథిలమవడంతో 0.3 మీటర్ల ఎత్తున ఇసుక బస్తాలు వేసి నీటిని నిల్వ చేసినా ఆయకట్టుకు సక్రమంగా నీళ్లందేవి కావు. పెన్నాకు వరద వస్తే ఇసుక బస్తాలు కొట్టుకుపోయేవి. ఇసుక బస్తాల కోసం ఏటా రూ.50 లక్షల నుంచి రూ.కోటికిపైగా వ్యయమయ్యేది. వరద వస్తే సంగం–పొదలకూరు మండలాల మధ్య రాకపోకలు పూర్తిగా స్తంభించేవి. ఆనకట్టలో నీళ్లు లేక తాగునీటికి తీవ్ర ఇక్కట్లు ఎదురయ్యేవి.
- సంగం ఆనకట్టకు 20 కి.మీ. దిగువన నెల్లూరు సమీపంలో 1854–55లో 481.89 మీటర్ల పొడవు, 0.7 మీటర్ల ఎత్తుతో ఆనకట్టను నిర్మించిన బ్రిటీష్ సర్కార్ సర్వేపల్లి, జాఫర్ సాహెబ్ కాలువల ద్వారా ఆయకట్టుకు నీళ్లందించింది. 1862లో వరదలకు కొట్టుకుపోవడంతో అదే ఏడాది మళ్లీ కొత్తగా 621.79 మీటర్ల పొడవుతో ఆనకట్ట నిర్మించారు. ఈ ఆనకట్ట కూడా శిథిలమవడంతో ఆయకట్టుకు నీళ్లందించడం సవాలుగా మారింది. ఇసుక బస్తాలు వేసి నీటిని నిల్వ చేసినా వరద వస్తే కొట్టుకుపోయేవి. దీనికోసం చాలా ఖర్చయ్యేది. పెన్నాకు ఏమాత్రం వరద వచ్చినా నెల్లూరు–కోవూరు మధ్య రాకపోకలు స్తంభించిపోయేవి. ఆనకట్టలో నీరు లేక నెల్లూరు దాహార్తితో తల్లడిల్లేది.
- సాగు, తాగునీరు, రవాణా, ముంపు ముప్పు సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఆనకట్టల స్థానంలో సంగం బ్యారేజ్, నెల్లూరు బ్యారేజ్‌ను నిర్మించాలని వందేళ్లుగా నెల్లూరు ప్రజలు కోరుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోలేదు. 2004 మే 14న సీఎంగా తొలిసారి ప్రమాణ స్వీకారం చేసిన దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి నెల్లూరు జిల్లా ప్రజల వందేళ్ల కలను సాకారం చేస్తూ సంగం, నెల్లూరు బ్యారేజ్‌ల పనులకు శ్రీకారం చుట్టారు. ఆయన హఠాన్మరణంతో పనులకు గ్రహణం పట్టింది.

నాటికి, నేటికి ఇదీ తేడా...

సంగం, నెల్లూరు బ్యారేజ్‌ల పనులను 2014 నుంచి 2016 వరకూ అధికారంలో ఉన్న చంద్రబాబు సర్కార్ పూర్తిగా నిలిపివేసింది. ఆ తర్వాత కమీషన్లు వసూలు చేసుకునేందుకు వీలున్న పనులను మాత్రమే చేపట్టారు. చివరకు రెండు బ్యారేజ్‌లను పూర్తి చేయలేక చేతులెత్తేశారు. 2019 మే 30న సీఎంగా బాధ్యతలు చేపట్టాక జలయజ్ఞం ప్రాజెక్టులపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. సంగం, నెల్లూరు బ్యారేజ్‌లను ప్రాధాన్యతగా చేపట్టి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. కరోనా, పెన్నాకు మూడేళ్లుగా వరదలు వంటి ప్రతికూల పరిస్థితులను అధిగమిస్తూ రెండు బ్యారేజ్‌లను సీఎం జగన్ పూర్తి చేశారు. సాగు, తాగునీటితోపాటు రవాణా సమస్యలను శాశ్వతంగా పరిష్కరించారు. బ్యారేజ్‌ల ద్వారా వరదను సమర్థంగా నియంత్రించి ముంపు ముప్పు తప్పించేలా మార్గం సుగమం చేశారు.

నెల్లూరు బ్యారేజ్

ఎక్కడ : నెల్లూరు నగరానికి సమీపంలో పెన్నా నదిపై (మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజ్‌కు 20 కి.మీ. దిగువన)
పరీవాహక ప్రాంతం : 51,800 చదరపు కిలోమీటర్లు
బ్యారేజ్ పొడవు : 640 మీటర్లు (బ్యారేజ్‌కు అనుబంధంగా రెండు వరుసల రోడ్ బ్రిడ్జి)
గేట్లు : 51 (పది మీటర్లు ఎత్తు, మూడు మీటర్ల వెడల్పుతో 43 గేట్లు.. పది మీటర్లు ఎత్తు, 4.3 మీటర్ల ఎత్తుతో ఎనిమిది స్కవర్ స్లూయిజ్ గేట్లు)
గేట్ల మరమ్మతుకు సిద్ధం చేసిన స్టాప్‌లాగ్ గేట్లు: 6
గేట్ల నిర్వహణ : వర్టికల్ లిఫ్ట్
గరిష్ట వరద విడుదల సామర్థ్యం : 10,90,000 క్యూసెక్కులు
గరిష్ట నీటి మట్టం : 14.3 మీటర్లు
గరిష్ట నీటి నిల్వ : 0.4 టీఎంసీలు
కనీస నీటి మట్టం : 11.3 మీటర్లు
ఆయకట్టు : 99,525 ఎకరాలు
అంచనా వ్యయం : రూ.274.83 కోట్లు
వైఎస్సార్ హయాంలో చేసిన వ్యయం : రూ.86.62 కోట్లు
టీడీపీ హయాంలో చేసిన వ్యయం : రూ.71.54 కోట్లు (కాంట్రాక్టర్ నుంచి కమీషన్లు వసూలు చేసుకోవడానికి సులభమైన పనులను మాత్రమే చేశారు)
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన వ్యయం : రూ.77.37 కోట్లు.

మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజ్

ఎక్కడ : శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సంగం వద్ద పెన్నా (సోమశిల రిజర్వాయర్‌కు 40 కి.మీ. దిగువన)
పరీవాహక ప్రాంతం: 50,122 చదరపు కిలోమీటర్లు
బ్యారేజ్ పొడవు : 1,195 మీటర్లు (బ్యారేజ్‌కు అనుబంధంగా రెండు వరసల రోడ్ బ్రిడ్జి)
గేట్లు : 85 గేట్లు(12 మీటర్లు ఎత్తు, 2.8 మీటర్ల వెడల్పుతో 79 గేట్లు.. 12 మీటర్ల ఎత్తు, 3.8 మీటర్ల వెడల్పుతో 6 స్కవర్ స్లూయిజ్ గేట్లు)
గేట్ల మరమ్మతుల కోసం సిద్ధం చేసిన స్టాప్ లాగ్ గేట్లు : 9
గేట్ల నిర్వహణ విధానం : వర్టికల్ లిఫ్ట్
గరిష్ట వరద విడుదల సామర్థ్యం : 7,50,196 క్యూసెక్కులు
గరిష్ట నీటి మట్టం : 35 మీటర్లు
గరిష్ట నీటి నిల్వ : 0.45 టీఎంసీలు
కనీస నీటి మట్టం : 32.2 మీటర్లు
ఆయకట్టు : 3.85 లక్షల ఎకరాలు
అంచనా వ్యయం : రూ.335.80 కోట్లు
వైఎస్సార్ హయాంలో వ్యయం : రూ.30.85 కోట్లు
టీడీపీ హయాంలో వ్యయం : రూ.86.10 కోట్లు (కాంట్రాక్టర్ నుంచి కమీషన్లు వసూలు చేసుకోవడానికి సులభమైన పనులను మాత్రమే చేపట్టారు)
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన వ్యయం : రూ.131.12 కోట్లు

ప్రైవేటు స్కూళ్లలో ఒకటో తరగతిలోకి ఉచిత ప్రవేశాలు

- విద్యా హక్కు చట్టం అమలుకు చర్యలు
- 12లోపు అడ్మిషన్లు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు

సాక్షి, అమరావతి: విద్యా హక్కు చట్టం కింద ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలోకి ఉచిత ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వర్గాలకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీలు, మైనార్టీలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 6 శాతం సీట్లు కేటాయిస్తున్నట్లు వివరించారు. ప్రైవేటు స్కూళ్లలో ఒకటో తరగతి విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయిస్తున్నామన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను డీఈవోల ద్వారా ఆయా పాఠశాలల యాజమాన్యాలకు పంపినట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల మొబైల్ ఫోన్లకు కూడా సమాచారం అందించామన్నారు. పాఠశాలల యాజమాన్యాలు కూడా ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించాలని ఆదేశించారు. ఈ నెల 12లోపు ప్రవేశాలు పూర్తి చేయాలన్నారు. ఆ తేదీలోపు చేరని వారు అడ్మిషన్లు కోల్పోతారన్నారు. విద్యార్థుల జాబితాను https://cse.ap.gov.in/DSE/లో ఉంచామన్నారు. ఈ విద్యార్థులకు ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫామ్ తదితర సదుపాయాలు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

8న ఈఏపీసెట్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

సాక్షి, అమరావతి: ఏపీ ఈఏపీ సెట్–2022 అడ్మిషన్ల కౌన్సెలింగ్‌లో భాగంగా ఇటీవల నిర్వహించిన ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కాలేకపోయిన ప్రత్యేక కేటగిరీ అభ్యర్థులకు ఈ నెల 8న మరోసారి అవకాశం కల్పిస్తున్నామని సాంకేతిక విద్య కమిషనర్ నాగరాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన ప్రత్యేక కేటగిరీకి చెందిన ఎన్‌సీసీ, సీఏపీ, పీహెచ్, స్పోర్ట్స్ గేమ్స్ కేటగిరీల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ నెల 8న విజయవాడ పాలిటెక్నిక్ కాలేజీలో సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ నిర్వహిస్తారని, తదుపరి మరో అవకాశం ఉండదని స్పష్టం చేశారు.

విద్యుత్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

టెరీ సంస్థ సహకారంతో ఆధునిక సాంకేతికతపై వెబినార్



విద్యుత్ అధికారుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ బీ శ్రీధర్

సాక్షి, అమరావతి: విద్యుత్ వ్యవస్థలను బలోపేతం చేయడం కోసం, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడానికి ఆన్‌లైన్ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాంను ఏపీ ట్రాన్స్‌కో చేపట్టిందని సీఎండీ బి.శ్రీధర్ చెప్పారు. విజయవాడలోని విద్యుత్ సౌధలో ఉద్యోగులకు 'ది ఎనర్జీ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్'(టెరి) సహకారంతో మూడు రోజుల పాటు జరిగే వెబినార్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాలకు అనుగుణంగా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామని చెప్పారు. పనితీరును కూడా మెరుగుపరుచుకోవడానికి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఏపీ ట్రాన్స్‌కో జేఎండీలు పృథ్వీతేజ్, బి.మల్లారెడ్డి, డిస్కంల సీఎండీలు కె.సంతోషరావు, జె.పద్మాజనార్ధనరెడ్డి, గ్రిడ్ డైరెక్టర్ భాస్కర్ పాల్గొన్నారు.

భారీగా పెరగనున్న ఉద్యోగుల పింఛన్ల వ్యయం

- గత ఆర్థిక సంవత్సరంలో పెన్షన్ల ఖర్చు రూ. 20,326 కోట్లు
- 2024 సంవత్సరంలో రూ.25,520 కోట్లకు పెరుగుదల
- 2031 నాటికి రూ.34,251 కోట్లకు చేరుతుందని అంచనా
- ద్రవ్య విధాన పత్రంలో ఆర్థిక శాఖ వెల్లడి

సాక్షి, అమరావతి: ఉద్యోగుల పింఛన్ల భారం రాష్ట్ర ప్రభుత్వంపై భారీగా పెరిగిపోతోంది. పదవీ విరమణ చేసిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన పింఛన్ల వ్యయం ఏటా వేల కోట్ల రూపాయల మేర పెరిగిపోతోందని ఆర్థిక శాఖ విడుదల చేసిన ద్రవ్య విధాన పత్రం వెల్లడించింది. ముగిసిన ఆర్థిక (2021–22) సంవత్సరంలో పింఛన్ల ఖర్చు రూ.20,326.67 కోట్లు ఉండగా 2024వ సంవత్సరంలో ఏకంగా రూ.25,520.04 కోట్లకు పెరుగుతోంది. అంటే రూ.5 వేల కోట్లకు పైగా పెరుగుతోంది. 2031వ సంవత్సరం నాటికి ఈ ఖర్చు ఏకంగా రూ.34,251.89 కోట్లకు పెరుగుతుందని ఆర్థిక శాఖ తెలిపింది. ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 ఏళ్ల నుంచి 62 సంవత్సరాలకు పెంచడంతో 2022 సంవత్సరం, 2023 సంవత్సరాల్లో రిటైరయ్యే ఉద్యోగులు లేరు. అయితే 2024 సంవత్సరం నుంచి పదవీ విరమణ చేసే ఉద్యోగుల సంఖ్య ఏటా పెరుగుతూ ఉంటుంది. 2024 నుంచి 2031 నాటికి 1.17 లక్షల మంది పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలోనే పింఛన్ల వ్యయం కూడా భారీగా పెరుగుతోందని ద్రవ్య విధాన పత్రం స్పష్టంచేసింది.

2024 నుంచి 2031 వరకు రిటైరయ్యే ఉద్యోగులు, పింఛన్ల వ్యయం

సంవత్సరం	రిటైరయ్యే ఉద్యోగుల సంఖ్య	పింఛన్ల వ్యయం (రూ.కోట్లలో)
2024	13,643	25,520.04
2025	13,583	26,470.61
2026	14,095	27,794.75
2027	14,905	29,320.81
2028	14,734	30,278.81
2029	14,620	31,343.16
2030	16,227	33,358.47
2031	15,548	34,251.89

విద్రోహ దినోత్సవమే బాబుకు మక్కువ

వెన్నుపోటు నేర్పిన వారే ఆయనకు గురువులు: మంత్రి బొత్స

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయుల సేవలను స్మరించుకునే గురు పూజోత్సవం రోజు కూడా రాజకీయ లబ్ధి కోసం సీఎం వైఎస్ జగన్‌పై టీడీపీ విష ప్రచారం చేస్తోందని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ధ్వజమెత్తారు. ప్రభుత్వ స్కూళ్లను నిర్వీర్యం చేసిన చంద్రబాబు.. ఆయన హయాంలో సీపీఎస్ గురించి ఒక్కరోజైనా మాట్లాడారా? అని నిలదీశారు. తన హయాంలో ఉపాధ్యాయులకు ఏం చేశారో చెప్పకుండా రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్న చంద్రబాబు తీరును అన్ని వర్గాలు గుర్తిస్తున్నాయని చెప్పారు. చంద్రబాబుకు గురు పూజోత్సవం రోజైన సెప్టెంబరు 5 కంటే ఆయన విద్రోహానికి పాల్పడిన సెప్టెంబర్ 1వ తేదీ అంటేనే ఇష్టమని వ్యాఖ్యానించారు. వెన్నుపోటుతో సీఎం పదవిని దక్కించుకున్న రోజు కావడంతో సెప్టెంబరు ఒకటో తేదీని చీటర్స్ డేగా చంద్రబాబు ఇష్టపడతారని చెప్పారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'గురు పూజోత్సవం రోజు సీఎం జగన్‌పై తప్పుడు ట్వీట్లు పెట్టారు. గురువులు అనే పదాన్ని కించపరచడం తప్పు కాదా? వెన్నుపోటు నేర్పిన వారు చంద్రబాబుకు గురువులు. వెన్నుపోటుకు ఆజ్యం పోసిన రామోజీరావు, అడుగులకు మడుగులు వత్తే రాధాకృష్ణ, అప్పుడు, వత్తాసు పలికే యనమల, బీజేపీలో ఏజెంట్లుగా పెట్టుకున్న సుజనా చౌదరి, సీఎం రమేష్ వీరంతా చంద్రబాబుకు గురువులు. మూడేళ్లలో ఒక్క విద్యా రంగంపైనే మా ప్రభుత్వం దాదాపు రూ.53 వేల కోట్లు వ్యయం చేసింది. ఇలా గతంలో ఏ ప్రభుత్వమూ ఖర్చు చేయలేదు. యాప్‌లో ఫేస్ రికగ్నిషన్‌పై తొలుత టీచర్లతో మాట్లాడాం. వారికి తగిన సమయం ఇచ్చాం. ఏమైనా సమస్యలుంటే పరిష్కరిస్తామని చెప్పాం. అందుకు వారు కూడా అంగీకరించారు...' అని బొత్స సత్యనారాయణ అన్నారు.

ఇంటింటా ఆనందం

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. గ్రామాల్లో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులకు ప్రతి ఇంటి వద్దా ప్రజలు ఆనందంతో స్వాగతం చెబుతున్నారు. అన్ని జిల్లాల్లోనూ సోమవారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. సీఎం వైఎస్ జగన్ వెంటే తామంతా నడుస్తామని ప్రజలు తెలిపారు.



అనకాపల్లి జిల్లా కొత్తూరు గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు




అనంతపురం జిల్లా కోమటికుంట్లలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



పశ్చిమగోదావరి జిల్లా తోకలపల్లిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఉంగుటూరు ఎమ్మెల్యే వాసుబాబు

పరిశ్రమల్లో తనిఖీలకు మూడు టాస్క్‌ఫోర్స్‌లు

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



ఎర్ర చందనం స్మగ్లింగ్‌పై కఠినంగా వ్యవహరించాలి

సాక్షి, అమరావతి: ఇటీవల పరిశ్రమల్లో ప్రమాదాల నేపథ్యంలో నిరంతరం తనిఖీ చేసేందుకు మూడు టాస్క్‌ఫోర్స్‌లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర పర్యావరణ, అటవీ, గనులు, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. విజయవాడలోని తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆయన కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ టాస్క్‌ఫోర్స్ బృందాలు పరిశ్రమలు, కాలుష్యకారక సంస్థల్లో తనిఖీ చేసి భద్రతా ప్రమాణాలను పరిశీలించాలని ఆదేశించారు. అటవీ, పర్యావరణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ ప్రసాద్, కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ ఏకే ఫరీడా, స్పెషల్ సెక్రటరీ చలపతిరావు, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ విజయ్‌కుమార్, పీసీబీ సీనియర్ అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఎర్రచందనం స్మగ్లింగ్‌పై మరింత కఠినంగా వ్యవహరించాలని మంత్రి పెద్దిరెడ్డి అధికారులను ఆదేశించారు. విజయవాడలోని తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం అటవీ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఎర్రచందనం నిల్వలు విస్తరించిన ప్రాంతాల్లో సాయుధ అటవీ బృందాలతో నిరంతరం గస్తీ నిర్వహించాలని, అవసరమైతే డ్రోన్లతో నిఘా పెట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 30 ప్రాంతాల్లో ఎకో టూరిజం ప్రాజెక్టులు ఉన్నాయని, వాటితోపాటు పులికాట్, నేలపట్టు, కోరింగ, పాపికొండలు ప్రాంతాల్లో ఎకో టూరిజాన్ని మరింత అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అటవీ, పర్యావరణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ ప్రసాద్, అటవీదళాల అధిపతి వై.మధుసూదన్ రెడ్డి, పీఆర్, ఆర్డీ స్పెషల్ కమిషనర్ శాంతిప్రియ పాండే, స్పెషల్ సెక్రటరీ చలపతిరావు, పీసీసీఎఫ్ బీకే సింగ్, పీసీసీఎఫ్ ఏకే ఝా పాల్గొన్నారు.



జీవితం జీవితమే – అది పిల్లి అయినా, కుక్కయినా,
మనిషయినా! పిల్లికీ, మనిషికీ ఏ తేడా లేదు. తేడా ఎక్కడంటే,
మనిషి తన ప్రయోజనం కోసం ఈ భావన చూపడంలో ఉంది.
– అరవిందులు

సాక్షి
మంగళవారం, సెప్టెంబర్, 6

త్వరపడితేనే... నిలబడతాం!

భారత ఆర్థిక వ్యవస్థకు దక్కిన కొత్త కిరీటం ఇది. దేశంలో సామాన్యుల స్థితిగతులు ఎలా ఉన్నా, పరిమాణ రీత్యా విశ్వవేదికపై మన ఆర్థిక వ్యవస్థ ఏకంగా 5వ స్థానంలో నిలిచింది. అమెరికా, చైనా, జపాన్, జర్మనీల తర్వాత స్థానం ఇప్పుడు భారత్‌దేనని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) గత వారం వెల్లడించింది. భారీగా పెరిగిన జీవన వ్యయంతో సతమతమవుతున్న బ్రిటన్ ఆరో స్థానానికి నెట్టేసి, గత ఆర్థిక వత్సరం ఆఖరి మూడు నెలల్లో భారత్ ముందుకు దూసుకు వచ్చింది. దశాబ్ది క్రితం ప్రపంచంలోని అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో 5వ స్థానంలో బ్రిటన్, 11వ స్థానంలో భారత్ ఉండేవి. ఆ దశ నుంచి ఇంత పైకి ఎగబాకడం ఆనందమే. సంపద పెంపులో ముందుండడం సంతోషమైనా, సామాన్యులకు సంపద పంపిణీలో ఎక్కడున్నామన్నది ఆలోచించుకోవాలి.

బ్రిటన్ వెనుకబాటుకూ, భారత్ ముందంజకూ అనేక కారణాలున్నాయి. గత నాలుగు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంత వేగంగా బ్రిటన్‌లో ద్రవ్యోల్బణం పెరుగుతోంది. 2024 దాకా ఆ దేశానికి ఆర్థిక మాంద్యం ముప్పు పొంచి ఉందని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ లాంటివే అంటున్నాయి. ఈ పరిస్థితుల్లో బ్లూమ్‌బర్గ్ నివేదిక ప్రకారం మొన్న మార్చితో ముగిసిన త్రైమాసికంలో 'నామమాత్రపు' నగదు లెక్క ప్రకారం భారత ఆర్థిక వ్యవస్థ 854.7 బిలియన్ డాలర్ల వద్ద ఉంటే, బ్రిటన్ 814 బిలియన్ డాలర్ల స్థాయిలోనే మిగిలింది. డాలర్ మారకం రేటు ప్రకారం ఈ లెక్క కట్టారు. ఇక, వర్తమాన ఆర్థిక వత్సర తొలి త్రైమాసికంలోనూ అమెరికన్ డాలర్ల లెక్కన భారత్ ముందంజ కొనసాగించినట్టు ఐఎంఎఫ్ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) గణాంకాల మాట. మరోపక్క ఈ ఏడాది భారత రూపాయితో పోలిస్తే బ్రిటన్ పౌండ్ 8 శాతం పడిపోయింది. వెరసి, వార్షిక ప్రాతిపదికన కూడా ఈ ఏడాది బ్రిటన్‌ను భారత్ దాటేస్తుందని ఐఎంఎఫ్ అంచనా.

బ్రిటన్‌లోని పరిస్థితికి భిన్నంగా భారత ఆర్థిక వ్యవస్థ ఈ ఏడాది కనీసం 7 శాతానికి పైగా వృద్ధి సాధిస్తుందని చెబుతున్నారు. రెండొందల ఏళ్ళు ఎవరి పాలనలో ఉన్నామో ఆ పాలక దేశాన్ని, పాలిత భారతదేశం అధిగమించడం విధి వైచిత్రి. అదీ బ్రిటీష్‌వారిపై పోరాడి, స్వాతంత్ర్యం సాధించి 75 వసంతాలు నిండిన వేళ ఇలాంటి కిరీటం విశేషమే. నిజానికి, ఇలా బ్రిటన్‌ను వెనక్కి నెట్టి, భారత్ ముందుకు రావడం ఇటీవల ఇది రెండోసారి. 2019లో తొలిసారిగా భారత్ ఆ ఘనత సాధించింది. తర్వాత ఆ స్థానాన్ని భారత్ చేజార్చుకుంది. ఇంతలో బ్రిటన్ చిక్కుల్లో పడిపోవడంతో మనం మళ్ళీ ముందుకొచ్చాం. 'వలస పాలకులపై ఇది స్వీట్ రివెంజ్' అని కొందరి వ్యాఖ్య. అలా సంతోషపడ వచ్చేమో కానీ, అంతటితో సరిపెట్టుకొని అనేక ఇతర సూచికలను పట్టించుకోకుంటేనే కష్టం.

కరోనా, ఉక్రెయిన్‌లో యుద్ధం లాంటి వాటితో ద్రవ్యోల్బణం, ఇంధన సంక్షోభం బ్రిటన్ లాంటి పాశ్చాత్యదేశాల్ని చుట్టుముట్టాయి. ఆ సంక్షోభాలను తట్టుకొని మన దేశం ఈ మేరకు నిలబడడం విశేషమే. కానీ ఇది చాలదు. మనం ఇవాళ్టికీ బ్రిటన్‌తో పోలిస్తే తలసరి జీడీపీలో వెనకబడే ఉన్నాం. ఇప్పటికీ మన దగ్గరే దారిద్ర్య స్థాయి ఎక్కువ. బ్రిటన్ తలసరి ఆదాయం 47 వేల డాలర్లు కాగా, మనమింకా 2.5 వేల డాలర్ల దగ్గరే ఉన్నాం. విద్య, వైద్యం, జీవన ప్రమాణాల మేళవింపైన మానవాభివృద్ధి సూచిలోనూ ఇండియా వెనకబడి ఉంది. మన దేశం త్వరితగతిన అడుగులు వేస్తున్నా, కనీసం 1980లో బ్రిటన్ ఉన్న స్థాయికి మనం చేరాలన్నా మరో దశాబ్ది పడుతుందట. దేశ సంపన్నతకు చిహ్నం జీవన నాణ్యత గనక 'సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ కవరేజ్' (యూహెచ్‌సీ) లెక్కన చూసినా భారత్ సుదూరం ప్రయాణించాల్సి ఉంది.

2016 నాటికే బ్రిటన్‌ను దాటి మన దేశం అయిదో పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ఒకప్పటి అంచనా. తీరా అది ఇంత ఆలస్యమైంది. కానీ, పెరుగుతున్న యువభారత జనాభా, పటిష్ఠమవుతున్న డిజిటల్ వ్యవస్థ రీత్యా రాగల కాలంలో భారత్ మరింత వృద్ధి సాధించవచ్చని ఓ ఆశాభావం. ఈ దశాబ్ది చివరికే భారత్ మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ అవుతుందని ఎస్బీఐ రీసెర్చ్ మాట. అలాగే, వచ్చే 2027 కల్లా ఆర్థిక వ్యవస్థను 5 ట్రిలియన్ల లక్ష్యం చేరుస్తామంటున్న పాలకులు అది నిజం చేయాలంటే ఆలోచన, ఆచరణలో చిత్తశుద్ధి అవసరం. ఉదాహరణకు, జీడీపీలో 4 నుంచి 6 శాతం విద్యారంగంపై ఖర్చు చేయాలని యునెస్కో అభ్యర్థన. కానీ, మన కేంద్రం, రాష్ట్రాలన్నీ కలిపినా గత ఆర్థిక వత్సరం విద్యారంగంపై బడ్జెటరీ వ్యయం జీడీపీలో 3 శాతమే. ఇలాంటివి మారాలి.

అలాగే, దేశ జీడీపీ పెరుగుతున్నా, ఆర్థిక అసమానతలూ పెరుగుతూ పోవడం ఆందోళనకరం. ఇప్పటికీ అల్ప–మధ్య ఆదాయ దేశమైన భారత్‌లో సంపద సృష్టితో పాటు సంపద పంపిణీపైనా దృష్టి పెట్టాలి. జీడీపీకి తగ్గట్టు దేశంలోని కోట్లాది నిరుపేదలను సంపన్నుల్ని చేయడం పాలకుల బాధ్యత. స్వాతంత్ర్య శతవసంతాల 2047 నాటికి భారత్‌ను మధ్య ఆదాయ దేశంగా నిలబెట్టి, తలసరి ఆదాయం 10 వేల డాలర్లు చేయాలంటే, నిలకడగా 7 నుంచి 7.5 శాతం వృద్ధి రేటు అవసరం. అందుకు మనకున్న అతి పెద్ద యువ జనాభాను సానుకూల అంశం చేసుకోవాలి. బ్రిటన్ (78 శాతం), అమెరికా (62 శాతం)తో పోలిస్తే, మన దగ్గర శ్రామికశక్తి భాగస్వామ్యం రేటు తక్కువ (48 శాతం). కానీ నిరుద్యోగమేమో ఎక్కువ (8 నుంచి 9 శాతం). దీన్ని మార్చాలి. ప్రైవేట్ రంగంలో ఉపాధి పెరిగేలా చూడాలి. అవసరమైన అన్ని సంస్కరణలూ చేపట్టాలి. 'సాధించినదానికి సంతృప్తిని చెంది, అదే విజయమనుకొంటే పొరపాటోయి' అన్న కవి వాక్కే నిత్యం దిశానిర్దేశం కావాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, తిథి: శు.ఏకాదశి రా.12.38 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం: పూర్వాషాఢ సా.4.46 వరకు, తదుపరి ఉత్తరాషాఢ **వర్జ్యం:** రా.12.11 నుండి 1.39 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.15 నుండి 9.07 వరకు, తదుపరి రా.10.47 నుండి 11.34 వరకు **అమృతఘడియలు:** ప.12.17 నుండి 1.46 వరకు.

సూర్యోదయం : 5.49
సూర్యాస్తమయం: 6.08
రాహుకాలం : ప. 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

సమానత్వంలో ఆరోగ్యమూ కీలకమే!

విశ్లేషణ



గగన్‌దీప్ కాంగ్

2047 నాటికి అందరికీ మెరుగైన ఆరోగ్య సేవలు అందించే దేశంగా భారత్ ఎదగాలంటే ముందుగా మన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఎంత సమర్థంగా పనిచేయించగలమో చూసుకోవాలి. వ్యక్తులు, వారి అవసరాలే కేంద్రంగా ఆరోగ్య వ్యవస్థ నిర్మాణం జరగాలి. ఆరోగ్య రంగాన్ని విస్మరిస్తే వ్యాధులు, ఆరోగ్య సమస్యలపై పెట్టాల్సిన ఖర్చులు అలవి కానంతగా పెరుగుతాయి. ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో మూడోది నేరుగా ఆరోగ్యానికి సంబంధించినదే. అలాగే తొలి రెండు లక్ష్యాలైన అందరికీ ఆహారం, పేదరిక నిర్మూలనకూ ఆరోగ్యంతో సంబంధం ఉన్నది. ఇంకోలా చెప్పాలంటే ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలను తీర్చకుండా ఈ రెండు లక్ష్యాలను సాధించడం కష్టం.

స్వాతంత్ర్య 75వ వార్షికోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఇప్పుడు అందరి దృష్టి స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లయ్యే సువర్ణ ఘడియలపైనే ఉంది. భారతదేశం అప్పటికి ఎలా తయారవ్వాలి? నా దృష్టిలో అందరికీ సమాన అవకాశాలున్న దేశంగా; విద్య, ఆరోగ్యం అందరికీ అందుబాటులో ఉన్న దేశంగా ఉండాలి! కులమతాలకు అతీతంగా... వ్యవసాయం, పాడి పరిశ్రమలు పుష్టిగా సాగుతుండాలి. నాణ్యతే ప్రధానంగా పరిశ్రమలు వస్తువులను అందించాలి. ఇవన్నీ కూడా అందరికీ సమాన అవకాశాలు అన్న లక్ష్యాన్ని సాధించేందుకు ఉపయోగపడేవే.

ప్రతి సమాజానికి విద్య, ఆరోగ్యం పునాదుల్లాంటివి. ఈ రెండు విషయాల్లోనూ దేశం సాధించిన ప్రగతికి ఎన్నో ఉదాహరణలు కనిపిస్తాయి. భారతీయ విద్యావిధానం అంతర్జాతీయ స్థాయి సీఈవోలను సిద్ధం చేస్తూంటే... భారతీయ ప్రైవేట్ రంగ ఆరోగ్య వ్యవస్థలు ప్రపంచం నలుమూలల్లోని వారికి మెడికల్ టూరిజంతో వైద్యసేవలు అందిస్తున్నాయి. అయితే ఈ రెండు ఉదాహరణలను మినహాయింపులుగానే చూడాలి. పైగా ఈ రెండింటిలో అవకాశాలు కొందరికే.

పిల్లలు తమ మేధోశక్తిని సంపూర్ణంగా ఉపయోగించుకునేందుకు మొట్ట మొదటి పునాది ఇంట్లోనే పడుతుంది. పసివాళ్లతో తగురీతిలో మాటలు కలపడం, ఇంద్రియజ్ఞానానికి సంబంధించిన పనులు చేయించడం వంటి పనుల ప్రాధాన్యతను తల్లిదండ్రులు అర్థం చేసుకుంటే విద్యభ్యాసానికి గట్టి పునాది పడినట్లే. తల్లిదండ్రులిచ్చిన ఈ ప్రాథమిక విద్యకు సుశిక్షితులైన ఉపాధ్యాయులతో నడిచే పాఠశాల కూడా తోడైతే బాలల వికాసం పెద్ద కష్టమేమీ కాదు. ఉమ్మడి కుటుంబమైనా... చిన్న కుటుంబమైనా సరే... సాంఘిక, ఆర్థిక పరిస్థితులే పిల్లలకు దక్కే విద్య నాణ్యతను నిర్ణయిస్తాయి. పాఠశాల వాతావరణం సాంఘిక, ఆర్థిక లేమి ప్రభావాన్ని కొంతవరకూ తగ్గించగలదు కానీ... ఇది జరగాలంటే పాఠశాలలు సక్రమంగా పనిచేస్తూండాలి. దీనర్థం భవనాలు, పరిపాలన వ్యవస్థలు సరిగా ఉండాలని కాదు. నిబద్ధతతో పనిచేసే ఉపాధ్యాయులు కావాలి.

అణగారిన వర్గాల పిల్లల జీవితాలను మార్చడం మూకుమ్మడిగా జరగాల్సిన వ్యవహారం. ఈ మార్పు తీసుకు రావడం సాధ్యమనీ, అందుకోసం ఏమైనా చేయగలమనీ ఉపాధ్యాయులు సంకల్పించుకోవడం అవసరం. అయితే ఈ మార్పు రాత్రికి రాత్రి వచ్చేదేమీ కాదు. ప్రభుత్వాల ఆదేశాలతో సాధ్యమయ్యేదీ కాదు. విద్యాబోధనలో గిరిజన సంస్కృతుల నుంచి పాఠాలు నేర్చుకోవడం లేదా తర్కబద్ధమైన అభ్యాసాలను ప్రవేశపెట్టడమైనా సరే... పాఠశాలల్లో విద్యార్థుల మదింపు అనేది అందరికీ ఒకేలా ఉండటం సరికాదు. ఈ వాదనలకు ప్రతివాదనలూ లేకపోలేదు. భారత దేశం విశాలమైనదనీ, అన్ని రాష్ట్రాల్లోనూ ఏకరీతి విద్యాబోధన అవసరమనీ అనేవాళ్లూ ఉన్నారు. ప్రభుత్వం వనరుల కొరతను ఎదుర్కొంటోందని ఇంకొందరు అంటారు. విద్యార్థుల జీవితాల్లో మార్పులు తీసుకురావడం



దశాబ్దాల దీర్ఘకాలిక ప్రక్రియ అని అంటారు. ఈ ప్రతివాదనలను విస్మరించాల్సిన అవసరమేమీ లేదు. కానీ విద్య ప్రాథమికమైన బాధ్యత సామాజిక వృద్ధి మాత్రమే కాదనీ, సమానతను సృష్టించేందుకూ ఉపయోగపడాలనీ వీరు గుర్తించాలి.

విద్య ద్వారా లింగవివక్షను తగ్గించడం వంటి అనేక లాభాలూ ఉన్నాయని తెలుసుకోవాలి. పాఠశాల విద్యను అభివృద్ధి చేస్తూనే... దీనికి సమాంతరంగా వృత్తి విద్య, పారిశ్రామిక శిక్షణ కేంద్రాలను కూడా ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే... ఈ రెండు రకాల సంస్థలు ఉద్యోగాలు సంపాదించు కునేందుకు అవసరమైన నైపుణ్యాలను అందిస్తాయి. అదే సమయంలో తక్కువ విద్యార్హతలతోనే అర్థవంతమైన ఉద్యోగం సంపాదించుకోవచ్చు. ఆయా రంగాల్లో నిష్ణాతులు ఈ దేశానికి గతంలోనూ ఉన్నారు... భవిష్యత్తులోనూ పుట్టుకొస్తారు. ఇది సహజసిద్ధంగా జరిగే ప్రక్రియగానే చూడాలి. అందరికీ సమాన అవకాశాలు కల్పించాలంటే విద్యా వ్యవస్థలో కొత్త కొత్త అవకాశాలను సృష్టించడం... అవి అందరికీ నిత్యం అందుబాటులో ఉండేలా చూడటం అత్యవసరం. ఈ క్రమంలోనే విద్యనభ్యసించేందుకు డబ్బు ఒక ప్రతిబంధకం కాకుండా జాగ్రత్త పడాలి.

సుమారు ఇరవై ఏళ్ల క్రితం నాటి మాట. ఆరోగ్యకరమైన సమాజానికి ఆడపిల్లలు విద్యావంతులై ఉండటం ఎంతో అవసరమని ప్రపంచబ్యాంకు నివేదిక ఒకటి విస్పష్టంగా పేర్కొంది. తక్కువమంది పిల్లల్ని కనడం, సురక్షిత కాన్పులు, పిల్లల ఆరోగ్య పరిస్థితుల్లో మెరుగుదల, సమాజంలో స్థాయి పెరగడం వంటి సానుకూల అంశాలకూ ఆడపిల్లలు, మహిళల చదువుకు దగ్గర సంబంధం ఉందని అలవోకగా అనేస్తారు కానీ... ఆరోగ్యం విషయానికి వస్తే అది కాన్పులు, పిల్లల సంరక్షణ పరిధిని దాటి బహుముఖంగా విస్తరించాల్సి ఉంది. రెండు మూడు దశాబ్దాల క్రితంతో పోలిస్తే చాలా వ్యాధులను మనం సమర్థంగా నియంత్రించగలుగుతున్నాం. కాబట్టి ప్రజల ఆరోగ్య సంరక్షణ, ప్రాణాంతక వ్యాధుల నివారణ, రోగులకు మెరుగైన చికిత్స వంటివాటికి ఇప్పుడు ప్రాధాన్యం ఇవ్వాలి.

ఐక్యరాజ్య సమితి 2030 నాటికి సాధించాలని ప్రపంచదేశాలకు నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు పూర్తిస్థాయిలో నెరవేరడం 2047 నాటికి కానీ సాధ్యమయ్యే అవకాశాలు కనిపించడం లేదు. పైగా ఆరోగ్య రంగాన్ని విస్మరిస్తే వ్యాధులు, ఆరోగ్య సమస్యలపై పెట్టాల్సిన ఖర్చులు అలవి కానంతగా పెరుగుతాయి. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో మూడోది నేరుగా ఆరోగ్యానికి సంబంధించినదే. అలాగే తొలి రెండు లక్ష్యాలైన అందరికీ ఆహారం, పేదరిక నిర్మూలనకూ ఆరోగ్యంతో సంబంధం ఉన్నది. ఇంకోలా చెప్పాలంటే ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలను తీర్చకుండా ఈ రెండు లక్ష్యాలను సాధించడం కష్టం.

2047 నాటికి అందరికీ మెరుగైన ఆరోగ్య సేవలు అందించే దేశంగా భారత్ ఎదగాలంటే ముందుగా మన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఎంత సమర్థంగా పనిచేయించగలమో చూసుకోవాలి. ఆరోగ్యంపై పెట్టే ఖర్చులు తగ్గించడం, వ్యాధుల నివారణలపై శ్రద్ధ పెట్టడం జరగాలి. చాలా వ్యాధుల చికిత్సకు ఆసుపత్రుల అవసరముండదు. ఆరోగ్య కార్యకర్తలను రోగులకు అందుబాటులో ఉంచి, భౌతిక, డిజిటల్ సౌకర్యాలు తగినన్ని ఏర్పాటు చేస్తే సరిపోతుంది. అలాగే అత్యవసర పరిస్థితులకు వేగంగా స్పందించగల, అందరికీ అందుబాటులో ఉండేలా రెఫరెల్ ఆసుపత్రుల వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. చికిత్స ఆలస్యం అవడం వల్ల రోగులకు అనవసరమైన ఇబ్బందులు ఎదురు కారాదు. ఇది సాధ్యం కావాలంటే తగిన వనరులు, సిబ్బంది మాత్రమే కాదు... ఇవన్నీ అవసరమైన చోట ఉండేలా చూడాలి. తగిన పద్ధతులను అమల్లోకి తేవడమూ అవసరమే. ఇంకోలా చెప్పాలంటే వ్యక్తులు, వారి అవసరాలే కేంద్రంగా ఆరోగ్య వ్యవస్థ నిర్మాణం జరగాలి. భారీ మొత్తాలు చెల్లించాల్సిన అవసరం లేకుండానే ఈ వ్యవస్థ రోగుల అవసరాలను తీర్చగలగాలి. అయితే ఇలాంటి వ్యవస్థ ఏర్పాటు చేయాలంటే.. ప్రైవేట్ రంగాన్ని నియంత్రించక తప్పదు. సుశిక్షితులైన, చిత్తశుద్ధితో పనిచేసే సిబ్బందితో కేవలం చౌక మందులు, టీకాలతోనే మన వ్యవస్థను రోగి ప్రధానంగా పనిచేయించవచ్చు. ప్రాథమిక ఆరోగ్య పరిరక్షణలో అక్కడక్కడ అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్న వారు ఉన్నారు. క్లినికల్ సర్వీసుల విషయంలోనూ ఇదే జరుగుతోంది. వీటిని సుస్థిర అమలు దిశగా మళ్లించాలి.

2047 అంటే ఇంకో పాతికేళ్ల కావచ్చు కానీ... స్వతంత్ర భారత చరిత్రలో ఇంకో శతాబ్దానికి బలమైన పునాది వేసేందుకు ఈ 25 ఏళ్లలో విద్య, ఆరోగ్యంపై మనం పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది. ఈ పెట్టుబడులు కూడా సమాజంలోని ఉన్నత వర్గాల కోసం కాదు. అందరికీ. అయితే ఈ పెట్టుబడుల రాబడులు మాత్రం కొన్ని తరాలవారు అందుకుంటారు.

వ్యాసకర్త సీనియర్ వైరాలజిస్ట్
('ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

గురువులకు నమస్తే



మన ఉపాధ్యాయులు, గురువులు అందరికీ! సమాజానికి మీ సేవలు వెలకట్టలేనివి. అందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు (సెప్టెంబర్ 5).

– విరాట్ కోహ్లీ, క్రికెటర్

న్యాయమేనా?



లిజ్ ట్రస్ యూకే ప్రధానమంత్రి కావడంలో ఏ న్యాయమూ లేదు. ఆమె ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రధాని కాదు. ప్రకటన తర్వాత ఆమె కనీసం రిషీ సునాక్ పేరును ప్రస్తావించాలన్నది కూడా పట్టించుకోలేదు.

– షోలా మోస్–షోగ్బామిము, బ్రిటన్ యాక్టివిస్ట్

నవ్వులను ఇద్దాం



మదర్ థెరెసా ఇది ఇష్టంగా చెప్పేవారు: 'నేను వారి భాషను మాట్లాడలేకపోవచ్చు, కానీ నేను నవ్వగలను'. ఆమె నవ్వును మన హృదయాల్లో మోస్తూ, మన ప్రయాణంలో కలిసిన, ప్రత్యేకించి కష్టాల్లో ఉన్నవారికి దాన్ని ఇద్దాం. ఇలా చేయడం వల్ల మనం ఆశ, సంతోషాలను పెంపు చేయగలం.

– పోప్ ఫ్రాన్సిస్, మతగురువు

కొంతమంది మద్దతు



అంటే లిజ్ ట్రస్ యూకే ప్రధాని కావడానికి కేవలం 81,000 మంది ఓటు వేశారన్నమాట! ఈ పద్ధతి తీవ్ర ఆందోళనకరం. ఈ దేశ పరిస్థితి ఇలా ఉందంటే ఆశ్చర్యం ఏముంది?

– క్యాట్ డేవీస్, ఫిలింమేకర్

తప్పులు సహజం



భారత క్రికెట్ జట్టు అభిమానులకు నా విన్నపం: మనుషులం అయినందువల్ల, ఆటల్లో అందరమూ తప్పులు చేస్తుంటాం. కాబట్టి ఆ తప్పులను ఎత్తిచూపి ఎవరినీ అవమానించొద్దు. (ఇండియా– పాకిస్తాన్ మ్యాచ్‌లో క్యాచ్ వదిలేయడం వల్ల అర్శదీప్ సింగ్ ఖలిస్తానీ అంటూ జరిగిన ట్రోలింగ్ నేపథ్యంలో.)

– మొహమ్మద్ హఫీజ్, పాక్ మాజీ క్రికెటర్

వాస్తవాలు సరిచూసుకోరా?



క్రికెటర్ అర్శదీప్ సింగ్ అంశం మీద సాంకేతిక సమాచార శాఖ; సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ రెండూ కూడా రంగంలోకి దిగాయి. వాస్తవాలను నిర్ధారించుకోకుండా రీట్వీట్ల ద్వారా ట్రోలింగ్‌ను సంతోషంగా మరింతమందికి చేరేట్టు చేసినవారిని కూడా జవాబుదారీగా నిలబెట్టాలి.

– పల్లవీ ఘోష్, జర్నలిస్ట్

కావాలని చేస్తున్నారు



భారత జట్టు క్రికెటర్ అర్శదీప్ సింగ్ వికీపీడియా పేజీని ఎడిట్ చేసి, ఉద్దేశపూర్వకంగా 'ఖలిస్తాన్' పదాన్ని చేర్చారు. ఐపీ వివరాల ప్రకారం ఇది పాకిస్తాన్ నుంచి జరుగుతోంది. మొహమ్మద్ షమీ తర్వాత పాకిస్తాన్ ప్రాయోజిత సామాజిక మాధ్యమాల హ్యాండిల్స్ ఇప్పుడు యువకుడైన అర్శదీప్‌ను లక్ష్యం చేసుకున్నాయి. క్రీడాస్ఫూర్తి ఎక్కడ?

– సుధీర్ చౌదరి, సంపాదకుడు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్‌బాక్స్

ప్రాతఃస్మరణీయుడు



కైలే అనిల్ కుమార్

మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అడుగుజాడల్లో నడుస్తున్న ప్రభుత్వానికి ప్రతినిధిగా గడప గడపకూ వెళుతున్నప్పుడు... ప్రజల గుండెల్లో ఆయన రూపం ఎంత పదిలంగా ఉందో కనపడుతోంది. సంక్షేమానికి నడత, నడక నేర్పిన నాయకుడు ప్రజల జీవితాల్లో ఎలా భాగమై నిలిచి ఉంటాడో చెప్పడానికి సజీవ ఉదాహరణ ఆయన. నాకు, నాలాంటి కోట్ల మంది ప్రజలకు ప్రాతఃస్మరణీయుడు వైఎస్సార్. ఆయన స్మరణ లేకుండా రోజు గడవదు. ఇటు సంక్షేమం, అటు అభివృద్ధి... రెండు రంగాల్లోనూ పాలన మీద... అదీ ఐదు ఏళ్ల మూడు నెలల కాలంలోనే సుస్పష్టంగా తనదైన ముద్ర వేయడం సామాన్యులకు సాధ్యమయ్యే విషయం కాదు.

ఆయన ప్రతి ఆలోచన, ప్రతి మాట, ప్రతి చేత... భవిష్యత్ అనుసరణీయ మార్గాలుగా రూపుదిద్దుకున్నాయి. ఒక్క మన రాష్ట్రంలోనే కాదు యావత్ దేశంలోనూ ఆయన చూపిన మార్గం వెంబడి నడవాలని ఇతర ప్రభుత్వాలు భావిస్తున్నాయి. పేద ప్రజలు రోగం బారిన పడితే చావే శరణ్యం అవుతుందని ప్రజల రోదన మిన్నంటిన దశలో... అధికారం చేపట్టిన వైఎస్సార్... పేదలకు కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందించడం బాధ్యతగా భావించారు. ఆయన ఆలోచనలోనుంచి పురుడుపోసుకున్న 'ఆరోగ్యశ్రీ' ఇప్పుడు దేశమంతా అమల్లో ఉంది. అత్యవసర వైద్య సహాయం కావాల్సి వచ్చినప్పుడు 108కు ఒక్క ఫోన్ చేస్తే కుయ్.. కుయ్ మంటూ దూసుకొస్తున్న '108' అంబులెన్స్ సర్వీస్ ఆయన ప్రారంభించిందే. పేద పిల్లల ప్రతిభకు మసి పట్టకుండా మట్టిలో మాణిక్యాలను తయారు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇప్పుడు చాలా రాష్ట్రాల్లో అమల్లో ఉంది. రైతులకు ఉచిత విద్యుత్ అసాధ్యమని అప్పట్లో దార్శనికుడినని డప్పాలు కొట్టిన నాయకుడు అంటే... దాన్ని సుసాధ్యం చేసిన డాక్టర్ వైఎస్సార్ దేశంలో ఎంతో మంది ముఖ్యమంత్రులకు ఆదర్శప్రాయుడిగా నిలిచారు. సంక్షేమ పథకాలకు అర్హులైన వారు ఒక్కరూ మిగిలిపోకుండా లబ్ధి కలిగించాలనే ఆయన ఆలోచన నుంచి పుట్టిన 'సంతృప్తస్థాయిలో అమలు' రాజనీతిశాస్త్రంలో సరికొత్తగా చేరిన పదం. ప్రభుత్వాధినేతల ఆలోచనల్లో మార్పు తీసుకొచ్చిన విప్లవం. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గారి నేతృత్వంలోని ప్రభుత్వానికి కళ్లు, కాళ్లు మహానేత వైఎస్సార్ ఆశయాలే. ఆ ప్రభుత్వంలో నాకూ భాగస్వామ్యం ఉండటం గర్వంగా భావిస్తున్నాను. ప్రజాసేవా మార్గంలో ప్రయాణిస్తున్న నాకు డాక్టర్ వైఎస్సార్ స్ఫూర్తి... చుక్కాని!

వ్యాసకర్త పామర్రు ఎమ్మెల్యే, కృష్ణాజిల్లా । 99494 18777

చరిత్రను పాతిపెట్టి ఏం బావుకుంటారు?

అభిప్రాయం



సి. రామచంద్రయ్య

ఎనిమిదేళ్ల ప్రధాని నరేంద్రమోదీ పరిపాలనా కాలంలో దేశం సాధించిన విజయాలు, వైఫల్యాలపై జరిగే చర్చకంటే... కేంద్ర ప్రభుత్వం దేశ చరిత్రను వంకరటింకర చేయడం, అలాగే వివిధ రాష్ట్రాలలో అధికారంలో ఉన్న బీజేపీయేతర పార్టీలను బలహీనం చేయడంపైననే ఇప్పుడు ఎక్కువగా చర్చ జరుగుతున్నది. భారతదేశ చరిత్ర సమున్నతమైనది. అందులో స్వాతంత్ర్య సంగ్రామ పోరాటం ప్రధానమైనది. అలాగే దేశానికి స్వాతంత్ర్యం లభించిన తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు–దేశ విభజన, మత ఘర్షణలు; నెహ్రూ పాలనలో అనుసరించిన ఆర్థిక, సామాజికాభివృద్ధి, విదేశీ విధానాలు తదితర అంశాలు చరిత్రలో ప్రముఖ స్థానం ఆక్రమించాయి. అయితే, పాక్షిక దృష్టితోనో లేక కాంగ్రెస్, వామపక్ష భావజాలాల దృక్కోణం నుంచో సంఘటనలను చరిత్రకారులు చెప్పారని బీజేపీ మొదటి నుంచీ ఆరోపిస్తోంది. ఇందులో కొంత నిజం ఉండొచ్చు. చరిత్రకు సైద్ధాంతిక ఏకీభావం ఉండదు. ఇది ఒక్క మన దేశంలోనే కాదు. ప్రపంచంలో ఏ దేశ చరిత్ర పరిశీలించినా అనేక అంశాలలో భిన్నమైన వాదనలు, వ్యక్తీకరణలు, అభిప్రాయాలు కనిపిస్తాయి.

అయితే, భారత్‌కు సంబంధించినంత వరకు జాతీయవాదం తమ గుత్తసొత్తుగా భావించే బీజేపీ ఇపుడు చరిత్రను సరిచేసే నెపంతో గత చరిత్రను తారుమారు చేసే పనిలో నిమగ్నమైంది. జరుగుతున్న పరిణామాలను గమనిస్తున్నప్పుడు స్వయంగా మోదీ చరిత్ర మసిపూసే పనికి తగిన సహకారం, ప్రోద్బలం అందిస్తున్నట్టు భావించాల్సి వస్తోంది. ముఖ్యంగా, స్వాతంత్ర్య సంగ్రామంలో పోరాడి, స్వాతంత్ర్యం లభించినాక దేశానికి 17 ఏళ్లపాటు ప్రధాన మంత్రిగా పనిచేసి... ప్రపంచంలో భారత్‌కు ఓ విశిష్ట స్థానం కల్పించిన పండిట్ నెహ్రూ పాత్రను కుదించే పనిలో నేడు బీజేపీ తలమునకలై ఉంది. దేశ విభజన, జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించడం, చైనాతో యుద్ధం వంటి అంశాలలో ప్రధానమంత్రిగా నెహ్రూ పోషించిన పాత్ర, తీసుకొన్న నిర్ణయాలపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. అయితే, కేవలం ఆయన విజయాలను విస్మరించి వైఫల్యాలను సాకుగా చూపి దేశ చరిత్రలో నెహ్రూ పాత్రను తక్కువ చేయడం; పూర్తిగా విస్మరించాలనుకోవడం ఆశ్చర్యకరం.

దేశంలో పంచవర్ష ప్రణాళికలను ప్రవేశపెట్టి సోషలిస్ట్ అభివృద్ధి నమూనాతో మిశ్రమ ఆర్థిక వ్యవస్థను రూపొందించిన ఘనత నెహ్రూదే. ఆయన ఏర్పరిచిన 'ప్లానింగ్ కమిషన్' అటు కేంద్రానికీ, ఇటు రాష్ట్రాలకూ అనేక దశాబ్దాలపాటు దిక్సూచిగా నిలిచింది.



అయితే, ప్రధాని మోదీ అధికారంలోకి రాగానే ప్లానింగ్ కమిషన్‌ను రద్దు చేసి దానిస్థానంలో నీతి ఆయోగ్‌ను ప్రవేశపెట్టారు.

బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ప్రాథమిక విద్యకు సంబంధించిన పాఠ్యాంశాలలో నెహ్రూపై ఉన్న అధ్యాయాలను ఇటీవల తొలగించారు. కర్ణాటక ప్రభుత్వమైతే 'హర్ ఘర్ తిరంగా' ప్రచార కార్యక్రమాలలో భాగంగా వివిధ స్వాతంత్ర్య సమరయోధుల ఫోటోలు వేసి, నెహ్రూ బొమ్మ లేకుండా చేసింది. దానిపై విమర్శలు వెల్లువెత్తినా ప్రభుత్వం మౌనంగా ఉండిపోయింది.

ఈ ఏడాదిలోనే ఢిల్లీలోని ఒకప్పటి నెహ్రూ అధికార నివాసమైన తీన్‌మూర్తి భవన్‌లో నిర్వహిస్తున్న నెహ్రూ మెమోరియల్ మ్యూజియం, లైబ్రరీలకు ప్రాధాన్యం తగ్గించి, అందులో భారత ప్రధానుల జీవితాలను తెలియజెప్పే కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేశారు. మాజీ ప్రధానులందరినీ సముచితంగా గౌరవించడంలో తప్పులేదు. కానీ, నెహ్రూ మ్యూజియంను అక్కడి నుండి తొలగించాల్సిన అవసరం ఉందా? ఇక, దేశ స్వాతంత్ర్య పోరాటంలో ప్రధాన సంఘటన అయిన 'క్విట్ ఇండియా' ఉద్యమంపై నేషనల్ ఆర్కైవ్స్ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లోనూ నెహ్రూ ప్రస్తావన లేకుండా చేశారు. ప్రధాని మోదీ తనకు నెహ్రూపై గల వ్యతిరేకతను బహిర్గత పర్చడానికి ఏమాత్రం సంకోచించరు. పార్లమెంట్‌లోనే ఓ సందర్భంలో 'భారతదేశానికి స్వాతంత్ర్యం నెహ్రూ ఒక్కడి వల్లనే రాలేదు' అని వ్యాఖ్యానించి అందర్నీ ఆశ్చర్యపరిచారు. ఆయన ఒక్కరి వల్లనే వచ్చిందని ఎవరన్నారు?

నెహ్రూ పాలనలో జరిగిన వ్యవసాయ విప్లవం, క్షీర విప్లవం, నీలి విప్లవం; ఏర్పాటైన వివిధ అత్యున్నత విద్యా సంస్థలు, రష్యా సాంకేతిక సహకారంతో నెలకొల్పిన పబ్లిక్ రంగ సంస్థలు, భారీ నీటి పారుదల ప్రాజెక్టులు, విదేశాలతో ఏర్పరచుకొన్న సత్సంబంధాలు, అనుసరించిన అలీన విధానం, పంచవర్ష ప్రణాళికలు; విజ్ఞాన శాస్త్ర సాంకేతిక రంగాలలో జరిపిన కృషి; అనుసరించిన లౌకికవాదం (సెక్యులరిజం), భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు... ఇలాంటివెన్నో పండిట్ నెహ్రూను నవభారత శిల్పిగా నిలిపాయి. ఆయన పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేయడానికీ, వ్యక్తి స్వేచ్ఛను కాపాడటానికీ అధిక ప్రాధాన్యం ఇచ్చిన విషయాన్ని చరిత్ర చెబుతోంది. ఆయన విమర్శకులు సైతం ఈ విషయాలను ఒప్పుకోక తప్పదు.

నెహ్రూ విమర్శలకు అతీతుడేమీ కాదు. ఆయన చేసిన తప్పుల్ని ఎత్తి చూపవచ్చు. అదే సమయంలో చరిత్రలో ఆయన స్థానం ఆయనకు ఇవ్వాల్సిందే. ఆయనను తక్కువ చేసి చూపడం వల్లా, విస్మరించడం వల్లా బీజేపీకి ఒరిగే లాభం ఏమిటి?

వ్యాసకర్త ఏపీ శాసన మండలి సభ్యులు

క్లుప్తంగా

గన్నవరం ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్‌గా లక్ష్మీకాంత్‌రెడ్డి బాధ్యతల స్వీకారం



రామారావు నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న లక్ష్మీకాంత్‌రెడ్డి

విమానాశ్రయం(గన్నవరం) : ఎట్టకేలకు రెండేళ్ల తర్వాత ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా.. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి(గన్నవరం) పూర్తి స్థాయి డైరెక్టర్‌ను నియమించింది. విమానాశ్రయంలో కమ్యూనికేషన్ అండ్ నావిగేషన్ సర్వేలెన్స్ హెచ్‌వోడీగా పనిచేస్తున్న జాయింట్ జనరల్ మేనేజర్ ఎం.లక్ష్మీకాంత్‌రెడ్డిని ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు సోమవారం ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా కొనసాగుతున్న పీవీ రామారావు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ సుమారు రూ.471 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ నిర్మాణాన్ని మరో పది నెలల్లోపు పూర్తి చేసేందుకు ముందుకుసాగుతున్నట్టు తెలిపారు. ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ అందుబాటులోకొస్తే డొమెస్టిక్, ఇంటర్నేషనల్ ప్రయాణికుల సేవలు ఒకచోట నుంచే నిర్వహించవచ్చన్నారు. ప్రస్తుతం ఇంటర్నేషనల్ విమానాలు మస్కట్‌కు ఇక్కడి నుంచి వారానికి ఒకటి, కువైట్, షార్జా, మస్కట్ నుంచి ఐదు సర్వీస్‌లు ఇక్కడికి నడుస్తున్నాయని తెలిపారు. అక్టోబర్ 31 నుంచి షార్జా–విజయవాడ మధ్య వారానికి రెండు నూతన సర్వీస్‌లను ప్రారంభిస్తున్నట్టు వెల్లడించారు. భవిష్యత్‌లో సింగపూర్‌తో పాటు మరిన్ని గల్ఫ్ దేశాలకు ఇంటర్నేషనల్ విమాన సర్వీస్‌లు నడిపేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు. దేశీయంగా ముంబై, వారణాసికి విమాన సర్వీస్‌లు నడపాలని ఎయిరిండియాను కోరామన్నారు. ఎలక్ట్రికల్ విభాగం జాయింట్ డైరెక్టర్ పీవీ రామారావు, ఆర్థిక విభాగం జనరల్ మేనేజర్ బీవీ సూర్యభగవానులు, సివిల్ విభాగం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వీరవల్లి శ్రీనివాస్, ఆపరేషన్స్ సీనియర్ మేనేజర్ అంకిత్ జైసాల్వ్ తదితరులు పాల్గొన్నారు.

కాపుల అభివృద్ధికి మరింత కృషి

డైరెక్టర్ల ప్రమాణ స్వీకారోత్సవంలో చైర్మన్ అడపా శేషు



డైరెక్టర్ల ప్రమాణ స్వీకారంలో సంస్థ చైర్మన్ అడపా శేషగిరి , ఎండీ రేఖారాణి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన కాపు, తెలగ, బలిజ, ఒంటరి వర్గాలకు చేరేలా మరింతగా కృషి చేయాలని రాష్ట్ర కాపు సంక్షేమ, అభివృద్ధి సంస్థ చైర్మన్ అడపా శేషగిరి సూచించారు. రాష్ట్రంలో కాపుల అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. ప్రభుత్వం నియమించిన కాపు సంక్షేమ, అభివృద్ధి సంస్థ డైరెక్టర్లు చీకట్ల కిశోర్, దూలిపూడి ఆంజనేయులు, ఎల్.వెంకటరావు, దాది వెంకటలక్ష్మీ రాజ్యం, చిమటా బాలాజీ, పిన్నింటి మహేశ్, మేడిబోయిన శ్రీవేణి, ఊది సునీత, ఎస్.నరసింహారావు, వీసం రామకృష్ణ, కె.నాగ వెంకటలక్ష్మీకుమారి, ఇలపకుర్తి లక్ష్మిల ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం తాడేపల్లిలోని సంస్థ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ ఎండీ జి.రేఖారాణి తదితరులు పాల్గొన్నారు.

బతికి వస్తాడని బాలుడి మృతదేహానికి ఉప్పు పాతర

బళ్లారి జిల్లాలో బాలుడి తల్లిదండ్రుల మూఢ నమ్మకం



ఉప్పుతో కప్పి పెట్టిన బాలుడి మృతదేహం

బళ్లారి అర్బన్ : నీట మునిగి మరణించిన బాలుడి మృతదేహానికి ఉప్పు పాతర వేస్తే మళ్లీ బతుకుతాడన్న నమ్మకంతో తల్లిదండ్రులు ఉప్పు పాతర వేశారు. ఈ ఘటన కర్ణాటకలో బళ్లారి తాలూకాలోని సిరివార గ్రామంలో జరిగింది. శేఖర్, గంగమ్మ దంపతుల చిన్న కుమారుడు భాస్కర్(10) సోమవారం ఈతకు వెళ్లి నీటి గుంతలో పడి మృతి చెందాడు. అయితే నీటిలో పడి మరణించిన వారిని రెండు గంటల్లోగా ఉప్పులో కప్పి పెడితే బతుకుతారనే మూఢ నమ్మకంతో తల్లిదండ్రులు సుమారు 4–5 బస్తాల ఉప్పును తెచ్చి మృతదేహంపై కుప్పగా పోశారు. బాలు డు బతికి వస్తాడని దాదాపు 8 గంటల పాటు ఎదురు చూశారు. ఈ ఉదంతం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఆ తర్వాత బాలుడి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

9న బంగాళాఖాతంలో అల్పపీడనం!



ఈ నెల 8 నుంచి రాష్ట్రంలో మోస్తరు నుంచి అతి భారీ వర్షాలు

సాక్షి, విశాఖపట్నం: తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఈ నెల 7న ఉపరితల ఆవర్తనం ఏర్పడనుంది. 48 గంటల అనంతరం అంటే ఈ నెల 9న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) సోమవారం వెల్లడించింది. దీని ప్రభావం రాష్ట్రంపై ఎక్కువగా ఉంటుందని తెలిపింది. ఈనెల 8 నుంచి కోస్తాంధ్ర, రాయలసీమల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, కోస్తాంధ్రలో అక్కడక్కడ అతి భారీ వర్షాలు కురిసే వీలుందని వివరించింది. అదే సమయంలో గంటకు 45 – 65 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కూడా వీస్తాయని, అందువల్ల మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లవద్దని సూచించింది. ప్రస్తుతం ఉత్తర–దక్షిణ ద్రోణి ఉత్తర కర్ణాటక నుంచి కొమరిన్ ప్రాంతం వరకు తమిళనాడు అంతర్భాగంలో సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోంది. దీని ప్రభావంతో మంగళ, బుధవారాల్లో దక్షిణ కోస్తా, ఉత్తర కోస్తాల్లో కొన్నిచోట్ల, రాయలసీమలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, సీమలో ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అక్కడక్కడ పిడుగులు కూడా పడతాయని ఐఎండీ తెలిపింది.

ఏడాదిగా రోజూ రూ.లక్షల్లో డిపాజిట్

క్యాష్ డిపాజిట్ మిషన్ ద్వారా జమ
చెన్నైలో యువకుడి అరెస్ట్ .. ఈడీ విచారణ



సాక్షి, చెన్నై : ఏడాదిగా చెన్నైలో ఓ యువకుడు ఎస్‌బీఐ డిపాజిట్ మిషన్ ద్వారా రోజుకు రూ.2లక్షల నుంచి రూ.5 లక్షల వరకు నగదు డిపాజిట్ చేస్తూ బ్యాంకు అధికారులకు చిక్కాడు. ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. చెన్నై కీల్పాక్కం అళగప్పా వీధిలో ఉన్న ఏటీఎం కేంద్రంలోని డిపాజిట్ మిషన్ ద్వారా ఓ యువకుడు రోజూ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఏదో ఒక ఖాతాలో డిపాజిట్ చేస్తున్నాడు. ఏడాదిగా సాగుతున్న ఈ వ్యవహారంపై ఎస్‌బీఐ అధికారులు దృష్టిపెట్టి, పోలీసులకు సమాచారం అందించారు. ఈ క్రమంలో ఆదివారం రంగంలోకి దిగిన పోలీసులు ఆ ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలోని సీసీ టీవీ ఫుటేజీని సేకరించారు. రోజూ సాయంత్రం ఆరు గంటలకు ఆ యువకుడు నగదు డిపాజిట్ చేస్తున్నట్లు గుర్తించారు. సాయంత్రం 5.50 గంటలకు పోలీసులు ఆ కేంద్రం వద్ద నిఘా పెట్టారు. ఆరు గంటలకు ఏటీఎంలోకి వచ్చిన వ్యక్తి రూ.2.10 లక్షలు డిపాజిట్ చేస్తుండగా, పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీసీ టీవీ ఫుటేజీలో ఉన్న యువకుడు, తమకు చిక్కిన వ్యక్తి ఒకడే కావడంతో రహస్య ప్రదేశానికి తరలించి రాత్రంతా విచారించారు. ఆ యువకుడు చెన్నైలోని పులియాంతోపునకు చెందిన సాయినా (29)గా గుర్తించారు. ఇతను ఓ బైక్ సర్వీస్ కంపెనీలో పనిచేస్తున్నట్లు విచారణలో తేలింది. చెన్నైలోని ప్యారిస్‌కు చెందిన పర్వేజ్ అనే వ్యక్తి రోజూ అతను చెప్పిన ఖాతాల్లో నగదు డిపాజిట్ చేసే పని తనకు అప్పగించినట్లు ఆ యువకుడు పోలీసులకు తెలిపాడు. తనకు రూ.లక్షకు రూ.వెయ్యి కమీషన్‌గా ఇస్తాడని పేర్కొన్నాడు. దీంతో సాయినాను సోమవారం ఈడీ అధికారులకు పోలీసులు అప్పగించారు.

రాష్ట్రంలో తొలి ఐటీవోటీ సెంటర్ ప్రారంభం

గాజువాకలో ప్రారంభించిన ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ (గాజువాక): ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు ఇన్‌స్ట్రక్టర్లుగా శిక్షణ ఇచ్చేందుకు విశాఖపట్నం జిల్లా పెదగంట్యాడలో కేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు ఇన్‌స్ట్రక్టర్‌గా శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించేందుకు ఇన్‌స్ట్రక్టర్ ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ (ఐటీవోటీ) సెంటర్‌ను ప్రభుత్వ ఐటీఐ స్టీల్ సిటీలో సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ.. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్ ట్రేడుల్లో ఉత్తీర్ణులై.. ఇన్‌స్ట్రక్టర్‌గా ఎంపికైనవారికి ఇక్కడ పూర్తి స్థాయిలో శిక్షణ ఇస్తారన్నారు. ఎంపికైన విద్యార్థులకు స్టీల్‌ప్లాంట్, గంగవరం పోర్టు అధికారులతో చర్చించి, సీఎస్సార్ నిధులతో సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటికే ఈ కేంద్రానికి వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారని ఐటీఐ ప్రిన్సిపాల్ సుధాకరరావు తెలిపారు.

తనికెళ్ల భరణికి లోక్‌నాయక్ సాహిత్య పురస్కారం ప్రదానం

- విశాఖలో ఘనంగా ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవం
- ఎన్టీఆర్‌కు సేవలందించిన నలుగురికి ఘన సత్కారం



లోక్‌నాయక్ ఫౌండేషన్ పురస్కారం అందుకుంటున్న తనికెళ్ల భరణి

మద్దిలపాలెం (విశాఖ తూర్పు): లోక్‌నాయక్ ఫౌండేషన్ వార్షిక సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు, రచయిత తనికెళ్ల భరణికి సోమవారం ఇక్కడ ప్రదానం చేశారు. లోక్‌నాయక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఏపీ అధికార భాషా సంఘం చైర్మన్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా మిజోరం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు, ప్రముఖ హీరో డాక్టర్ మంచు మోహన్‌బాబు, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ ఎన్ జయప్రకాష్ నారాయణ్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. వీరి చేతుల మీదుగా తనికెళ్ల భరణికి సాహిత్య పురస్కారం, రూ.2 లక్షల నగదు బహుమతి అందజేసి ఘనంగా సత్కరించారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి ఆయనకు సేవలందించిన నాటి ప్రత్యేక అధికారి గోటేటి రామచంద్రరావు, వ్యక్తిగత సహాయకుడు మోహన్, భద్రతాధికారి కృష్ణారావు, డ్రైవర్ లక్ష్మణ్‌లను కూడా సత్కరించారు. వీరికి ఒక్కొక్కరికి రూ. లక్ష నగదు అందజేశారు. 18 సంవత్సరాలుగా సాహిత్య పురస్కారాన్ని అందజేస్తున్నట్లు యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్‌పై రూపొందించిన లఘు చిత్ర ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. తెలుగు భాషాభివృద్ధికి ఎన్టీఆర్ చేసిన కృషిని అతిథులు కొనియాడారు. తెలుగు రాష్ట్రానికి ఖండాంతర ఖ్యాతిని తీసుకువచ్చిన తీరును గుర్తు చేసుకున్నారు.

అహ్మదాబాద్‌లో శ్రీవారి ఆలయానికి భూమి

టీటీడీ చైర్మన్‌కు గుజరాత్ సీఎం హామీ



గుజరాత్ సీఎం భూపేంద్ర రజనీకాంత్ పటేల్‌ను సన్మానిస్తున్న టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి

సాక్షి, అమరావతి/తిరుమల : అహ్మదాబాద్‌లో కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయ నిర్మాణానికి అనువైన భూమి కేటాయిస్తామని గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర రజనీకాంత్ పటేల్ హామీ ఇచ్చారు. పాలక మండలి సభ్యుడు కేతన్ దేశాయ్‌తో కలిసి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సోమవారం అహ్మదాబాద్‌లో సీఎం పటేల్‌ని కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శ్రీవారి ప్రసాదం అందించి, శాలువాతో సత్కరించారు. ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సనాతన హిందూ ధర్మ ప్రచారానికి టీటీడీ చేపట్టిన కార్యక్రమాలను వైవీ సుబ్బారెడ్డి గుజరాత్ సీఎంకి వివరించారు. ఇందులో భాగంగా జమ్మూలో శ్రీవారి ఆలయ నిర్మాణం జరుగుతోందని, ఇటీవలే భువనేశ్వర్‌లోనూ ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించామన్నారు. త్వరలోనే ముంబైలోనూ స్వామివారి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేయనున్నామని చెప్పారు. గుజరాత్‌లో కూడా స్వామివారి ఆలయ నిర్మాణం నిమిత్తం టీటీడీకి ఉచితంగా భూమి కేటాయించాలని కోరారు. ఈ ప్రతిపాదనకు గుజరాత్ సీఎం సంతోషం వ్యక్తంచేసి అధికారులతో చర్చించి అవసరమైన భూమిని అనువైన ప్రదేశంలో టీటీడీకి కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

అధికారులపై చర్యలకు సిఫారసు

బోగస్ కుల సర్టిఫికెట్ల జారీలో
లోకాయుక్తకు నివేదించిన పశ్చిమ గోదావరి కలెక్టర్



లోకాయుక్త చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి

కర్నూలు (సెంట్రల్): బోగస్ కుల సర్టిఫికెట్ల జారీ కేసులో పశ్చిమ గోదావరి జిల్లా ఉంగుటూరు పూర్వపు తహశీల్దార్, ప్రస్తుతం డిప్యూటీ కలెక్టర్ హోదాలో జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఉన్న పద్మావతిపై చర్యలకు సీసీఎల్‌ఏకు సిఫారసు చేసినట్టు ఆ జిల్లా కలెక్టర్ లోకాయుక్తకు నివేదిక అందించారు. ఆమెతో పాటు మరో 8 మంది ఇతర క్యాడర్ల అధికారులకూ బోగస్ సర్టిఫికెట్ల జారీలో ప్రమేయం ఉండటంతో వారిపైనా చర్యలకు నివేదించినట్లు తెలిపారు. కేసు పూర్వాపరాలు.. ఉంగుటూరు మండల తహశీల్దార్ 2013–2015 మధ్య 26 బోగస్ కుల సర్టిఫికెట్లు జారీ చేశారని, వాటిని రద్దు చేయడంతో పాటు, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని, సర్టిఫికెట్లను పొందిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని.. అదే మండలంలోని నాచుగుంటకు చెందిన గంగాధర్ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణకు ఆదేశించిన లోకాయుక్త.. పూర్తి వివరాలతో నివేదించాలని ఆదేశాలిచ్చింది. 2013–14 మధ్య పద్మావతి తహశీల్దార్‌గా ఉన్న సమయంలో 15, తిరుమలరావు హయాంలో 2, ఎ.క్రిష్ణ హయాంలో 4, కేవీఎస్ దుర్గా హయాంలో 1, వైకేవీ అప్పారావు హయాంలో 4 బోగస్ కుల సర్టిఫికెట్లు జారీ అయ్యాయని, వీటిని పొందిన 26 మందిలో 12 మందిపై క్రిమినల్ కేసులు పెట్టామని 2020 సెప్టెంబర్ 13న అప్పటి కలెక్టర్ నివేదించారు. ఆ నివేదికను పరిశీలించిన లోకాయుక్త.. పూర్తి విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని ఆదేశించింది. ఈ క్రమంలో ప.గో జిల్లాలో మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న పద్మావతితో పాటు మరో 8 మంది అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సీసీఎల్‌ఏకు సిఫారసు చేశామని, బోగస్ సర్టిఫికెట్లను పొందిన వారిలో 12 మంది అరెస్టు కాగా, మిగిలిన వారినీ అరెస్ట్ చేసి జైలుకు పంపినట్టు కలెక్టర్ తాజాగా నివేదిక సమర్పించడంతో లోకాయుక్త చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు.

విద్య, వైద్య రంగంలో ప్రభుత్వ కృషి భేష్

- సీఎం జగన్ సంకల్పాన్ని అభినందిస్తున్నా
- లోక్‌సత్తా జాతీయ అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ



డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): విద్య, వైద్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువస్తున్న మార్పులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ అన్నారు. 'అందరికీ ఆరోగ్యం' అనే పుస్తకాన్ని సోమవారం విశాఖపట్నంలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వైద్య రంగంలో తీసుకువస్తున్న ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ గురించి పలువురు అధికారులు తనకు చెప్పారని పేర్కొన్నారు. 'ఫ్యామిలీ డాక్టర్' వ్యవస్థ లేకపోతే చిన్న జబ్బులకు కూడా పట్టణాలకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. సీఎం వైఎస్ జగన్ సంకల్పాన్ని పూర్తిగా అభినందిస్తున్నానని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రభుత్వాలు మాత్రమే ఆరోగ్యశ్రీకి ఎక్కువ డబ్బులు ఖర్చు చేస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో ఫ్రీ డయాగ్నోస్టిక్స్‌ను బాగా అమలు చేస్తున్నారని కొనియాడారు. విద్య, వైద్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువస్తున్న మార్పులతో ఎంతో మేలు జరుగుతోందన్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ ద్వారా దేశానికే ఒక మార్గం చూపించారని జయప్రకాశ్ నారాయణ చెప్పారు. ఆరోగ్యశ్రీని చూసే కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం చేపట్టిందని చెప్పారు. కాగా, దీర్ఘకాల అభివృద్ధికి ఎంతైనా అప్పు చేయవచ్చన్నారు. ఏపీకి ఆర్థికంగా తీవ్ర అన్యాయం జరుగుతోందని.. రాష్ట్రాల కన్నా తామే ముఖ్యమన్న ధోరణిలో కేంద్రం ఉందన్నారు. విభజన హామీలు కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ పాల్గొన్నారు.

టీటీడీ ఉద్యోగిపై నటి అర్చనాగౌతమ్ దాడి

- అవాస్తవ ఆరోపణలతో ఉద్యోగులపైనే తప్పుడు ఫిర్యాదు
- టీటీడీ ఖండన

తిరుమల : నటి అర్చన అవాస్తవాలతో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని, అలాంటి అవాస్తవాలను భక్తులు నమ్మొద్దని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఆ ప్రకటనలోని వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన శివకాంత్ తివారి, నటి అర్చనాగౌతమ్‌తో పాటు మరో ఏడుగురు ఆగస్టు 31న శ్రీవారి దర్శనం కోసం కేంద్ర సహాయ మంత్రి నుంచి సిఫారసు లేఖతో తిరుమలకు చేరుకున్నారు. దర్శనం కోసం అదనపు ఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ లేఖపై రూ.300 దర్శనం టికెట్లు మంజూరు చేస్తూ శివకాంత్ తివారీ మొబైల్ నంబర్‌కు మెసేజ్ పంపారు. అయితే వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోలేదు. ఆ తర్వాత శివకాంత్ తివారి అదనపు ఈవో కార్యాలయానికి వెళ్లారు. అప్పటికే టికెట్లు తీసుకోవాల్సిన గడువు ముగిసిందని వారు తెలిపారు. అయితే శివకాంత్ తివారితో పాటు నటి అర్చనాగౌతమ్ అదనపు ఈవో కార్యాలయంలోకి చొచ్చుకుని వచ్చి ఆగ్రహంతో విచక్షణ కోల్పోయి కార్యాలయ సిబ్బందిని దుర్భాషలాడారు. సర్ది చెప్పబోయిన ఉద్యోగిపై చేయి చేసుకున్నారు. చివరకు కార్యాలయ సిబ్బంది రెండోసారి రూ.300 టికెట్లు కేటాయించినా తీసుకునేందుకు అర్చనాగౌతమ్ నిరాకరించారు. అక్కడి నుంచి టు టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి.. కార్యాలయ సిబ్బంది తనపై చేయి చేసుకుని దురుసుగా ప్రవర్తించారంటూ తప్పుడు ఫిర్యాదు చేశారు. దీంతో అదనపు ఈవో కార్యాలయ సిబ్బందిని సీఐ పిలిపించి విచారణ చేపట్టారు. సిబ్బంది తాము తీసిన వీడియోను సీఐకి చూపగా.. నటి దురుసుగా ప్రవర్తించిన విషయం వెలుగుచూసింది. దీంతో నటి వెనక్కి తగ్గి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆగస్టు 1వ తేదీకి వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్ కావాలంటే రూ.10,500 చెల్లించి శ్రీవారి దర్శన టికెట్ పొందొచ్చని మాత్రమే సిబ్బంది సలహా ఇచ్చారు. వాస్తవాలిలా ఉండగా.. అదనపు ఈవో కార్యాలయ సిబ్బంది దర్శనం టికెట్ కోసం రూ.10 వేలు డిమాండ్ చేశారని సదరు వీడియోలో నటి ఆరోపించారు. తాను సెలబ్రిటీ అయినందున ఏం చెప్పినా భక్తులు నమ్ముతారనే అభిప్రాయంతో నటి అర్చన అవాస్తవాలతో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేశారని, ఇలాంటి ప్రచారాలను భక్తులు నమ్మొద్దంటూ టీటీడీ కోరింది.

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ప్రివిలేజ్ దర్శనాలు రద్దు

సామాన్య భక్తులకు పెద్దపీట

తిరుమల : తిరుమలలో రెండేళ్ల తర్వాత శ్రీవారి బ్రహ్మోత్సవ వాహనసేవలను మాడ వీధుల్లో నిర్వహించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 26 నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. కరోనా కారణంగా గతంలో రెండు బ్రహ్మోత్సవాలు శ్రీవారి ఆలయంలో ఏకాంతంగా నిర్వహించిన విషయం తెలిసిందే. ఈసారి బ్రహ్మోత్సవాలకు పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశం ఉంది. దీంతో సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ సర్వదర్శనం మాత్రమే అమలు చేయాలని టీటీడీ నిర్ణయించింది. బ్రహ్మోత్సవాల రోజుల్లో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని వీఐపీ బ్రేక్ దర్శనాలు, వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేక దర్శనం తదితర ప్రివిలేజ్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. ఆర్జిత సేవలు, రూ.300 దర్శన టికెట్ల తోపాటు శ్రీవాణి ట్రస్ట్ దాతలు, ఇతర ట్రస్ట్‌ల దాతలకు దర్శన టికెట్లను రద్దు చేసింది. స్వయంగా వచ్చే ప్రొటోకాల్ వీఐపీలకు మాత్రమే బ్రేక్ దర్శనం ఉంటుంది. గదులకు సంబంధించి 50 శాతం ఆన్‌లైన్‌లో భక్తులు బుక్ చేసుకునేందుకు వీలుగా అందుబాటులో ఉంచారు. మిగిలిన గదులను ఆఫ్‌లైన్‌లో తిరుమలలోని వివిధ కౌంటర్ల ద్వారా భక్తులకు కేటాయిస్తారు. అక్టోబర్ ఒకటో తేదీన గరుడసేవ కారణంగా భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ట్రస్ట్‌ల దాతలకు, కాటేజీ దాతలకు సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో గదుల కేటాయింపును నిలిపివేయాలని టీటీడీ నిర్ణయించింది.

శ్రీవారి దర్శనానికి 4 గంటలు: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. రెండు కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 71,158 మంది స్వామిని దర్శించుకోగా.. 27,968 మంది తలనీలాలు సమర్పించారు. శ్రీవారి హుండీలో కానుకల రూపంలో భక్తులు రూ.3.73 కోట్లు సమర్పించుకున్నారు. దర్శనానికి నాలుగు గంటల సమయం పడుతోంది. మరోవైపు సోమవారం శ్రీవారిని సినీనటుడు బెల్లంకొండ శ్రీనివాస్, సినీనటి మాళవిక నాయర్, హాస్య నటుడు బ్రహ్మానందం, నేషనల్ చెస్ చాంపియన్ గూకేష్ దర్శించుకున్నారు.

బదిలీ అయినా విశాఖలో క్వార్టర్స్

వాల్తేర్ డివిజన్ రైల్వే ఉద్యోగులకు అవకాశం కల్పించిన డీఎంఆర్



తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): ఎటువంటి సౌకర్యాలు లేని ప్రాంతాలకు ఉద్యోగులు బదిలీ అయితే వారి కుటుంబాలు విశాఖపట్నంలోనే నివాసం ఉండేందుకు క్వార్టర్స్‌లు కేటాయించాలని వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి నిర్ణయించారు. సాధారణంగా రైల్వే ఉద్యోగులు బదిలీ అయితే వారు నివాసం ఉంటున్న క్వార్టర్స్‌ను మూడు నెలల్లో ఖాళీ చేయాలి. మూడు నెలల అనంతరం ఖాళీ చేయకపోతే పీనల్ చార్జీల రూపంలో అధికంగా అద్దె చెల్లించాల్సి ఉంటుంది. వాల్తేర్ డివిజన్ పరిధిలోని కొత్తవలస–కిరండూల్, కొత్తవలస–రాయగడ లైన్‌లలో ఉద్యోగుల కు సరైన వసతులు ఉండవు. అందువల్ల ఆయా లైన్‌లకు బదిలీ అయిన ఉద్యోగుల కుటుంబాల కోసం విశాఖపట్నంలోనే క్వార్టర్స్‌లు కేటాయించాలని డీఆర్‌ఎం నిర్ణయించారు. ఆరు నెలలుగా ఖాళీగా ఉన్న క్వార్టర్స్‌లను వీరికి కేటాయిస్తారు. ఏడాది పాటు పాత అద్దె చెల్లించాలి. ఆ తర్వాత కూడా అదే క్వార్టర్స్‌లో ఉండాలనుకుంటే రెట్టింపు అద్దెను చెల్లించాల్సి ఉంటుంది. ఇలా ఎంతకాలమైనా ఉండవచ్చు. ఈ నిర్ణయంపై రైల్వే ఉద్యోగులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

అపోలోకు దీటుగా శ్రీ పద్మావతి హృదయాలయం

- గుండె మార్పిడి శస్త్ర చికిత్సలకు అవసరమయ్యే యంత్రాలన్నీ అందిస్తాం
- అపోలో హాస్పిటల్స్ అధినేత డాక్టర్ ప్రతాప్ రెడ్డి



కార్డియాక్ కేర్ సెంటర్‌ను పరిశీలిస్తున్న అపోలో అధినేత డాక్టర్ ప్రతాపరెడ్డి

తిరుపతి తుడా : టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం (గుండె చికిత్సల ఆస్పత్రి) అపోలో హాస్పిటల్‌కు ఏ మాత్రం తీసిపోని స్థాయిలో వైద్య సేవలు అందిస్తోందని అపోలో హాస్పిటల్స్ అధినేత డాక్టర్ ప్రతాప్ రెడ్డి అన్నారు. ఆయన కుటుంబ సమేతంగా సోమవారం శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయ ఆస్పత్రిని సందర్శించారు. జనరల్ వార్డు, ఐసీయూలు, ఆపరేషన్ థియేటర్లు, క్యాత్ ల్యాబ్ విభాగాలను పరిశీలించారు. డాక్టర్లు, సిబ్బందితో మాట్లాడారు. ఆస్పత్రిని ప్రారంభించిన ఏడాదిలోపే 600 మందికి పైగా చిన్న పిల్లలకు ఉచితంగా గుండె ఆపరేషన్లు చేశామని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి... డాక్టర్ ప్రతాప్‌రెడ్డికి వివరించారు. పొరుగు రాష్ట్రాల తోపాటు ఇటీవల బంగ్లాదేశ్ నుంచి కూడా వచ్చి వైద్య సేవలను పొందారని తెలిపారు. త్వరలోనే గుండె మార్పిడి శస్త్ర చికిత్సలకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. చిన్నపిల్లల హృదయాలయం ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ రెడ్డి క్యాత్ ల్యాబ్ నిర్వహణ, ఆపరేషన్లు చేసేందుకు పాటిస్తున్న విధానాలను డాక్టర్ ప్రతాప్‌రెడ్డికి వివరించారు. అనంతరం డాక్టర్ ప్రతాప్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ చిన్నపిల్లల హృదయాలయంలో శుభ్రత, ఇన్ఫెక్షన్ నివారించే చర్యలు, వైద్య సేవలు, సర్జరీలు చేస్తున్న విధానం, డాక్టర్లు, సిబ్బంది ఆత్మవిశ్వాసం ఎంతో గొప్పగా ఉన్నాయని అభినందించారు. గుండె మార్పిడి శస్త్ర చికిత్సలకు అవసరమయ్యే యంత్ర సామగ్రి మొత్తం తమ కుటుంబం విరాళంగా అందిస్తుందని ప్రకటించారు. అపోలో హాస్పిటల్స్ నుంచి డాక్టర్లు ఇక్కడికి వచ్చి ఉచితంగా ఆపరేషన్లు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. విదేశాల్లో తమ హాస్పిటల్స్‌కు సాంకేతిక, వైద్య సహకారం అందిస్తున్న పేరొందిన చిన్న పిల్లల ఆస్పత్రుల సేవలు కూడా ఇక్కడకు తీసుకొస్తామన్నారు. కోవిడ్ సమయంలో ప్రజల కోసం టీటీడీ ఎంతో గొప్ప సేవలు అందించిందని కొనియాడారు. తిరుమల శ్రీవారిని డాక్టర్ ప్రతాప్ రెడ్డి దర్శించుకున్నారు.

క్లుప్తంగా...

సంజయ్ రౌత్ కస్టడీ మరో 14 రోజులు పొడిగింపు

ముంబై: శివసేన ఎంపీ సంజయ్ రౌత్ జ్యుడీషియల్ కస్టడీని ప్రత్యేక కోర్టు మరో 14 రోజులు పొడిగించింది. పత్రా చౌల్ పునర్నిర్మాణం పనుల్లో రూ.1,034 కోట్ల మేరకు అవకతవకలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణల మేరకు ఆయనపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మనీ లాండరింగ్ కేసు నమోదు చేసింది. ఆగస్ట్ ఒకటో తేదీన ఆయన్ను అరెస్ట్ చేసింది. ఇప్పటికే ఆయన కస్టడీని న్యాయస్థానం రెండుసార్లు పొడిగించింది. సోమవారంతో 14 రోజుల కస్టడీ గడువు ముగియడంతో అధికారులు ఆయన్ను ప్రత్యేక కోర్టు జడ్జి ఎంజీ దేశ్‌పాండే ఎదుట హాజరు పరిచారు. ఈడీ వినతి మేరకు రౌత్ కస్టడీని ఈ నెల 19వ తేదీ వరకు పొడిగిస్తూ జడ్జి ఆదేశాలిచ్చారు.

స్కూళ్ల ఆధునీకరణకు పీఎంశ్రీ

న్యూఢిల్లీ: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలల పురోభివృద్ధికి ఉద్దేశించిన కొత్త పథకాన్ని ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా 14,500 పాఠశాలల అభివృద్ధి, ఆధునికీకరణే ధ్యేయంగా ప్రధాన్ మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎం-శ్రీ) యోజనను ప్రారంభిస్తున్నట్లు మోదీ ట్వీట్లు చేశారు. నూతన జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) స్ఫూర్తికి కొనసాగిస్తూ ఈ ముందడుగు వేశామని పీఎం-శ్రీనుద్దేశిస్తూ మోదీ అన్నారు. 'పీఎం-శ్రీతో ఈ 14,500 పాఠశాలలు ఇకపై మోడల్ స్కూళ్లుగా భాసిల్లుతాయి. స్కూళ్లలో స్మార్ట్ తరగతి గదులు, నవీకరించిన మౌలిక సదుపాయాలు, లైబ్రరీ, ల్యాబ్‌లతోపాటు ఆధునాతన, సంస్కరణాత్మక, కొత్త తరహాలో బోధన కొనసాగుతుంది. పీఎం-శ్రీతో లక్షలాది మంది విద్యార్థులు లబ్ధిపొందుతారు' అని మోదీ మరో ట్వీట్‌చేశారు. మరోవైపు, 'రెండున్నర శతాబ్దాలు దేశాన్ని పాలించిన బ్రిటన్‌ను వెనక్కినెట్టి ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్ ఎదిగింది. ఇది నిజంగా ప్రత్యేకం' అని మోదీ ట్వీట్‌చేశారు.

కాబూల్‌లోని రష్యా ఎంబసీ వద్ద ఆత్మాహుతి దాడి

కాబూల్: అఫ్గాన్ రాజధాని కాబూల్‌లోని రష్యా రాయబార కార్యాలయం వద్ద సోమవారం ఆత్మాహుతి దాడి చోటుచేసుకుంది. ఘటనలో ఇద్దరు కార్యాలయం సిబ్బందితోపాటు ఒక పౌరుడు చనిపోయారు. వీసాల సమాచారం తెలిపేందుకు రష్యా అధికారి ఒకరు కార్యాలయం గేటు వద్దకు వచ్చిన సమయంలో ఓ వ్యక్తి తనను తాను పేల్చేసుకున్నట్లు రష్యా విదేశాంగ శాఖ తెలిపింది. దాడి నేపథ్యంలో తమ ఎంబసీ వద్ద భద్రతను మరింత పెంచినట్లు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ చెప్పారు. పేలుడులో మరో 10 మంది గాయపడినట్లు కాబూల్ పోలీసులు చెప్పారు. గేట్ వద్దకు వస్తుండగా సూసైడ్ బాంబర్‌ను తమ బలగాలు కాల్చి చంపాయని అన్నారు. అయితే, దాడి ఘటనలో 8 మంది వరకు మృతి చెంది ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏడాది క్రితం తాలిబన్లు అధికారంలోకి వచ్చాక అఫ్గానిస్తాన్‌లో ఇటువంటి ఘటన జరగడం ఇదే ప్రథమం. కొత్త ప్రభుత్వాన్ని ప్రపంచ దేశాలు గుర్తించలేదు. అమెరికా, నాటో బలగాల ఉపసంహరణ, తాలిబన్ల పాలన మొదలయ్యాక కాబూల్‌లోని దౌత్యకార్యాలయాలన్నీ దాదాపుగా మూతబడ్డాయి. కార్యకలాపాలు నడుస్తున్న రష్యా ఎంబసీని లక్ష్యంగా చేసుకోవడం వెనుక కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనకు బాధ్యులమంటూ ఎవరూ ప్రకటించుకోలేదు. అయితే, తాలిబన్ స్థావరాలు, మైనారిటీ వర్గాల మసీదులు, ముఖ్యంగా షియాలే లక్ష్యంగా ఇస్లామిక్ స్టేట్ దాడులకు పాల్పడుతోంది.

హోటల్‌లో అగ్ని ప్రమాదం

లక్నోలో నలుగురు సజీవ దహనం

లక్నో: యూపీ రాజధాని లక్నోలోని ఓ హోటల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో నలుగురు చనిపోగా, కనీసం 10 మంది గాయపడ్డారు. వాణిజ్యప్రాంతం హజ్రత్‌గంజ్‌లోని ఈ నాలుగంతస్తుల భవనంలో చెలరేగిన మంటలను అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బందికి 6 గంటలకు పైగా సమయం పట్టింది. మృతులంతా లక్నోకు చెందిన వారేనని జిల్లా మెజిస్ట్రేట్ గంగ్వార్ చెప్పారు.

చైనాలో తీవ్ర భూకంపం.. 46 మంది దుర్మరణం

బీజింగ్: చైనాలోని సిచువాన్ ప్రావిన్స్ లుడింగ్ కౌంటీలో సోమవారం సంభవించిన భూకంపంతో 46 మంది మృతి చెందగా మరో 50 మంది గాయపడ్డారు. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.8గా నమోదైంది. నీరు, విద్యుత్ సరఫరా, రవాణ, టెలికమ్యూనికేషన్ వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో రక్షణ, సహాయక చర్యలు ముమ్మరమయ్యాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయని చెబుతున్నారు. కరువు పరిస్థితులు, కోవిడ్ ఆంక్షలతో ఈ ప్రావిన్స్ జనం ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు పడుతుండగా ఈ పరిణామం చోటుచేసుకుంది.

కెనడాలో కత్తిపోట్ల కలకలం

10 మంది మృతి..15 మందికి గాయాలు

రెజినా: కెనడాలోని సస్కాట్చెవాన్ ప్రావిన్స్‌లో వేర్వేరు చోట్ల చోటు చేసుకున్న కత్తిపోట్ల ఘటనల్లో 10 మంది మృతి చెందగా మరో 15 మంది వరకు గాయపడ్డారు. జేమ్స్ స్మిత్ క్రీ నేషన్, వెల్డన్‌లో ఇద్దరు వ్యక్తులు ఆదివారం ఉదయం స్థానికులపై కత్తులతో దాడికి తెగబడ్డారు. వీరిలో కొందరిపై ముందుగా వేసుకున్న పథకం ప్రకారమే దాడి చేసినట్లుగా కనిపిస్తోందని పోలీసులు తెలిపారు. ఇటువంటి ఘటన కెనడా చరిత్రలో ఇదే మొదటిసారని చెబుతున్నారు. కాగా, దాడికి పాల్పడిన వారి కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

బ్రిటన్ పీఠం ట్రస్‌దే


ఫలితాల వెల్లడి సందర్భంగా ట్రస్, రిషి

చివరిదాకా పోరాడి ఓడిన రిషి
- హోరాహోరీగా సాగిన ఎన్నిక
- నేడు ప్రధానిగా ట్రస్ ప్రమాణం
- మూడో మహిళా పీఎంగా రికార్డు

లండన్/న్యూఢిల్లీ: బ్రిటన్ ప్రధాని పీఠం కోసం జరిగిన పోరులో విదేశాంగ మంత్రి మేరీ ఎలిజబెత్ (లిజ్) ట్రస్ (47)దే పై చేయి అయింది. హోరాహోరి పోరులో భారత సంతతికి చెందిన మాజీ ఆర్థిక మంత్రి రిషి సునాక్ (42)పై ఆమె విజయం సాధించి కన్జర్వేటివ్ పార్టీ నేతగా ఎన్నికయ్యారు. తద్వారా బోరిస్ జాన్సన్ వారసురాలిగా ప్రధాని పదవి చేపట్టనున్నారు. సోమవారం వెల్లడైన ఫలితాల్లో ట్రస్ 81,326 ఓట్లు సాధించారు. రిషికి 60,399 ఓట్లు పోలయ్యాయి. ఫలితాల అనంతరం ట్రస్ మాట్లాడారు. పార్టీ నేతగా ఎన్నికవడం గొప్ప గౌరవమన్నారు. తనపై నమ్మకముంచినందుకు పార్టీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. 'మేం చేసి చూపిస్తాం' అంటూ ముమ్మారు ప్రతిజ్ఞ చేశారు. ''పన్నులకు కోత విధించి ప్రజలపై భారం తగ్గించి చూపిస్తాం. ఇంధన సంక్షోభాన్ని అధిగమిస్తాం. ఈ కష్టకాలం నుంచి దేశాన్ని గట్టెక్కించడానికి సాహసోపేతమైన చర్యలు చేపడతా. యునైటెడ్ కింగ్‌డమ్ సామర్థ్యం ఏమిటో ప్రపంచానికి మరోసారి చూపిద్దాం'' అంటూ అనంతరం ట్వీట్ చేశారు. రిషి చివరిదాకా తనకు పోటీ ఇచ్చారంటూ అభినందించారు. ప్రధానిగా బోరిస్ ఘన విజయాలు సాధించారంటూ ఆకాశానికెత్తారు. మార్గరెట్ థాచర్, థెరిసా మే తర్వాత బ్రిటన్ ప్రధాని కానున్న మూడో మహిళ ట్రస్. పన్నుల తగ్గింపు హామీలు, రిషిపై కోపంతో జాన్సన్ లోపాయికారీ మద్దతు తదితరాలు ట్రస్ గెలుపుకు ప్రధానంగా పని చేశాయని చెబుతున్నారు. తాత్కాలిక ప్రధాని జాన్సన్ లాంఛనంగా రాజీనామా సమర్పించిన అనంతరం మంగళవారం ట్రస్ బాధ్యతలు స్వీకరిస్తారు. ఆమె నిర్ణయాత్మక విజయం సాధించారంటూ జాన్సన్ అభినందించారు. ''నానాటికీ పెరిగిపోతున్న జీవన వ్యయం వంటి సమస్యలను ఎదుర్కొనేందుకు, పార్టీని, దేశాన్ని ముందుకు నడిపేందుకు ట్రస్ వద్ద సరైన ప్రణాళికలున్నాయి. పార్టీ నేతలంతా ఆమె వెనక నిలవాల్సిన సమయమిది'' అంటూ ట్వీట్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ట్రస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆమె నాయకత్వంలో ద్వైపాక్షిక, వ్యూహాత్మక సంబంధాలు మరింత పటిష్టమవుతాయని ఆశాభావం వెలిబుచ్చారు.

రిషి సంచలనం

పార్టీ గేట్, విశ్వసనీయతకు సంబంధించిన ఆరోపణలతో ప్రధాని పదవికి బోరిస్ జాన్సన్ రాజీనామా చేయాల్సి రావడం తెలిసిందే. నైతికత లేని జాన్సన్ సారథ్యంలో పని చేయలేనంటూ ఆర్థిక మంత్రి పదవికి రాజీనామా చేయడం ద్వారా రిషి సంచలనం సృష్టించారు. మంత్రులంతా ఆయన బాటే పట్టి వరుసగా రాజీనామా చేయడంతో జాన్సన్ అయిష్టంగానే తప్పుకోవాల్సి వచ్చింది. తద్వారా వచ్చిపడ్డ కన్జర్వేటివ్ పార్టీ నేత ఎన్నికలో మెజారిటీ ఎంపీల మద్దతు కూడగట్టడం ద్వారా తొలుత రిషియే ముందంజలో ఉన్నారు. తర్వాత ట్రస్ అనూహ్యంగా దూసుకెళ్లారు. 1,72,437 లక్షల కన్జర్వేటివ్ ఓటర్లను ఎక్కువ మందిని ఆకర్షించడంలో సఫలమయ్యారు. ఆమెకు 57.4 శాతం ఓట్లు పోలవగా రిషికి 42.6 శాతం వచ్చాయి. ఆయన ఓటమి చవిచూసినా బ్రిటన్ ప్రధాని పదవి కోసం తలపడ్డ తొలి భారత సంతతి వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. తనకు ఓటేసిన అందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ''కన్జర్వేటివ్ సభ్యులమంతా ఒకే కుటుంబం. ఈ కష్టకాలం నుంచి గట్టెక్కించే ప్రయత్నాల్లో మనమంతా కొత్త ప్రధాని ట్రస్‌కు దన్నుగా నిలుద్దాం'' అంటూ ట్వీట్ చేశారు. పన్నుల విషయంలో ట్రస్‌తో విధానపరమైన వైరుధ్యం కారణంగా రిషి ఆమె కేబినెట్లో చేరడం అనుమానమేనంటున్నారు.

అంచెలంచెలుగా ఎదిగి...

బ్రిటన్ నూతన ప్రధాని లిజ్ ట్రస్ కరడుగట్టిన కమ్యూనిస్టుల కుటుంబం నుంచి వచ్చారు. ఆమె 1975లో ఆక్స్‌ఫర్డ్‌లో జన్మించారు. తండ్రి మ్యాథ్స్ ప్రొఫెసర్ కాగా తల్లి నర్స్ టీచర్. యూకేలో పలు ప్రాంతాల్లో విద్యాభ్యాసం సాగింది. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుగ్గా ఉంటూ వచ్చారు. 2001, 2005ల్లో ఓటమి పాలైనా 2010లో నార్‌ఫోక్ నుంచి ఎంపీగా విజయం సాధించారు. 2014లో కేమరూన్ కేబినెట్లో పర్యావరణ మంత్రిగా, 2016లో థెరిసా మే ప్రభుత్వంలో న్యాయ శాఖ మంత్రిగా చేశారు. 2019లో బోరిస్ జాన్సన్ ప్రధాని అయ్యాక ట్రస్‌కు ప్రాధాన్యం పెరిగింది. తొలుత ఇంటర్నేషనల్ ట్రేడ్ సెక్రెటరీగా బాధ్యతలు చేపట్టారు. ఆ సమయంలో భారత్‌లో పటిష్టమైన ఆర్థిక బంధం కోసం కృషి చేశారు. భారత్-ఇంగ్లండ్ వర్తక భాగస్వామ్యం (ఈటీపీ)లో కీలక పాత్ర పోషించారు. రెండేళ్లకు కీలకమైన విదేశాంగ శాఖ బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు జాన్సన్ వారసురాలిగా ఎన్నికయ్యారు. అకౌంటెంట్ హ్యూ ఓ లియరీని ట్రస్ పెళ్లాడారు. వారికి ఇద్దరమ్మాయిలు. పరిస్థితిని బట్టి విధానాలు మార్చుకునే నేతగా కూడా ట్రస్ పేరుబడ్డారు. యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ వైదొలగడాన్ని (బ్రెగ్జిట్) తొలుత తీవ్రంగా వ్యతిరేకించారు. కానీ అది అనివార్యమని తేలాక బ్రెగ్జిట్‌కు జైకొట్టారు. కన్జర్వేటివ్ సభ్యుల మద్దతు సాధించే ప్రయత్నాల్లో భాగంగా మాజీ ప్రధాని మార్గరెట్ థాచర్ వస్త్రధారణను అనుకరించారు.

మితిమీరిన వేగం వల్లే...

మిస్త్రీ మృతికి దారి తీసిన కారు ప్రమాదంపై పోలీసులు



ముంబై: రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన టాటా గ్రూప్ మాజీ చైర్మన్ సైరస్ మిస్త్రీ (54) అంత్యక్రియలు మంగళవారం ముంబైలో జరగనున్నాయి. మృతదేహానికి సోమవారం అటాప్సీ పూర్తయింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ డాక్టర్ అనాహిత పండోలే, ఆమె భర్త డేరియస్ పండోలే ముంబైలోని రిలయన్స్ ఫౌండేషన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారు ప్రయాణిస్తున్న బెంజ్ కారు ఆదివారం మధ్యాహ్నం ముంబైకి 120 కిలోమీటర్ల దూరంలో ప్రమాదానికి గురవడం తెలిసిందే. వెనక సీట్లో ఉన్న మిస్త్రీ, ఆయన మిత్రుడు జహంగీర్ పండోలే అక్కడికక్కడే మరణించారు. వాళ్లిద్దరూ సీటు బెల్టు పెట్టుకోలేదని పోలీసులు తెలిపారు. మితిమీరిన వేగం, మరో వాహనాన్ని రాంగ్ సైడ్ నుంచి ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో కారు అదుపు తప్పడమే ప్రమాదానికి కారణమన్నారు. చరోటీ చెక్ పోస్టు నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రమాద స్థలానికి కారు 9 నిమిషాల్లో చేరుకుందని వివరించారు. జర్మనీ నుంచి వచ్చిన బెంజ్ సంస్థ బృందం ఘటనా స్థలిని పరిశీలించింది.

వాయిస్ విని వైరస్ గుట్టు చెప్పేస్తుంది



లండన్: కృత్రిమ మేథ మరో కొత్త సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. కోవిడ్ జాడను ఇట్టే పసిగట్టి చెప్పే నూతన స్మార్ట్‌ఫోన్ యాప్‌ను శాస్త్రవేత్తలు అభివృద్ధిచేశారు. 'మనిషి గొంతు విని అతనికి కోవిడ్ సోకిందో లేదో ఈ యాప్ చెప్పగలదు. కోవిడ్ ర్యాపిడ్ యాంటీజెన్ టెస్ట్ కంటే ఎక్కువ ఖచ్చితత్వంతో ఫలితాలు ఇస్తుంది. ఎలాంటి ఖర్చు లేకుండా, త్వరగా, సులభంగా కోవిడ్ జాడ కనిపెట్టే విధానమిది. వాయిస్‌ను రికార్డ్ చేసి చెక్ చేస్తే సరిపోతుంది. నిమిషంలో ఫలితం వచ్చేస్తుంది. అల్పాదాయ దేశాల్లో ఇది ఎంతో ఉపయోగకరం' అని పరిశోధకులు చెప్పారు. స్పెయిన్‌లోని బార్సిలోనా నగరంలో నిర్వహించిన యురోపియన్ రెస్పిరేటరీ సొసైటీ ఇంటర్నేషనల్ కాంగ్రెస్‌లో ఈ యాప్ సంబంధ వివరాలను బహిర్గతంచేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో ఈ యాప్ 89 శాతం ఖచ్చితత్వంతో పనిచేస్తుందని రీసెర్చ్‌లో పాల్గొన్న అధ్యయనవేత్తలు పేర్కొన్నారు. కోవిడ్ కారణంగా వ్యక్తి గొంతులో శ్వాస మార్గం, స్వరపేటికలు ఇన్ఫెక్షన్‌కు గురవుతాయి. దాంతో వచ్చిన మార్పులను ఈ యాప్ గుర్తిస్తుందని నెదర్లాండ్స్‌లోని మాస్ట్రిచ్ యూనివర్సిటీ మహిళా పరిశోధకులు వఫా అజ్బవీ చెప్పారు. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ గణాంకాల నుంచి సేకరించిన స్వరనమూనాలను ఈ యాప్‌లో పొందుపరిచారు. ఆరోగ్యవంతులు, అస్వస్థులైన వారివి కలిపి 4,352 మందికి చెందిన 893 ఆడియో శాంపిళ్లను తీసుకున్నారు. ఇందులో 308 మంది కోవిడ్ రోగుల వాయిస్‌లూ ఉన్నాయి. యాప్ టెస్ట్‌లో భాగంగా నోటితో మూడు నుంచి ఐదుసార్లు గట్టిగా శ్వాస తీసుకోవాలి. మూడు సార్లు దగ్గాలి. స్క్రీన్ మీద చిన్న వాక్యాన్ని చదవాలి. వీటిని రికార్డ్ చేసిన యాప్ నిమిషంలో ఫలితాలు చూపిస్తుంది.

యాత్రతో రాత మారేనా?

రేపటి నుంచే కాంగ్రెస్ 'భారత్ జోడో యాత్ర'
రాహుల్ గాంధీ పాదయాత్రపై భారీ ఆశలు పెట్టుకున్న పార్టీ

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికల్లో వరుస పరాజయాలు.. కీలక నేతల నిష్క్రమణలు.. అంతర్గత కుమ్ములాటలతో జీవన్మరణ సమస్యను ఎదుర్కొంటున్న కాంగ్రెస్‌కు తిరిగి నూతన జవసత్వాలు అందించేందుకు పార్టీ నేత రాహుల్ గాంధీ 'భారత్ జోడో యాత్ర'కు బుధవారం నుంచి శ్రీకారం చుడుతున్నారు. ఈ యాత్రపై కాంగ్రెస్ భారీ ఆశలే పెట్టుకుంది. వరుసగా రెండు సార్వత్రిక ఎన్నికల్లో ఘోర ఓటమి, ఒక్కో రాష్ట్రాన్ని కోల్పోతున్న వేళ 3,500 కిలోమీటర్లపై చిలుకు యాత్ర పార్టీకి పునరుత్తేజం తెస్తుందని కాంగ్రెస్ శ్రేణులు ఆశిస్తున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఏడు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కోవాల్సి ఉంది. రాహుల్ యాత్రతో పార్టీకి ఎంతమేర ప్రయోజనం చేకూరుతుందన్న దానిపై జోరుగా చర్చలు సాగుతున్నాయి.

క్విట్ ఇండియా ఉద్యమమే స్ఫూర్తిగా...

ఎనభై ఏళ్ల క్రితం గాంధీ క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించిన సెప్టెంబర్ 7 నుంచే రాహుల్ భారత్ జోడో యాత్ర మొదలుపెట్టనున్నారు. 117 మంది కాంగ్రెస్ నాయకులతో కలిసి కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకూ ఐదు నెలలు పాదయాత్ర చేయనున్నారు. 12 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాలను కవర్ చేసేలా రూట్‌మ్యాప్ రూపొందించారు. దేశంలో పెరుగుతున్న మతోన్మాదం, అసహన రాజకీయాలను ప్రస్తావించడంతోపాటు జీవనోపాధిని నాశనం చేసే ఆర్థిక వ్యవస్థలకు ప్రత్యామ్నాయం చూపాలని భావిస్తోంది. రైతు వ్యతిరేక చట్టాలు, ధరల పెరుగుదల, నిరుద్యోగం, ప్రైవేటీకరణ వంటి అంశాలను వివరిస్తూ ప్రజల్లోకి వెళ్లనుంది. దేశంలో బీజేపీకి ప్రత్యామ్నాయ మార్గాన్ని చూపడంతో పాటు కేంద్రంలో అధికారాన్ని చేజిక్కించుకోవడం, రాష్ట్రాల్లో పాగా వేయాలన్న బలమైన రాజకీయ ఆకాంక్షతో కాంగ్రెస్ ఈ యాత్ర చేపడుతోంది. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, రాజస్తాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలు పార్టీకి పరీక్షగా నిలవనున్నాయి. వీటిలో తెలంగాణ మినహా మిగతా రాష్ట్రాల్లో బీజేపీతోనే ముఖాముఖీ పోరాడాల్సి ఉంది. ముఖ్యంగా గుజరాత్, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వాల పట్ల ఉన్న ప్రజా వ్యతిరేకతను ఓట్లుగా మార్చుకోవాలి. కర్ణాటకలో అంతర్గత కుమ్ములాటలు కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగా మారాయి. గుజరాత్‌లో కాంగ్రెస్ స్థానాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ ఆక్రమిస్తోంది. రాజస్తాన్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ అక్కడ మళ్లీ గద్దెనెక్కడం అంత సులభం కాదు. అధికారంలో ఉన్న చత్తీస్‌గఢ్‌లోనూ అదే పరిస్థితి కనిపిస్తోంది.


గుజరాత్ పర్యటన సందర్భంగా సబర్మతి ఆశ్రమంలో గాంధీ ఫొటోకు రాహుల్ నివాళులు

సార్వత్రిక ఎన్నికల్లో పార్టీలు సాధించిన ఓట్ల శాతం

సంవత్సరం	బీజేపీ	కాంగ్రెస్	ఇతరులు
1984	7.7	49.1	43.2
1989	11.4	39.5	49.1
1991	20.1	36.3	43.6
1992	16.5	49.3	34.2
1996	20.3	28.8	50.9
1998	25.6	25.8	48.6
1999	23.8	28.3	48
2004	22.2	26.5	51.3
2009	18.8	28.6	52.6
2014	31	19.3	48.2
2019	37.3	19.5	43.2

రాహుల్‌కు అగ్నిపరీక్ష

1985 నుంచి ఇప్పటి వరకు 27 ఏళ్లలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నడూ లేనంత భారీ ఓటమిని కాంగ్రెస్ 2014, 2019 ఎన్నికల్లోనూ చవిచూసింది. ఏఐసీసీ ఉపాధ్యక్షుడిగా రాహుల్‌గాంధీ బాధ్యతలు చేపట్టాక జరిగిన ఈ ఎన్నికల్లో 2014లో 19.3 శాతం, 2019లో 19.5 శాతం ఓట్లను మాత్రమే సాధించగలిగింది. ఇక 2014-2022 మధ్య జరిగిన 49 అసెంబ్లీ ఎన్నికలకు గానూ 39 ఎన్నికల్లో పార్టీ ఓడిపోయింది. కేవలం 4 రాష్ట్రాల ఎన్నికల్లో గెలిచిందని, మరో 6 సందర్భాల్లో సంకీర్ణ ప్రభుత్వాలను ఏర్పాటు చేయగలిగింది. ఇక రాహుల్ వైఖరిని విమర్శిస్తూ కేంద్ర మాజీ మంత్రులు గులాం నబీ ఆజాద్, కపిల్ సిబల్, అశ్వినీ కుమార్, ఎస్పీ సింగ్, మురళీ దేవ్‌రాతోపాటు పలువురు సీనియర్ నేతలు కాంగ్రెస్‌ను వీడారు. పార్టీ అధ్యక్ష పదవికి రాహుల్ ఏమాత్రం యోగ్యుడు కాదంటూ విమర్శలు వస్తున్న నేపథ్యంలో భారత్ జోడో యాత్ర ఆయనకు అగ్ని పరీక్షేనని చెప్పక తప్పదు.

రాహుల్‌తో నితీశ్ భేటీ

న్యూఢిల్లీ: బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) నాయకుడు నితీశ్ కుమార్ సోమవారం ఢిల్లీలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతో సమావేశమయ్యారు. జాతీయ రాజకీయ పరిణామాలు, ప్రతిపక్షాల ఐక్యతపై చర్చించుకున్నారు. బిహార్‌లో ఎన్డీయేతో జేడీ(యూ) తెగదెంపుల తర్వాత రాహుల్‌ను నితీశ్ కలవడం ఇదే మొదటిసారి. అలాగే జేడీ(ఎస్) చీఫ్ హెచ్‌డీ కుమారస్వామితోనూ నితీశ్ భేటీ అయ్యారు. 2024 ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా విపక్షాలను ఏకం చేసే ప్రయత్నాల్లో భాగంగా నితీశ్ ఢిల్లీలో పర్యటిస్తున్నారు. మంగళవారం ఎన్సీపీ నేత శరద్ పవార్, ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్,సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ తదితరులతో భేటీ కానున్నారు.

గుజరాత్‌లో రాహుల్ ఎన్నికల వరాలు

అహ్మదాబాద్: గుజరాత్‌లో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్ర ఓటర్లపై రాహుల్ వరాల జల్లు కురిపించారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే రైతులకు రూ.3 లక్షల వరకు రుణ మాఫీ, ఉచిత విద్యుత్, 300 యూనిట్ల దాకా సాధారణ వినియోగదారులకు ఉచిత కరెంట్, రూ.500కే ఎల్పీజీ సిలిండర్ అందిస్తామని హామీ ఇచ్చారు. సోమవారం అహ్మదాబాద్‌లో ర్యాలీలో కాంగ్రెస్ బూత్ స్థాయి కార్యకర్తలనుద్దేశిస్తూ ప్రసంగించారు. యువతకు 10 లక్షల ఉద్యోగాలు, బాలికలకు ఉచిత విద్య తదితర హామీలిచ్చారు.

మాతృభాషలో బోధనతో ప్రతిభకు పదును

టీచర్స్ డే ప్రోగ్రాంలో రాష్ట్రపతి ముర్ము

న్యూఢిల్లీ: పాఠశాల స్థాయిలో మాతృభాషలోనే విద్యాబోధన జరగాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అభిలషించారు. మాతృభాషలో బోధిస్తే పిల్లల్లో సైన్స్, సాహిత్యం, సామాజిక శాస్త్రాలకు సంబంధించి నైపుణ్యం అభివృద్ధి చెందుతుందని అన్నారు. పాఠ్యాంశాలను వారు సులువుగా అర్థం చేసుకోగలుగుతారన్నారు. నూతన జాతీయ విద్యావిధానంలో పాఠశాల, ఉన్నత విద్యలో భారతీయ భాషలకు ప్రాధాన్యం లభించిందని చెప్పారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజ్ఞాన్‌భవన్‌లో జరిగిన జాతీయ ఉపాధ్యాయుల పురస్కారాల ప్రదానోత్సవంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె చిన్ననాటి అనుభవాలను గుర్తుకు తెచ్చుకున్నారు. తమ గ్రామం నుంచి కాలేజీలో చదువుకునేందుకు వెళ్లిన మొదటి బాలికగా నిలవడం వెనుక ఉపాధ్యాయులు అందించిన ప్రోత్సాహమే కారణమని చెప్పారు. వారికి తానెంతో రుణపడి ఉంటానన్నారు. అనంతరం రాష్ట్రపతి ముర్ము 46 మంది ఉపాధ్యాయులకు జాతీయ పురస్కారాలు అందజేశారు. వీరిలో హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, మహారాష్ట్ర, తెలంగాణకు చెందిన ముగ్గురు చొప్పున ఉపాధ్యాయులున్నారు.


వికలాంగ ఉపాధ్యాయుడికి వేదిక దిగి వచ్చి మరీ అవార్డ్ ఇస్తున్న రాష్ట్రపతి ముర్ము

విశ్వాస పరీక్షలో హేమంత్ సర్కారు విజయం



రాంచీ: జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్ ప్రభుత్వం విశ్వాస పరీక్షలో సులభంగా నెగ్గింది. ఇందుకోసం సోమవారం అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశమైంది. సభలో మొత్తం 81 స్థానాలుండగా 48 మంది ఎమ్మెల్యేలు విశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటువేశారు. ప్రతిపక్ష బీజేపీ సభ్యులు వాకౌట్ చేయడంతో వ్యతిరేకంగా ఒక్క ఓటు కూడా రాలేదు. బీజేపీ సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలు చేశారు. తర్వాత బాయ్‌కాట్ చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను అస్థిరపర్చేందుకు బీజేపీ కుట్రలు పన్నుతోందని సోరెన్ ఈ సందర్భంగా ఆరోపించారు. జార్ఖండ్‌లో ఎమ్మెల్యేల కొనుగోలుకు అస్సాం సీఎం హిమంతబిశ్వ శర్మ ప్రయత్నిస్తున్నారన్నారు. ఎన్నికల్లో విజయం కోసం బీజేపీ దేశంలో అల్లర్లకు ఆజ్యం పోస్తోందని, అంతర్యుద్ధం తరహా పరిస్థితులను సృష్టించేందుకు పన్నాగం పన్నుతోందని ధ్వజమెత్తారు. తమ రాష్ట్రంలో ఎమ్మెల్యేల కొనుగోలుకు బీజేపీ తెగబడిందని, అందుకే ప్రభుత్వ బలాన్ని నిరూపించుకోవడానికి విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టామని చెప్పారు. గనుల లీజుల కేటాయింపుల్లో అక్రమాల వ్యవహారంలో సీఎం హేమంత్ సోరెన్‌పై ఎమ్మెల్యేగా అనర్హత వేటు తప్పదని అంచనా వేస్తున్నారు.

సీబీఐ ఒత్తిడి వల్లే లీగల్ సలహాదారు ఆత్మహత్య: ఆప్

న్యూఢిల్లీ: ఢిల్లీ ఎక్సయిజ్ పాలసీలో అక్రమాలు జరిగాయంటూ తనపై తప్పుడు కేసులు బనాయించాలంటూ సీబీఐ తీవ్రమైన ఒత్తిడిచేయడం వల్లే వారి లీగల్ అడ్వైజర్ చివరకు బలవన్మరణానికి పాల్పడ్డాడని ఢిల్లీ డెప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా సంచలన ఆరోపణలు చేశారు. 'ఎక్సయిజ్ కేసులో నాపై తప్పుడు కేసులు పెట్టాలని సీబీఐ డెప్యూటీ లీగల్ అడ్వైజర్ జితేంద్ర కుమార్‌పై సీబీఐ తీవ్రంగా ఒత్తిడిచేసింది. తప్పుడు కేసు పెట్టలేక తీవ్ర మనోవేదనతో జితేంద్ర గురువారం ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన సూసైడ్ చేసుకోవడం విచారకరం. ప్రధాని మోదీని ఒక విషయం అడగదల్చుకున్నా. ఆత్మహత్య చేసుకునేంత స్థాయిలో అధికారులపై ఎందుకు ఒత్తిడిచేస్తున్నారు?' అని సిసోడియా ప్రశ్నించారు. దక్షిణ ఢిల్లీలోని సొంతింట్లో జితేంద్ర ఆత్మహత్యచేసుకున్న విషయం విదితమే. సిసోడియా నిరాధార ఆరోపణలు చేస్తున్నారని సీబీఐ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. 'ఎక్సయిజ్ పాలసీ కేసుతో, సంబంధిత దర్యాప్తుతో జితేంద్రకు ఎలాంటి సంబంధం లేదు. ఆత్మహత్యకు ఉసిగొల్పిన విషయాలు ఆయన సూసైడ్ నోట్‌లో పేర్కొనలేదు' అని తెలిపింది.

బెంగళూరు అతలాకుతలం

- నగరాన్ని వణికించిన భారీ వర్షాలు
- రోడ్లపై వరద.. స్తంభించిన ట్రాఫిక్

బెంగళూరు/బనశంకరి: భారీ వర్షాల ధాటికి బెంగళూరు చిగురుటాకులా వణికిపోయింది. ఆదివారం రాత్రి 8 నుంచి సోమవారం ఉదయం ఐదింటి దాకా 13 సెంటీమీటర్ల మేర కుండపోతగా కురిసిన వర్షాలతో అతలాకుతలమైంది. చాలా ప్రాంతాలు నీట మునిగాయి. రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. చెరువులు, కాలువలు పొంగిపొర్లుతున్నాయి. సహాయక చర్యల కోసం ప్రభుత్వ అధికారులు పడవలు, ట్రాక్టర్లను రంగంలోకి దించారు. నగరంలో పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం విద్యార్థులు, ఉద్యోగులు పడవల్లో విద్యాసంస్థలు, కార్యాలయాలకు చేరుకున్నారు. అపార్టుమెంట్లు, భారీ భవనాల బేస్‌మెంట్లలో, ఇళ్ల ముందు పార్కు చేసిన వాహనాలు నీటిలో మునిగిపోయాయి. ప్రధానంగా వైట్‌ఫీల్డ్, ఇందిరానగర్, కాంగేరి, ఆర్‌ఆర్ నగర్, బొమ్మనహళ్లి, మారథాళ్లి, మహాదేవపురాలో వరదల తీవ్రత అధికంగా ఉంది.


బెంగళూరు సమీపంలోని రెయిన్‌బో డ్రైవ్ లేఅవుట్‌లో నీట మునిగిన కారును బయటకు లాగుతున్న దృశ్యం

స్తంభించిన ప్రజా రవాణా వ్యవస్థ

ఐటీ కంపెనీలుండే ఔటర్ రింగ్‌రోడ్డు ప్రాంతం జలమయమైంది. రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. రోడ్లపై వరదలు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ఆస్పత్రుల్లోకి నీరు చేరింది. సహాయక చర్యల కోసం ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలను పంపించినట్లు ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై చెప్పారు. బెంగళూరులో 48 గంటల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. అంతర్జాతీయ విమానాశ్రయంలోకి నీరు చేరడంతో ఎయిర్‌పోర్టు రోడ్డు మునిగిపోయింది. ఎయిర్‌పోర్టుకు బయలుదేరిన ప్రయాణికులు మోకాలి నీటి లోతులో నడుస్తూ వీడియోలను చిత్రీకరించి, సోషల్ మీడియాలో పోస్టు చేశారు.


బెల్లందూర్‌లో వర్షపునీటితో మునిగిపోయిన రహదారి

'నవయుగ' అప్పీల్‌లో కీలక పరిణామం

ధర్మాసనంలోని ఓ న్యాయమూర్తికి పరస్పర విరుద్ధ ప్రయోజనాలున్నాయి

- రాష్ట్ర ప్రభుత్వం తరపున ధర్మాసనానికి అడ్వొకేట్ జనరల్ నివేదన

సాక్షి, అమరావతి: మచిలీపట్నం పోర్టు నిర్మాణం విషయంలో తమతో ఒప్పందాన్ని రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సమర్థిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై నవయుగ పోర్ట్ లిమిటెడ్ దాఖలు చేసిన అప్పీల్‌పై హైకోర్టులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ అప్పీల్‌ను విచారిస్తున్న ధర్మాసనంలోని ఓ న్యాయమూర్తి (జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు) గతంలో నవయుగ కంపెనీతో కలిసి పని చేశారని రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దీంతో ఈ అప్పీల్‌ను జస్టిస్ సోమయాజులు సభ్యుడిగా లేని ధర్మాసనం విచారిస్తుందని ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ప్రకటించారు. ఈ అప్పీల్ విచారణకు ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటవుతుందని, విచారణను ఈ నెల 9న చేపడతామని పేర్కొంటూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సింగిల్ జడ్జి తీర్పుపై నవయుగ అప్పీల్..

నవయుగ పోర్ట్ లిమిటెడ్‌తో ఒప్పందాన్ని రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2019లో జీవో 66 జారీ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ నవయుగ హైకోర్టును ఆశ్రయించగా ఇటీవల తుది విచారణ జరిపిన సింగిల్ జడ్జి జస్టిస్ రావు రఘునందనరావు ప్రభుత్వ జీవోను సమర్థించారు. జీవో 66ను సవాలు చేస్తూ నవయుగ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పునిచ్చారు. ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందంలోని నిబంధనల ప్రకారం బాధ్యతలను నిర్వర్తించడంలో నవయుగ విఫలమైందన్నారు. ఒప్పందంలోని బాధ్యతలను నిర్వర్తించడానికి నిరాకరించినప్పుడు ఒప్పందాన్ని రద్దు చేయడం సబబేనని తేల్చారు. ఈ తీర్పును సవాలు చేస్తూ నవయుగ సీజే ధర్మాసనం ఎదుట అప్పీల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

పరస్పర విరుద్ధ ప్రయోజనాలను ప్రస్తావించిన ఏజీ శ్రీరామ్..

తాజాగా ఈ అప్పీల్ విచారణకు రాగా నవయుగ పోర్ట్ లిమిటెడ్ తరపున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించేందుకు సిద్ధమయ్యారు. ఈ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ జోక్యం చేసుకుని,అప్పీల్‌ను విచారిస్తున్న న్యాయమూర్తుల్లో ఒకరు గతంలో నవయుగ కంపెనీతో ఉన్నారని తెలిపారు. ఏదైనా కేసును విచారిస్తున్న న్యాయమూర్తుల్లో ఎవరికైనా ఆ కేసుకు సంబంధించి పరస్పర



విరుద్ధ ప్రయోజనాలుంటే ఆ విషయాన్ని ముందుగానే వారి దృష్టికి తేవాలని ఇటీవల సుప్రీంకోర్టు చెప్పిందని ప్రస్తావించారు. దాని ప్రకారం ఈ కేసులో ఓ న్యాయమూర్తి గతంలో నవయుగ కంపెనీతో ఉన్నారన్న విషయాన్ని ధర్మాసనం దృష్టికి తెస్తున్నట్లు ఏజీ చెప్పారు. నవయుగ పోర్ట్ లిమిటెడ్‌కు నవయుగ కంపెనీ లీడ్ ప్రమోటర్‌గా ఉందని వివరించారు. అయితే తామేమీ ఆ న్యాయమూర్తిపై ఎలాంటి ఫిర్యాదు చేయడం లేదన్నారు. ఉన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరపున కోర్టు దృష్టికి తెస్తున్నట్లు చెప్పారు. ఏజీగా తన బాధ్యతను నిర్వర్తిస్తున్నానని తెలిపారు.

కొంత సమయం పడుతుంది..

నవయుగ తరపున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ బందరు పోర్టు పనులను మరో కంపెనీకి అప్పగించేందుకు సర్వం సిద్ధమైందన్నారు. ఈ విషయంలో తాము ఆందోళన చెందుతున్నామని తెలిపారు. ఇందుకు ఏజీ శ్రీరామ్ స్పందిస్తూ ఈ ప్రాజెక్టు మొదలయ్యేందుకు కొంత సమయం పడుతుందన్నారు. ఇప్పటికిప్పుడు అయ్యేదేమీ లేదన్నారు. అలా అయితే తమ అప్పీల్‌పై శుక్రవారం విచారణ జరిపినా అభ్యంతరం లేదని దమ్మాలపాటి పేర్కొనడంతో దీన్ని ప్రత్యేక ధర్మాసనం విచారిస్తుందని స్పష్టం చేస్తూ సీజే ఉత్తర్వులు జారీ చేశారు.

కోర్టు ప్రొసీజర్ అందరికీ ఒకేలా ఉండాలి...

ఈ వివరాలను పరిగణలోకి తీసుకున్న ప్రధాన న్యాయమూర్తి ఈ అప్పీల్ విచారణకు ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. తామిద్దరిలో ఒకరికి మాత్రమే ఈ కేసులో పరస్పర విరుద్ధ ప్రయోజనాలు ఉన్నాయని చెబుతున్నప్పటికీ తామే ఈ అప్పీల్‌ను విచారిస్తే దీన్ని ప్రధాన కారణంగా చూపుతూ సుప్రీంకోర్టుకెళ్లే అవకాశం ఉందన్నారు. అలాంటి పరిస్థితికి తావు లేకుండా ఈ అప్పీల్‌ను మరో ధర్మాసనం విచారించడం నైతికంగా ఉత్తమమని సీజే స్పష్టం చేశారు. కేసుల్లో ఫలితం ఎలా ఉన్నప్పటికీ కోర్టు విధి విధానాలు మాత్రం అందరికీ ఒకేలా ఉండాలని సీజే తేల్చి చెప్పారు.

అనుమతుల్లేకపోతే వాటి కూల్చివేతకు ఆదేశాలిస్తాం

రుషికొండ రిసార్ట్ పునరుద్ధరణ పనులపై హైకోర్టు ధర్మాసనం

సాక్షి, అమరావతి : విశాఖపట్నం రుషికొండ రిసార్ట్ పునరుద్ధరణలో భాగంగా చేపడుతున్న నిర్మాణాలకు అనుమతులు లేవని తేలితే వాటి కూల్చివేతకు ఆదేశాలు జారీ చేస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 22కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ జిల్లా యండాడ గ్రామం సర్వే నంబర్ 19 కోస్టల్ రెగ్యులేషన్ జోన్‌లో చెట్ల నరికివేత, భూమి తవ్వకాలకు అనుమతులివ్వడం కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ గతంలో ఇచ్చిన అనుమతులకు, విశాఖపట్నం పట్టణ ప్రాంతాభివృద్ధి సంస్థ మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధమంటూ జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్, విశాఖ తూర్పు ఎమ్మెల్యే రామకృష్ణ దాఖలు చేసిన వ్యాజ్యాలను సీజే ధర్మాసనం సోమవారం మరోసారి విచారించింది. మూర్తి యాదవ్ తరపున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపిస్తూ, అనుమతులు లేకుండానే నిర్మాణాలు చేపడుతున్నారని, అందువల్ల ఈ వ్యాజ్యాలపై త్వరగా విచారణ చేపట్టాలని కోరారు. ధర్మాసనం స్పందిస్తూ.. గతంలో తామిచ్చిన ఆదేశాలకు భిన్నంగా వ్యవహరించినా ఆ నిర్మాణాల కూల్చివేతకు ఆదేశాలు జారీ చేస్తామని చెప్పింది.

మహా పాదయాత్రకు అనుమతినిచ్చేలా ఆదేశాలివ్వండి

హైకోర్టులో అమరావతి పరిరక్షణ సమితి పిటిషన్

సాక్షి, అమరావతి : అమరావతి నుంచి శ్రీకాకుళం జిల్లా అరసవల్లి వరకు తలపెట్టిన మహా పాదయాత్రకు అనుమతినిచ్చేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ అమరావతి పరిరక్షణ సమితి కార్యదర్శి గద్దె తిరుపతిరావు, మరొకరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంలో హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీలతో పాటు పాదయాత్ర జరిగే మార్గంలోని అన్ని జిల్లాల ఎస్పీలను ప్రతివాదులుగా పేర్కొన్నారు. అమరావతి నుంచి అరసవల్లి వరకు ఈ నెల 12 నుంచి నవంబర్ 11 వరకు తాము తలపెట్టిన మహా పాదయాత్రకు అనుమతి కోరుతూ పెట్టుకున్న వినతిని పరిగణనలోకి తీసుకుని, తగిన అనుమతులు జారీ చేసేలా పోలీసులను ఆదేశించాలని పిటిషనర్లు కోర్టును కోరారు. సహేతుక షరతులు విధించినా తమకు అభ్యంతరం లేదన్నారు.

నైనవరంలో ఎన్ఐఏ అధికారుల తనిఖీలు

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, వరంగల్: మావోయిస్టులతో సంబంధాలున్నాయనే అనుమానంతో శ్రీ చైతన్య మహిళా సంఘం కో-కన్వీనర్ రాధ నివాసంలో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. విజయవాడ శివారులోని నైనవరంలో ఉన్న ఆమె నివాసానికి ఎన్ఐఏ అధికారులు ఉదయం చేరుకుని దాదాపు మూడు గంటలపాటు విస్తృతంగా సోదాలు చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పెదబయలుకు చెందిన నర్సింగ్ విద్యార్థిని రాధ అదృశ్యం కేసు దర్యాప్తులో భాగంగా ఎన్ఐఏ అధికారులు ఈ తనిఖీలు చేశారు. తన కుమార్తె రాధను బలవంతంగా మావోయిస్టు పార్టీలో చేర్పించారని ఆమె తల్లి 2017లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా హైదరాబాద్, వరంగల్‌లతోపాటు విజయవాడ సమీపంలోని నైనవరంలో ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. రాధ నివాసంలో ఎన్ఐఏ అధికారులు పలు పుస్తకాలు, డైరీలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

హనుమకొండలోనూ..

తెలంగాణలోని హనుమకొండలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, చైతన్య మహిళా సంఘం (సీఎంఎస్) నేత సముద్రాల అనిత నివాసంలోనూ ఎన్ఐఏ అధికారుల సోదాలు చేశారు. పలు డాక్యుమెంట్లు, డైరీలు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం హనుమకొండ హంటర్‌రోడ్డులోని అనిత తల్లిగారింట్లో తనిఖీలు చేశారు. వివరాలను మీడియాకు వెల్లడించేందుకు అధికారులు నిరాకరించారు.

త్రిశూల్ సిమెంట్స్ వ్యాజ్యం ధర్మాసనానికి

- న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ఉత్తర్వులు

సాక్షి, అమరావతి : పరిమితికి మించి ఖనిజాన్ని తవ్వినందుకు పెనాల్టీ కట్టాలంటూ గనుల శాఖ ఇచ్చిన నోటీసును సవాలు చేస్తూ త్రిశూల్ సిమెంట్స్ దాఖలు చేసిన పిటిషన్‌ను సింగిల్ జడ్జి సోమవారం ధర్మాసనానికి నివేదించారు. సిమెంట్ ఫ్యాక్టరీ కోసం అనంతపురం జిల్లా యాడికి మండలం కొనుప్పలపాడు గ్రామంలో లైమ్‌స్టోన్ లీజు పొంది, పరిమితికి మించి ఖనిజాన్ని తవ్వి రవాణా చేసినందుకు గనుల శాఖ రూ.100.24 కోట్ల పెనాల్టీ విధించింది. ఈ పెనాల్టీ చెల్లించాలంటూ 2020 మే 7న డిమాండ్ నోటీసు జారీ చేసింది. దీనిని సవాలు చేస్తూ త్రిశూల్ సిమెంట్స్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ రావు రఘునందన్‌రావు సోమవారం మరోసారి విచారణ జరిపారు. త్రిశూల్ తరపు న్యాయవాది శివరాజు శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. మనుగడలో లేని కంపెనీ పేరు మీద నోటీసు ఇచ్చారని తెలిపారు. ఈ వ్యాజ్యాన్ని ధర్మాసనానికి నివేదించాలని కోర్టు భావిస్తే, తమకు కొంత రక్షణ కల్పించాలని కోరారు. త్రిశూల్ సిమెంట్స్ అక్రమాలపై పోరాటం చేస్తున్న తాడిపత్రికి చెందిన వి.మురళీప్రసాద్‌రెడ్డి తరపు న్యాయవాది పీఎస్ రాజశేఖర్ వాదనలు వినిపిస్తూ, తాము దాఖలు చేసిన వ్యాజ్యంతోనే త్రిశూల్ అక్రమాలపై ధర్మాసనం పలు ఆదేశాలు ఇచ్చిందన్నారు. అందువల్ల ఈ వ్యాజ్యం ధర్మాసనానికి వెళ్లడమే సముచితమన్నారు.

ఆ ఆధారాలను చూస్తే కోర్టు వారిని ఉరి తీస్తుంది

అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. త్రిశూల్ అక్రమాలపై పెద్ద సంఖ్యలో ఆధారాలున్నాయంటూ ఓ పెద్ద పుస్తకాన్ని చూపారు. ఇందులోని ఆధారాలను పరిశీలిస్తే త్రిశూల్‌కు చెందిన వారిని ఈ కోర్టు ఉరి తీస్తుందన్నారు. అందరి వాదనలు విన్న న్యాయమూర్తి.. ఈ వ్యాజ్యాన్ని ధర్మాసనానికి నివేదిస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో ధర్మాసనం ఇచ్చిన ఆదేశాల పర్యవసానంగా మొదలైన కొన్ని అంశాలను వ్యాజ్యంలో లేవనెత్తారని, అందువల్ల ధర్మాసనమే విచారించడం సబబు అని చెప్పారు. ఈ వ్యాజ్యం ఫైళ్లన్నింటినీ త్రిశూల్ సిమెంట్స్‌పై దాఖలైన వ్యాజ్యాలతో జత చేసే విషయంలో పరిపాలన పరమైన ఆదేశాల నిమిత్తం ప్రధాన న్యాయమూర్తి ముందు ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించారు. త్రిశూల్ సిమెంట్స్‌పై రెండు వారాలపాటు ఎలాంటి బలవంతపు చర్యలకు దిగొద్దని గనుల శాఖ అధికారులను ఆదేశించారు.

చెంచుల సంరక్షణకు ప్రభుత్వ చర్యలు భేష్


మండలి చైర్మన్ మోషేన్‌రాజు



సాక్షి, అమరావతి : నల్లమల అటవీ ప్రాంతంలోని చెంచుల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు కితాబిచ్చారు. చెంచుల సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై 'అడవి తాకిన సంక్షేమం' శీర్షికన సాక్షిలో సోమవారం ప్రచురితమైన కథనంపై మోషేన్‌రాజు స్పందించారు. ఈ విషయమై శాసన మండలిలోని తన కార్యాలయంలో 'సాక్షి' ప్రతినిధితో మాట్లాడుతూ.. మనసున్న మారాజుగా గుర్తింపు పొందిన వైఎస్సార్ వారసుడిగా సీఎం వైఎస్ జగన్ మానవత్వాన్ని చాటుకోవడంలోనూ ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం అల్ప సంఖ్యాక వర్గాలనూ సమానంగా ఆదరించడం గొప్ప విషయమన్నారు. ఎక్కడో మారుమూల అడవుల్లో జీవించే చెంచుల విషయంలో సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక శ్రద్ధ చూపడం అభినందనీయమన్నారు. అడవుల్లో ఉండే గిరిజనులకూ నవరత్నాలతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రతి ఒక్కరూ హర్షిస్తారని మోషేన్‌రాజు చెప్పారు.


విజయవాడను ప్రశాంతంగా మార్చా

- వైఎస్సార్‌సీపీ వచ్చాక మళ్లీ రౌడీ మూకలు పేట్రేగాయి
- చెన్నుపాటి గాంధీ కన్ను పోగొట్టి, ఎమోషన్‌లో జరిగిందంటారా?
- టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు



సాక్షి, హైదరాబాద్: ఒకప్పుడు గొడవలకు మారుపేరుగా ఉండే విజయవాడను తాను సీఎం కాగానే ప్రశాంత నగరంగా మార్చానని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మళ్లీ రౌడీ మూకలు పేట్రేగిపోతున్నాయని ప్రతిపక్ష నేత చంద్రబాబు అన్నారు. కంటికి గాయమై హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విజయవాడ మాజీ కార్పొరేటర్, టీడీపీ నాయకుడు చెన్నుపాటి గాంధీని సోమవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, జగన్ సీఎం అయ్యాక రాష్ట్రంలో ఎక్కడ చూసినా హత్యా రాజకీయాలు, బెదిరింపులు, వేధింపులు, దౌర్జన్యాలేనని విమర్శించారు. విజయవాడలో చెన్నుపాటి గాంధీపై దాడి దుర్మార్గమన్నారు. ఇన్నాళ్లు రాజకీయాల్లో ఉండి కూడా ఒక చిన్న పూరింట్లో గాంధీ ఉంటున్నారని, అలాంటి వ్యక్తిపై దాడి చేయడం దారుణమని చెప్పారు. ఏదో ఎమోషన్‌లో కొట్టారని పోలీస్ కమిషనర్ చెప్పడం ఏంటని, ఆయన్ను కూడా ఎవరో కొట్టి కన్ను పోగొడితే అలాగే అంటారా అని ప్రశ్నించారు. నిందితులపై హత్యాయత్నం కేసు పెట్టాల్సిన అధికారి, వారికి కొమ్ముకాస్తున్నారని, దీనికి సీఎం జగన్ వత్తాసు పలుకుతున్నారని అన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు రౌడీయిజాన్ని నమ్ముకున్నారని, విజయవాడ లాంటి ఘటన మరొకటి జరిగితే సహించేది లేదన్నారు. కక్షపూరితంగానే గాంధీ కన్ను పొడిచారని, దోషుల్ని ఎవరినీ వదిలిపెట్టబోమని అన్నారు. వైఎస్సార్‌సీపీ దుర్మార్గాలకు అడ్డుగా ఉంటున్నారనే తమ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజల్లో చైతన్యం వస్తే వాళ్ల ఆటలు సాగవని, ప్రజలు ప్రతిఘటించే సమయం వచ్చిందన్నారు. దాడులకు టీడీపీ కార్యకర్తలు భయపడరని చెప్పారు.

నిజరూపం.. అపురూపం



శ్రీవాసుదేవ పెరుమాళ్‌కు అభిషేకం చేస్తున్న వేదపండితులు

మందస: మందసలో వెలసిన శ్రీవాసుదేవుడు సోమవారం నిజరూపంలో భక్తులకు దర్శనమిచ్చాడు. వేదపండితులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు మూలానక్షత్రయుత అభిషేకాన్ని స్వామివారికి నిర్వహించి, సర్వాలంకృతునిగా అలంకరించారు. భక్తులకు ఉత్తర ద్వార దర్శనాన్ని కల్పించారు.

ఆకట్టుకున్న సర్వేపల్లి విగ్రహం



రాధాకృష్ణ విగ్రహంతో హేమచంద్ర

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని జెడ్పీ ఎదురుగా ఉన్న హౌసింగ్ బోర్డు కాలనీలోని కార్గిల్ పార్కు వద్ద నివాముంటున్న దివిలి హేమచంద్ర మట్టితో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని తయారు చేశాడు. తొమ్మిది అంగుళాల పొడవు గల విగ్రహం అందరినీ ఆకట్టుకుంటోంది. హేమచంద్ర తండ్రి ప్రముఖ శిల్పి దివిలి అప్పారావు. తండ్రి బాటలోనే నడుస్తూ కుమారుడు కూడా ప్రతిభ నిరూపించుకుంటున్నాడు.



నందిగాం మండలం కొత్తఅగ్రహారం వద్ద బోల్తా పడిన జీడిపిక్కల లారీ

ఈ-క్రాప్‌పై అశ్రద్ధ వద్దు: కలెక్టర్

నరసన్నపేట: వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, గ్రామ స్థాయిలో అన్ని సాకర్యాలతో ఒక కార్యాలయం ఏర్పాటు చేసిందని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. ఆర్‌బీకేల్లో ఉన్న సిబ్బంది మరింత బాధ్యతగా పనిచేయాలని, చొరవ తీసుకుని రైతులకు సేవలు అందించాలని సూచించారు. ఆయన సోమవారం బొరిగివలసలో ఆర్‌బీకే, దేశవానిపేటలో సచివాలయాన్ని పరిశీలించారు. అలాగే బొరిగివలసలో ఈ-క్రాప్ బుకింగ్‌ను పరిశీలించారు. ఈ-క్రాప్ బుకింగ్ సకాలంలో పూర్తి చేయాలని, అశ్రద్ధ వహించవద్దని ఆదేశించారు. అనంతరం ఆయన ఆర్‌బీకేలో విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ పనితీరును నిశితంగా పరిశీలించారు. గ్రామంలో మట్టి నమూనాలు ఎందుకు సేకరించలేదని ప్రశ్నించారు. ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం జగనన్న గృహ నిర్మాణం, జగనన్న స్వచ్ఛ సంకల్పంపై ఆరా తీశారు. దేశవానిపేట సచివాలయంలో సిబ్బంది అటెండెన్స్‌ను పరిశీలించారు. మహిళా పోలీస్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ల పనితీరును పరిశీలించారు.

బూస్టర్ డోస్ అర్హత గల వారందరికీ వేయాలని, విద్యుత్‌ను పొదుపు చేయాలని సూచించారు. అన్ని సచివాలయాలకు, ఆర్‌బీకేలకు సోలార్ సిస్టమ్ అమర్చనున్నామని పేర్కొన్నారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ జేడీ కె.శ్రీధర్, ఏడీ రవీంద్రభారతి, ఏఓ కె.సునీత, తహసీల్దార్ ఎ.సింహాచలం, ఎంపీడీఓ జి.మధుసూదనరావు, హౌసింగ్ ఏఈ శంకరరావు తదితర అధికారులు ఉన్నారు.



బొరిగివలసలో ఈ క్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేడీ శ్రీధర్ తదితరులు

ఘర్షణలో గాయపడిన వ్యక్తి మృతి



కైలాసరావు (ఫైల్)

నరసన్నపేట: స్థానిక వీరన్నాయుడు కాలనీలో గత నెల 29న జరిగిన ఘర్షణలో గాయపడిన అల్లంశెట్టి కైలాసరావు (74) శ్రీకాకుళం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందారు. ఈ మేరకు మృతుని కుమారుడు విశ్వేశ్వరావు నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరన్నాయుడు కాలనీకి చెందిన అంపోలు జ్యోతి, అంపోలు గణేష్‌లు కొట్టడం వల్లే తన తండ్రి మరణించారని విశ్వేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడికి అంపోలు జ్యోతి, గణేష్‌లకు ఆర్థిక లావాదేవీలు ఉన్నా యి. తనకు ఇవ్వాల్సిన డబ్బు కోసం కైలాసరావు ప్రశ్నించగా 29న వీరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ గొడవలోనే కైలాసరావు గాయపడ్డారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ మస్తాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో నాగుపాము



బుసలు కొడుతున్న పాము

ఆమదాలవలస రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నాగుపాము ప్రత్యక్షం కావడంతో కార్యాలయ సిబ్బంది హడలిపోయారు. ఉదయం కార్యాలయం పనివేళ కావడంతో సిబ్బంది తలుపులు తెరవగా నాగుపాము పడగ విప్పి కనిపించింది. దీంతో కార్యాలయ సిబ్బంది కర్రతో అదిలిస్తూ సర్పాన్ని బయటకు పంపించేశారు.

'విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'



మాట్లాడుతున్న ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ఆర్ శర్మ

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ఆర్ శర్మ అన్నారు. సోమవారం శ్రీకాకుళంలోని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు ఆర్‌పీ రావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోరుతూ ఈ నెల 9వ తేదీన విశాఖపట్టణంలోని పీఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నామని, ఈ ధర్నాను విజయవంతం చేయాలన్నారు. ప్రధానంగా మినిమమ్ పెన్షన్ పెంచాలని, సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించి హయ్యర్ పెన్షన్ అమలు చేయాలని, విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ అమలు చేసినపుడే పీపీఓ ఆర్డర్లు పంపాలని, పీఎఫ్‌కు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని అన్నారు. సమావేశంలో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘ ప్రతినిధులు ఎ.ప్రతాప్, ఎం పెంటయ్య, యూ.ఫకీర్‌రావు, భాస్కరరావు, ప్రసాద్, అధిక సంఖ్యలో విశ్రాంత ఉద్యోగులు ఉన్నారు.

జీడిపిక్కల లారీ బోల్తా

నందిగాం/కాశీబుగ్గ: నందిగాం మండలం కొత్త అగ్రహారం వద్ద జీడిపిక్కల లారీ సోమవారం బోల్తా పడింది. తమిళనాడు రాష్ట్రం నుంచి పలాస వస్తున్న జీడిపిక్కల లారీ కొత్త అగ్రహారం చేరే సరికి.. డ్రైవర్ నిద్ర మత్తులో ఉండడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో డ్రైవర్, క్లీనర్‌లు గాయపడ్డారు. స్థానికులు 108కు సమాచారం అందించడంతో వారు చేరుకుని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి, తలకు గాయమైన పి.మల్లెస్వామిని పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు.



తీవ్రంగా గాయపడిన పి.మల్లెస్వామికి ప్రథమచికిత్స అందిస్తున్న పలాస 108 సిబ్బంది

రూ.1,51,111కు వినాయక లడ్డూ వేలం

వజ్రపుకొత్తూరు రూరల్: ఒంకూరులో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలం భారీ ధర పలికింది. అదే గ్రామానికి చెందిన యువకుడు గుంటు వెంకట చక్రవర్తి 15 కేజీల వినాయక లడ్డూను రూ.1,51,111లకు సొంతం చేసుకున్నారు.



భారీ లడ్డూ సొంతం చేసుకున్న చక్రవర్తి

రూ.లక్ష ఆరు వేలకు..

సోంపేట: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో సంపత్ వినాయక పూజా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక పూజా మహోత్సవాల్లో భాగంగా లడ్డూ వేలం పాట సోమవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన మడియా ఈశ్వరమ్మ రూ.1,06,000కు లడ్డూ దక్కించుకున్నారు.



వినాయక లడ్డూతో ఈశ్వరమ్మ, పూజా కమిటీ సభ్యులు

లంబోదరా.. ఆరగించవా



ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా వినాయకుని విగ్రహం వద్ద 221 రకాల ప్రసాదాలు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఎంపీడీఓ కార్యాలయం వద్ద కొలువుదీరిన గణపతికి 221 రకాల నైవేద్యాలను నిర్వాహకులు సోమవారం సమర్పించారు. వినాయక కమిటీ ఆహ్వానం మేరకు స్థానిక మహిళలు ఇంటిలో చేసిన వంటకాలను తీసుకువచ్చి ప్రసాదంగా పెట్టారు.

దూసిలో గుణుపూర్-పాసింజర్‌కు హాల్ట్

ఆమదాలవలస రూరల్: గుణుపూర్- పాసింజర్ రైలును ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు కోరారు. మండలంలో గల దూసి రైల్వేస్టేషన్‌లో విశాఖపట్నం నుంచి గుణుపూర్ ప్యాసింజర్ రైలు తొలిసారిగా నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం జెండా ఊపి రైలును ప్రారంభించారు. దూసి రైల్వేస్టేషన్‌లో ఈ రైలుకు హాల్ట్ సౌకర్యం లేకపోవడంతో రైల్వే అధికారులకు తెలియజేయడంతో స్టేషన్‌లో నిలుపుదలకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ రైలు వల్ల నాలుగు మండలాల ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ప్రయాణికులతో కలిసి ఎంపీ రైలు ప్రయాణం చేశారు.



దూసి రైల్వేస్టేషన్‌లో గుణుపూర్ పాసింజర్ రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు



‘ప్లేయర్ ఆఫ్ ద మంత్’ రేసులో జెమీమా

భారత మహిళా బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ ఐసీసీ ‘ప్లేయర్ ఆఫ్ ద మంత్’ అవార్డుకు నామినేట్ అయ్యింది. ప్రతి నెలలో అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చే క్రికెటర్‌కు ఈ అవార్డు ఇస్తారు. ఆగస్టులో జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్ రజత పతకం గెలుపొందడంలో జెమీమా కీలక పాత్ర పోషించింది. ఇందులో విజేతగా నిలిచిన ఆస్ట్రేలియన్ బ్యాటర్లు బెత్ మూనీ, తాలియా మెక్‌గ్రాత్‌లతో ఆమె ఈ అవార్డు రేసులో ఉంది. జెమీమా ఐదు మ్యాచ్‌ల్లో 146 పరుగులు చేయడం ద్వారా అత్యధిక పరుగుల జాబితాలో ఐదో స్థానంలో నిలిచింది.

నేషన్స్ కప్ బరిలో భారత హాకీ జట్టు

అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్) నేషన్స్ కప్‌లో భారత మహిళల జట్టు తమ తొలి పోరులో కెనడాను ఢీకొంటుంది. వచ్చే ఎఫ్‌ఐహెచ్ ప్రొ లీగ్ సీజన్‌కు క్వాలిఫయింగ్ టోర్నీ అయిన ఈ టోర్నీ స్పెయిన్‌లో డిసెంబర్ 11 నుంచి 17 వరకు జరుగుతుంది. పూల్ ‘బి’లో కెనడా, జపాన్, దక్షిణాఫ్రికాలతో భారత్ తలపడుతుంది. పూల్ ‘ఎ’లో ఆతిథ్య స్పెయిన్‌తో పాటు కొరియా, ఇటలీ, ఐర్లాండ్ ఉన్నాయి.



లంకను గెలిచేందుకు...

- కీలక పోరుకు టీమిండియా ‘సై’
- నేడు శ్రీలంకతో ‘సూపర్ 4’ మ్యాచ్
- రాత్రి గం.7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం



దుబాయ్: ఆసియా కప్ టి20 టోర్నీ తొలి రెండు మ్యాచ్‌లలో భారత్ జోరు చూస్తే పాకిస్తాన్‌పై మళ్లీ గెలవడం ఖాయమనిపించింది. అయితే ఆదివారం పాక్ చేతిలో ఎదురైన పరాజయం ‘సూపర్–4’ దశను ఆసక్తికరంగా మార్చింది. ఫైనల్ చేరాలంటే మూడు మ్యాచ్‌లలో కనీసం రెండు గెలవాల్సి ఉండగా, తొలి మ్యాచ్‌లో ఓటమి టీమిండియాపై ఒత్తిడి పెంచింది. మిగిలిన రెండు మ్యాచ్‌లు తప్పనిసరిగా గెలవాల్సిన స్థితిలో నేడు శ్రీలంకతో భారత్ తలపడనుంది. అనుభవం, రికార్డులపరంగా ప్రత్యర్థిపై అన్ని రకాలుగా భారత్‌దే పైచేయిగా కనిపిస్తున్నా... గత రెండు మ్యాచ్‌లలో లంక అనూహ్య విజయాలు చూస్తే అంత సులువు కాదని అనిపిస్తోంది.

అశ్విన్‌కు చాన్స్ ఉందా!

టి20 ప్రపంచకప్‌కు ఈ వారంలోనే భారత జట్టును ప్రకటించనున్నారు. ఇలాంటి స్థితిలో ఆసియా కప్‌లో సాధ్యమైనంత ఎక్కువ మందికి అవకాశం ఇస్తూ అన్ని రకాల ప్రత్యామ్నాయాలను భారత్ పరీక్షిస్తోంది. అయితే పాకిస్తాన్ చేతిలో ఓడటంతో మరోసారి తుది జట్టు విషయంలో సందిగ్ధత నెలకొంది. ఓపెనర్లుగా రోహిత్, రాహుల్ గత మ్యాచ్‌లో శుభారంభం అందించడం సానుకూలాంశం. టోర్నీలో రెండో అర్ధ సెంచరీతో కోహ్లి ఫామ్‌లోకి రాగా, నాలుగో స్థానంలో సూర్యకుమార్ యాదవ్, ఆల్‌రౌండర్‌గా హార్దిక్ పాండ్యా మరోసారి చెలరేగాల్సి ఉంది. పాక్‌తో మ్యాచ్‌లో హార్దిక్ రెండు విభాగాల్లోనూ నిరాశపర్చాడు. కీపర్ రిషభ్ పంత్, దినేశ్ కార్తీక్ మధ్య టీమ్ మేనేజ్‌మెంట్ ఇంకా తేల్చుకోలేకపోతోంది. హాంకాంగ్‌తో మ్యాచ్‌లో ఇద్దరూ ఆడగా, గత పోరులో కార్తీక్ స్థానంలో బ్యాటర్‌గా దీపక్ హుడా జట్టులోకి వచ్చాడు. హుడాకు మరో అవకాశం ఇస్తారా లేక కార్తీక్‌ను మళ్లీ ఆడిస్తారా చూడాలి. జస్‌ప్రీత్ బుమ్రా, హర్షల్ పటేల్‌లాంటివాళ్లు లేకపోవడంతో బౌలింగ్‌లో తడబాటు కనిపిస్తోంది. ఎంతో నమ్ముకున్న భువనేశ్వర్ పాక్‌తో మ్యాచ్‌లో 19వ ఓవర్లో భారీగా పరుగులు ఇవ్వడం విమర్శలకు దారి తీసింది. ఇప్పుడు దానిని అతను సరిదిద్దుకోవాల్సి ఉంది. స్పిన్ విభాగంలో ఒక మార్పు జరగవచ్చు. ఆశించిన స్థాయిలో చహల్ రాణించడం లేదు కాబట్టి సీనియర్ ఆఫ్‌స్పిన్నర్ అశ్విన్‌కు ఒక అవకాశం ఇవ్వవచ్చు. లేదంటే ప్రపంచకప్ ప్రణాళికల్లో అతను లేడని ఖాయంగా చెప్పవచ్చు.



స్టార్లు లేకపోయినా...

లీగ్ దశలో అఫ్గానిస్తాన్‌తో తొలి మ్యాచ్‌లో ఓడగానే శ్రీలంక జట్టును అంతా తేలిగ్గా చూశారు. అయితే తర్వాతి రెండు మ్యాచ్‌లలో ఆ జట్టు చూపిన పోరాటపటిమ, యువ ఆటగాళ్ల పట్టుదల అభినందనీయం. ఈ రెండు మ్యాచ్‌లలోనూ ఓటమికి చేరువై గెలుపునకు ఎలాంటి అవకాశం లేని స్థితి నుంచి లంక మ్యాచ్‌లు గెలవగలిగింది. ముందుగా బంగ్లాదేశ్‌ను ఇంటికి పంపిన ఆ జట్టు ‘సూపర్–4’లో గెలుపుతో అఫ్గానిస్తాన్‌పై ప్రతీకారం తీర్చుకుంది. బ్యాటర్లు షనక, కుశాల్ మెండిస్, గుణతిలక, రాజపక్స కీలక సమయాల్లో రాణించి జట్టు విజయానికి కారణం కాగా, చివర్లో చమిక కరుణరత్నే కూడా బ్యాటింగ్ చేయగలనని నిరూపించాడు. బౌలింగ్‌లో గుర్తింపు ఉన్న పేసర్లు ఎవరూ లేకపోవడం లంక జట్టు బలహీనత. అయితే ఐపీఎల్‌లో ఆడిన స్పిన్నర్లు మహీశ్ తీక్షణ, హసరంగ భారత్‌పై ప్రభావం చూపగలరు.

‘ధోని ఒక్కడే మెసేజ్ చేశాడు’

కెప్టెన్సీ నుంచి తప్పుకున్న క్షణంపై కోహ్లి



దుబాయ్: భారత టెస్టు కెప్టెన్సీ నుంచి తాను తప్పుకున్న సమయంలో ఒక్క ఎమ్మెస్ ధోని మాత్రమే తన గురించి ఆలోచించాడని కోహ్లి అన్నాడు. తనతో ఎంతో పరిచయం ఉన్నవాళ్లు కూడా టీవీలో, సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేయడమే తప్ప తనతో మాట్లాడేందుకు ప్రయత్నించలేదని, వారు ఎలాంటివారో తనకు అప్పుడు తెలిసిందని అన్నాడు. ఈ ఏడాది ఆరంభంలో దక్షిణాఫ్రికా గడ్డపై సిరీస్ ఓడిన తర్వాత కోహ్లి టెస్టు కెప్టెన్సీకి రాజీనామా చేశాడు. ‘గత ఏడాది కాలంగా జరిగిన కొన్ని ఘటనలు చూస్తే ఒక విషయం మీతో పంచుకోవాలనిపిస్తోంది. నేను టెస్టు కెప్టెన్సీకి రాజీనామా చేసిన సమయంలో ఒక్క ధోని మాత్రమే నాకు మెసేజ్ చేశాడు. మా ఇద్దరి మధ్య అలాంటి పరస్పర గౌరవం, అనుబంధం ఉన్నాయి. ఇద్దరిలో నిజాయితీ ఉంటే ఎదుటివారి పట్ల అభద్రతాభావం లేకుంటేనే అది సాధ్యమవుతుంది. అతడు మినహా ఎవరూ నాకు ఫోన్ చేయలేదు. చాలా మంది దగ్గర నా నంబర్ కూడా ఉంది. వీరంతా టీవీల్లో నా ఆట గురించి, కెప్టెన్సీ గురించి సలహాలు, సూచనలు చేసేవాళ్లే. నాకు మేలు చేయాలని నిజంగా అనుకుంటే వీరు నేరుగా నాతోనే మాట్లాడేవారు. ప్రపంచం మొత్తం ముందు సలహాలు ఇస్తే దానికి విలువేముంటుంది. నేను ఎవరికైనా ఏదైనా చెప్పాలనుకుంటే నేరుగా వారికే చెబుతా తప్ప ఇలా చేయను’ అని కోహ్లి వ్యాఖ్యానించాడు. దిగ్గజ క్రికెటర్ సునీల్ గావస్కర్ సహా వ్యాఖ్యాతలుగా ఉన్న పలువురు సీనియర్లను ఉద్దేశించి అతను ఈ వ్యాఖ్యలు చేసినట్లు అర్థమవుతోంది.

మెద్వెదెవ్‌కు చుక్కెదురు

- ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ఇంటిముఖం
- నంబర్‌వన్ ర్యాంక్ కోల్పోనున్న రష్యా ప్లేయర్
- ఆస్ట్రేలియా స్టార్ కిరియోస్ సంచలన విజయం
- యూఎస్ ఓపెన్ టోర్నీ



మెద్వెదెవ్



కిరియోస్

న్యూయార్క్: ఈ ఏడాది అద్భుతమైన ఫామ్‌లో ఉన్న ఆస్ట్రేలియా వివాదాస్పద టెన్నిస్ ప్లేయర్ నిక్ కిరియోస్ యూఎస్ ఓపెన్‌లో పెను సంచలనం సృష్టించాడు. తన దూకుడైన ఆటతో కిరియోస్ ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్, డిఫెండింగ్ చాంపియన్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా)ను ఇంటిదారి పట్టించాడు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 25వ ర్యాంకర్ కిరియోస్ 7–6 (13/11), 3–6, 6–3, 6–2తో మెద్వెదెవ్‌పై విజయం సాధించి తన కెరీర్‌లో తొలిసారి యూఎస్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. 2 గంటల 53 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో కిరియోస్, మెద్వెదెవ్ ఏస్‌లతో హడలెత్తించారు. కిరియోస్ 21, మెద్వెదెవ్ 22 ఏస్‌లు సంధించారు. అయితే అందివచ్చిన బ్రేక్ పాయింట్లను సద్వినియోగం చేసుకున్న కిరియోస్ విజయం రుచి చూశాడు. మ్యాచ్ మొత్తంలో మెద్వెదెవ్ సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసిన కిరియోస్ తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయాడు. క్వార్టర్ ఫైనల్లో మరో రష్యా ప్లేయర్ ఖచనోవ్‌తో కిరియోస్ ఆడతాడు. తాజా ఓటమితో మెద్వెదెవ్ వచ్చే సోమవారం విడుదలయ్యే ప్రపంచ ర్యాంకింగ్స్‌లో తన ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను కోల్పోనున్నాడు. మెద్వెదెవ్ స్థానంలో నాదల్ (స్పెయిన్), అల్కరాజ్ (స్పెయిన్), కాస్పర్ రూడ్ (నార్వే)లలో ఒకరు ప్రపంచ నంబర్‌వన్ అవుతారు. మరోవైపు ఐదో ర్యాంకర్ కాస్పర్ రూడ్, ఖచనోవ్ కూడా తొలిసారి యూఎస్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో రూడ్ 6–1, 6–2, 6–7 (4/7), 6–2తో ముటెట్ (ఫ్రాన్స్)పై, ఖచనోవ్ 4–6, 6–3, 6–1, 4–6, 6–3తో కరెనో బుస్టా (స్పెయిన్)పై, బెరెటిని (ఇటలీ) 3–6, 7–6 (7/2), 6–3, 4–6, 6–2తో ఫోకినా (స్పెయిన్)పై, తొమ్మిదో సీడ్ రుబ్లెవ్ (రష్యా) 6–4, 6–4, 6–4తో ఏడో సీడ్ కామెరూన్ నోరి (బ్రిటన్)పై గెలిచారు.



కోకో గాఫ్

కోకో గాఫ్, జబర్ తొలిసారి...

మహిళల సింగిల్స్ విభాగంలో అమెరికా టీనేజర్ కోకో గాఫ్, ప్రపంచ ఐదో ర్యాంకర్ ఆన్స్ జబర్ (ట్యునీషియా), 17వ ర్యాంకర్ కరోలినా గార్సియా (ఫ్రాన్స్), 46వ ర్యాంకర్ ఐలా తొమ్లాయనోవిచ్ (ఆస్ట్రేలియా) తొలిసారి యూఎస్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. ప్రిక్వార్టర్ ఫైనల్లో కోకో గాఫ్ 7–5, 7–5తో షుయె జాంగ్ (చైనా)పై గెలుపొందగా... జబర్ 7–6 (7/1), 6–4తో కుదెర్‌మెటోవా (రష్యా)ను ఓడించింది. మూడో రౌండ్‌లో అమెరికా దిగ్గజం సెరెనా విలియమ్స్‌ను బోల్తా కొట్టించిన తొమ్లాయనోవిచ్ అదే జోరు కొనసాగించి ప్రిక్వార్టర్ ఫైనల్లో 7–6 (8/6), 6–1తో సమ్‌సోనోవా (రష్యా)పై గెలిచింది. కెరీర్‌లో 42వ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆడుతున్న గార్సియా 6–4, 6–1తో అలీసన్ రిస్కే అమృత్‌రాజ్ (అమెరికా)ను ఓడించింది.

బీసీసీఐ టైటిల్ స్పాన్సర్‌గా ‘మాస్టర్‌కార్డ్’

- మ్యాచ్‌కు రూ. 3.80 కోట్లతో హక్కులు
- గడువుకు ముందే వైదొలగిన ‘పేటీఎమ్’

ముంబై: బోర్డంటే బీసీసీఐనే! జతకట్టినా రూ. కోట్లే... వైదొలిగినా రూ. కోట్లే! అట్లుంటది భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)తో వ్యవహారం అంటే! ఒకటి పోతే, ఇంకోటి జతకట్టేందుకు, అంతకుమించి పెద్ద మొత్తం ఇచ్చేందుకు రెడీ అయిపోతాయి. టైటిల్ స్పాన్సర్ అయిన ‘పేటీఎమ్’ తాజాగా వైదొలగింది. మ్యాచ్‌కు రూ. 2.4 కోట్లతో ఒప్పందం కుదుర్చుకున్న ఈ సంస్థ వెళితే వెంటనే ‘మాస్టర్‌కార్డ్’ లైన్లోకి వచ్చింది. అది కూడా రూ.3.8 కోట్లు ఇచ్చేందుకు సిద్ధమైంది. పేటీఎమ్ 2019లో ఐదేళ్ల కాలానికి గాను రూ.326.80 కోట్లతో టైటిల్ స్పాన్సర్‌షిప్ హక్కులు పొందింది. వచ్చే ఏడాది (2023)దాకా గడువుంది. ఈ జూలై తొలి వారంలోనే వైదొలగేందుకు సిద్ధమైన పేటీఎమ్ ‘మాస్టర్‌కార్డ్’ టేకోవర్ ప్రతిపాదనను బీసీసీఐ ముందుంచింది. దీనిపై బోర్డు సంప్రదింపులు జరిపి సోమవారం ‘మాస్టర్‌కార్డ్’తో డీల్‌కు ఓకే చెప్పింది. ఈ ఒప్పందంలో భాగంగా భారత్‌లో జరిగే పురుషులు, మహిళల సీనియర్, అండర్–19, 23 అంతర్జాతీయ ఈవెంట్లు, దేశవాళీ టోర్నీలకు ‘మాస్టర్‌కార్డ్’ టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తుంది.

సినిమా



రాశీ ఖన్నా, శర్వానంద్

పొలిటికల్ డ్రామా షురూ

వెండితెరపై పొలిటికల్ టర్న్ తీసుకున్నారు శర్వానంద్. కృష్ణ చైతన్య దర్శకత్వంలో శర్వానంద్ హీరోగా నటిస్తున్న తాజా సినిమా ప్రారంభోత్సవం సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. పొలిటికల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాలో రాశీ ఖన్నా హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రియమణి ఓ కీలక పాత్ర చేస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న సినిమా ఇది. ఈ సినిమా పూజా కార్యక్రమంలో దర్శకులు చందూ మొండేటి, హను రాఘవపూడి, సుధీర్ వర్మ, యూవీ క్రియేషన్స్ వంశీ, ప్రమోద్‌లు స్క్రిప్ట్‌ను దర్శకుడికి అందించారు. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు త్రివిక్రమ్ క్లాప్ ఇవ్వగా, కృష్ణ చైతన్య దర్శకత్వం వహించారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ అక్టోబరులో ప్రారంభం కానుంది. ఈ చిత్రానికి సంగీతం: యువన్ శంకర్ రాజా, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.



తమన్నా

ఓటీటీలో బబ్లీ బౌన్సర్

తమన్నా ప్రధాన పాత్రలో నటించిన తాజా హిందీ చిత్రం ‘బబ్లీ బౌన్సర్’. మధూర్ భండార్కర్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ట్రైలర్‌ను రిలీజ్ చేసింది చిత్ర యూనిట్. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఓ అమ్మాయికి వారి తల్లిదండ్రులు వివాహం చేయాలనుకుంటారు. కానీ ఆ అమ్మాయి ఢిల్లీ వెళ్లి ఉద్యోగం చేయాలనుకుంటుంది. ఈ క్రమంలో ఓ క్లబ్‌లో లేడీ బౌన్సర్‌గా మారుతుంది. బౌన్సర్‌గా మారిన తర్వాత ఆ అమ్మాయి ఎలాంటి సవాళ్లను ఎదుర్కొంది? సమస్యలను ఎలా పరిష్కరించింది? అన్నది ఈ చిత్రకథాంశం. విడుదలైన ట్రైలర్‌లో తమన్నా యాక్షన్ సన్నివేశాల్లో కనిపించారు. ఈ నెల 23 నుంచి ఈ చిత్రం ఓ ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కానుంది.

ఉగ్రం ఆరంభం

‘నాంది’ వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో ‘అల్లరి’ నరేశ్, దర్శకుడు విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో రూపొందుతున్న మరో సినిమా ‘ఉగ్రం’. ఈ చిత్రంలో మిర్నా మీనన్ కథానాయికగా నటిస్తున్నారు. సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మిస్తున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన ఓ గ్లింప్స్ వీడియోను చిత్ర యూనిట్ రిలీజ్ చేసింది. తూము వెంకట్ కథ అందించిన ఈ సినిమాకు అబ్బూరి రవి మాటలు రాస్తున్నారు. శ్రీ చరణ్ పాకాల సంగీతదర్శకత్వం వహిస్తుండగా, సిద్ కెమెరామేన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.



‘అల్లరి’ నరేశ్

కోటికొక్కడు గోల్డెన్ హ్యాండ్స్‌లో ఉన్నాడు

– శ్రేయాస్ శ్రీనివాస్



సాయికృష్ణ, శ్రేయాస్ శ్రీనివాస్

‘‘మాస్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం ‘కే 3 కోటికొక్కడు’. కన్నడలో సుదీప్‌గారి కెరీర్‌లో అత్యధిక వసూళ్లు (దాదాపు 60 కోట్లు) సాధించింది. తెలుగులోనూ ఈ సినిమా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది’’ అని నిర్మాత శ్రేయాస్ శ్రీనివాస్ అన్నారు. కిచ్చా సుదీప్ హీరోగా మడోన్నా సెబాస్టియన్, శ్రద్ధాదాస్, ఆషికా రంగనాథ్ కీలక పాత్రల్లో నటించిన కన్నడ చిత్రం ‘కోటిగొబ్బ 3’. శివ కార్తీక్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం గత ఏడాది అక్టోబరు 15న విడుదల అయింది. ఈ చిత్రాన్ని ‘కే 3 కోటికొక్కడు’ పేరుతో గుడ్ సినిమా గ్రూప్ బ్యానర్‌పై శ్రేయాస్ శ్రీనివాస్, దేవేంద్ర డీకే ఈ నెల 16న తెలుగులో విడుదల చేస్తున్నారు. నిర్మాత శ్రేయాస్ శ్రీనివాస్, సహ నిర్మాత సాయి కృష్ణ మాట్లాడుతూ– ‘‘గత ఏడాది అక్టోబర్ 21న తెలుగులో ఈ సినిమాని విడుదల చేయాలనుకున్నాం. అయితే వరుసగా పెద్ద సినిమాల రిలీజ్‌లు ఉండటంతో ఇక్కడ విడుదల చేయలేక పోయాం. సుదీప్‌గారు నటించిన ‘విక్రాంత్ రోణ’ సినిమా పాన్ ఇండియా క్రేజ్ సంపాదించుకుంది. దీంతో ‘కే3 కోటికొక్కడు’కి మంచి మార్కెట్ ఉంటుందనే ఆలోచనతో ఈ నెల 16న విడుదల చేస్తున్నాం. తెలుగు చిత్ర పరిశ్రమలో నన్ను సపోర్ట్ చేస్తున్న అతిరథ మహారథులు ఈ సినిమాని విడుదల చేస్తున్నారు.. ఓ రకంగా మా ‘కోటికొక్కడు’ గోల్డెన్ హ్యాండ్స్‌లో ఉన్నాడు. ఇక మా ప్రొడక్షన్‌లో ఐదు భిన్నమైన కథలతో ‘గోదారి కథలు’ అనే సినిమా నిర్మిస్తున్నాం. ‘శ్రేయాస్ ఈటీ’ యాప్‌ని అక్టోబర్‌లో రీలాంచ్ చేస్తున్నాం’’ అన్నారు.

మనం సినిమా తీస్తున్నాం!



కృతీ శెట్టి, సుధీర్‌బాబు

‘చేస్తాను.. నేను యాక్ట్ చేస్తాను’ అంటూ కృతీ శెట్టి ఫోన్‌లో సుధీర్‌బాబుతో మాట్లాడుతున్న సీన్‌తో మొదలవుతుంది ‘ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి’ సినిమా ట్రైలర్. సుధీర్‌బాబు, కృతీ శెట్టి జంటగా ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో రూపొందిన చిత్రం ఇది. గాజులపల్లె సుధీర్‌బాబు సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్, బెంచ్ మార్క్ స్టూడియోస్ పతాకాలపై బి. మహేంద్రబాబు, కిరణ్ బల్లపల్లి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 16న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా సినిమా ట్రైలర్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు హీరో మహేశ్‌బాబు. ‘నేను ఈ సినిమా ఇక చేయలేనేమో అనిపిస్తుంది’ అన్న కృతీ శెట్టి డైలాగ్, ‘మనం సినిమా తీస్తున్నాం అని అనుకుంటుంటాం కానీ అప్పుడప్పుడు సినిమాయే మనల్ని తీస్తుంటుంది’ అనే సుధీర్‌బాబు డైలాగ్స్‌తో ట్రైలర్ సాగుతుంది. ‘‘అలేఖ్య (కృతీ పాత్ర)కు నటి కావాలనే ఆశ ఉన్నప్పటికీ ఆమె తల్లిదండ్రులు పూర్తి వ్యతిరేకం. అలేఖ్య ఆశ ఫైనల్‌గా ఏమైంది? ఇందుకు ఆ సినిమా దర్శకుడు (సుధీర్‌బాబు పాత్ర) ఏం చేశాడు? అనే అంశాల ఆధారంగా కథ సాగుతుంది’’ అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: వివేక్ సాగర్.



సుదర్శన్, సంతోష్, ఫరియా

లైక్.. షేర్..

సంతోష్ శోభన్, ‘జాతి రత్నాలు’ ఫేమ్ ఫరియా అబ్దుల్లా జంటగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా ‘లైక్ షేర్ అండ్ సబ్‌స్క్రైబ్’. ఆముక్త క్రియేషన్స్, నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం టైటిల్‌ను ప్రకటించి, ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. నెల్లూరు సుదర్శన్ కీలక పాత్ర చేస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ప్రవీణ్ లక్కరాజు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వెంకటరత్నం (వెంకట్).



శివ శ్రీ మీగడ, నివాస్ శిష్టు, రాజేష్ సీహెచ్

రహస్యం ఏంటి?

నివాస్ శిష్టు, సారా ఆచార్ జంటగా శివ శ్రీ మీగడ దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘రహస్య’. గౌతమి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 9న విడుదలవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో నివాస్ శిష్టు మాట్లాడుతూ– ‘కెనడాలో ఉన్న నా వద్దకు ఈ కథ రావడం, ఈ సినిమాలో ఎన్ఐఏ అధికారి విశ్వతేజ పాత్ర చేయడం నా అదృష్టం. దర్శకుడు ఈ చిత్రాన్ని బాగా తీశాడు’’ అన్నారు. ‘మన పుట్టుక నుంచి చనిపోయే వరకు మన జీవితంలో మంచం ప్రధాన పాత్ర పోషిస్తుంది. అది ఎలా? అనేది ఈ సినిమాలో చూపించాం’’ అన్నారు శివ శ్రీ మీగడ. ఈ వేడుకలో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రాజేష్, కెమెరామేన్ సెల్వకుమార్, ఎడిటర్ ఉద్ధవ్, కొరియోగ్రాఫర్ చంద్ర కిరణ్, నటుడు వేద భాస్కర్, లిరిసిస్ట్ సంజయ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: చరణ్ అర్జున్, నేపథ్య సంగీతం: సునీల్ కశ్యప్.

ఘాట్ రోడ్‌లో ఏం జరిగింది?

శ్రీజిత్ వడ్డి, క్రిష్ కురుప్ జంటగా అజయ్, రాజీవ్ కనకాల ప్రధాన పాత్రల్లో కృష్ణ కుమార్ అసూరి దర్శకత్వం వహిస్తున్న చిత్రం ‘నీకై నేను’. నాగిరెడ్డి తారకప్రభు, ఎ. హనీఫ్ నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ఆరంభమైంది. తొలి సీన్‌కి సినిమాటోగ్రాఫర్ యస్. గోపాల్ రెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత సి. కల్యాణ్ క్లాప్ ఇచ్చారు. దర్శకుడు బి. గోపాల్ గౌరవ దర్శకత్వం వహించారు. కృష్ణ కుమార్ అసూరి మాట్లాడుతూ– ‘‘ప్రభాస్‌గారి ‘రాధేశ్యామ్’ స్క్రిప్ట్ డెవలప్‌మెంట్‌లో పని చేశాను. నేను రాసుకున్న కథతో ‘నీకై నేను’ చేస్తున్నాను. ఇంటర్నేషనల్ బార్డర్ దగ్గరలో ఉండే ఘాట్ రోడ్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న క్రైమ్, లవ్ స్టోరీ ఇది’’ అన్నారు. ‘‘డిసెంబర్‌లో చిత్రాన్ని విడుదల చేస్తాం’’ అన్నారు నాగిరెడ్డి తారకప్రభు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: సి. భాస్కరరాజు, ఉదయ్ కుమార్, సంగీతం: మెగాకోటి, కెమెరా: వాసు.పి.



శ్రీజిత్, క్రిష్



సునీల్, క్రాంతి కిరణ్

కామెడీ గ్యాంగ్

వెంకట్ కల్యాణ్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ‘చెడ్డీ గ్యాంగ్ తమాషా’. గాయత్రీ పటేల్ హీరోయిన్. అబుజా, శ్రీ లీల ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై సీహెచ్ క్రాంతి కిరణ్ నిర్మించారు. ఈ సినిమా టైటిల్ టీజర్‌ను నటుడు సునీల్ విడుదల చేసి, మాట్లాడుతూ– ‘‘చెడ్డీ గ్యాంగ్ తమాషా’ చిత్రాన్ని ప్రేక్షకులు థియేటర్స్‌లో చూసి కొత్తవాళ్లని ప్రోత్సహించాలి’’ అన్నారు. సీహెచ్ క్రాంతి కిరణ్ మాట్లాడుతూ– ‘‘వినోదాత్మకంగా రూపొందిన చిత్రం ఇది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు తుది దశకు చేరుకున్నాయి. త్వరలోనే సినిమా విడుదల తేదీ ప్రకటిస్తాం’’ అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: జీకే యాదవ్ బంక, సంగీతం: అర్జున్ నల్లగొప్పుల.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
443	126
59,246	17,666

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు శుక్రవారం ముగింపు)			
నాస్‌డాక్	11,631	▽	154
డోజోన్స్	31,318	▽	338
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,287	▲	6
డాక్స్	12,761	▽	289
షాంఘై	3,200	▲	13
నికాయ్	27,619	▽	31

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఆగస్టులో మెరుగుపడిన 'సేవలు'

57.2కు పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్



న్యూఢిల్లీ: భారత్ సేవల రంగం ఆగస్టులో మెరుగుపడింది. ఎస్అండ్‌పీ గ్లోబల్ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ ఆగస్టులో 57.2కు ఎగసింది. జూలైలో సూచీ నాలుగు నెలల కనిష్టం 55.5కు పడిపోయింది. కొత్త బిజినెస్, డిమాండ్ పరిస్థితులు, ఉపాధి కల్పన ఆగస్టులో సేవల రంగానికి కలిసి వచ్చిందని తమ సర్వే తెలియజేసినట్లు ఎస్అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ విభాగంలో అసోసియేట్ డైరెక్టర్ పోలీయానా డీ లిమా పేర్కొన్నారు. ఉపాధి కల్పన ఆగస్టులో గడచిన 14 సంవత్సరాల్లో ఎన్నడూ లేనంత అధికంగా నమోదైనట్లు తెలిపారు. సూచీ 50 పైన ఉంటేనే వృద్ధిగా పరిగణిస్తారు. ఆలోపునకు పడిపోతేనే క్షీణతగా భావిస్తారు. ఈ ప్రాతిపదికన సేవల రంగం వృద్ధి బాటన పయనించడం ఇది వరుసగా 13వ నెల.

ఒమనీస్ కన్సార్షియం చేతికి 'సెంబ్‌కార్ప్'

- దేశీ యూనిట్ విక్రయానికి రెడీ
- డీల్ విలువ రూ. 11,700 కోట్లు



న్యూఢిల్లీ: కర్బనాల తగ్గింపు ప్రణాళికలో భాగంగా దేశీ యూనిట్‌ను ఒమనీస్ ఫండ్స్ కన్సార్షియంకు విక్రయించనున్నట్లు సింగపూర్ సంస్థ సెంబ్‌కార్ప్ ఇండస్ట్రీస్ తాజాగా పేర్కొంది. డీల్ విలువను రూ. 11,700 కోట్లుగా వెల్లడించింది. సెంబ్‌కార్ప్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్(ఎస్ఈఐఎల్-సీల్)లో 100 శాతం వాటాను తన్వీర్‌ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పీటీఈ లిమిటెడ్‌కు బదిలీ చేయనున్నట్లు తెలియజేసింది. ఒమన్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్(ఓఐసీ) అధ్యక్షతన ఏర్పాటైన కన్సార్షియం పరోక్షంగా తన్వీర్ ఇన్‌ఫ్రాకు యజమానికాగా.. ఒమన్ రక్షణ శాఖ పెన్షన్ ఫండ్‌తో భాగస్వామ్యాన్ని కలిగి ఉంది. కాగా.. బొగ్గు ఆధారిత, పునరుత్పాదక ఇంధన విభాగాలతో కలిపి సీల్ 4.3 గిగావాట్ల పోర్ట్‌ఫోలియోను కలిగి ఉంది. దీనిలో ఆంధ్రప్రదేశ్‌లోని 2,640 మెగావాట్ల(2.6 గి.వా) బొగ్గు ఆధారిత రెండు ప్రాజెక్టులున్నాయి. దేశవ్యాప్తంగా ఏడు రాష్ట్రాలలో 1.7 గి.వా. పవన, సౌర విద్యుత్ ప్రాజెక్టులు సైతం కలిగి ఉంది. మరో 700 మె.వా యూనిట్ నిర్మాణంలో ఉంది. తద్వారా దేశీయంగా అతిపెద్ద స్వతంత్ర విద్యుదుత్పత్తి సంస్థలలో ఒకటిగా నిలుస్తోంది. తన్వీర్ దశలవారీ చెల్లింపులు చేపట్టనుండగా.. విక్రయం పూర్తయ్యేవరకూ సెంబ్‌కార్ప్ టెక్నికల్ అడ్వయిజర్‌గా సేవలందించనుంది. యాజమాన్య బదిలీతో ప్రస్తుత ఉద్యోగులపై ఎలాంటి ప్రభావం పడబోదని కంపెనీ తెలియజేసింది.

17,650 పైకి నిఫ్టీ

- సెన్సెక్స్ లాభం 443 పాయింట్లు
- ప్రపంచ ప్రతికూలతలను విస్మరించిన సూచీలు
- ర్యాలీకి అండగా అధిక వెయిటేజీ షేర్లు
- అన్ని రంగాల షేర్లలో కొనుగోళ్లే
- రూ.1.35 లక్షల కోట్ల సంపద సృష్టి

ముంబై: అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూలతలను విస్మరిస్తూ దేశీయ స్టాక్ సూచీలు సోమవారం ఒకశాతం లాభపడ్డాయి. అధిక వెయిటేజీ రిలయన్స్, ఐటీసీతో పాటు కొన్ని ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ షేర్లు రాణించి సూచీల ర్యాలీకి అండగా నిలిచాయి. సెన్సెక్స్ 443 పాయింట్లు పెరిగి 59,246 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 126 పాయింట్లు బలపడి 17,666 వద్ద నిలిచింది. అన్ని రంగాలకు చెందిన మధ్య తరహా షేర్లకు ఎక్కువగా కొనుగోళ్ల మద్దతు లభించింది. దీంతో బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఒకశాతం పెరిగింది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ అరశాతం లాభపడింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.812 కోట్ల షేర్లను అమ్మేయగా, దేశీయ ఇన్వెస్టర్లు రూ.536 కోట్ల షేర్లను కొన్నారు. సెన్సెక్స్ సూచీ 443 పాయింట్లు పెరగడంతో బీఎస్ఈలో రూ.1.35 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. బీఎస్ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.278.46 లక్షల కోట్లకు చేరింది.

బలహీనంగా అంతర్జాతీయ మార్కెట్లు

అంతర్జాతీయ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి. చైనాలో ప్రాపర్టీ అమ్మకాలు భారీగా తగ్గుముఖం పట్టడంతో ఆసియా మార్కెట్లు నష్టపోయాయి. యూరోపాలో ఇంధన సంక్షోభం నేపథ్యంలో గ్యాస్ ధరలు ఏకంగా 30% పెరిగిన నేపథ్యంలో యూరోపియన్ సూచీలు ఒకటిన్నర క్షీణించాయి.



లేబర్ డే సందర్భంగా అమెరికా మార్కెట్లకు సోమవారం సెలవు. కాగా రోజుకు 10వేల బ్యారెళ్ల మేరకు ఉత్పత్తిలో కోత విధిస్తామని ఒపెక్ ప్లస్ దేశాల ప్రకటన తర్వాత యూఎస్ ఫ్యూచర్లు స్వల్పంగా కదలాడుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- రిలయన్స్ షేరు 2% లాభపడి రూ.2,570 వద్ద స్థిరపడింది. మోర్గాన్ స్టాన్లీ ఆర్ఐఎల్ షేరు టార్గెట్ ధరను పెంచడం ఇందుకు కారణమైంది.
- ఎఫ్ఎంసీజీ దిగ్గజం ఐటీసీ షేరు రెండుశాతం బలపడి రూ.330 వద్ద ఐదేళ్ల గరిష్టాన్ని తాకింది. చివరికి 1.78% లాభంతో రూ.329 వద్ద నిలిచింది.
- ఆఫీసులపై ఈడీ దాడులతో పేటీఎం కంపెనీ షేరు 3% నష్టపోయి రూ.709 వద్ద ముగిసింది.

నిజామాబాద్‌లో రేపు లలితా జ్యువెల్లరి కొత్త షోరూం ప్రారంభం



నిజామాబాద్: ప్రముఖ ఆభరణాల తయారీ, విక్రయ సంస్థ లలితా జ్యువెల్లరి బుధవారం (రేపు) తన 43వ కొత్త షోరూంను నిజామాబాద్‌లో ప్రారంభించనుంది. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, మేయర్ నీతూ కిరణ్‌లు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. "నిజామాబాద్ పరిసర ప్రాంతాల నుంచి ఎక్కువ మంది మా ఇతర స్టోర్లకు వచ్చి ఆభరణాలు కొంటున్నారు. అందుకే స్థానికంగా అవుట్‌లేట్లను ప్రారంభించాలని నిర్ణయించుకున్నాము. తెలుగు రాష్ట్రాల్లో షోరూంలకు ప్రజల నుంచి దక్కిన విశేష ఆదరణ దృష్ట్యా దక్షిణ భారతదేశంలో మా సేవలను మరింత విస్తృతం చేయాలనుకుంటున్నాము" అని సంస్థ చైర్మన్, ఎండీ డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్ తెలిపారు. కొత్త షోరూంల్లో మార్కెట్ కంటే తక్కువ తరుగులో బంగారం నగలను అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని కస్టమర్లంతా వినియోగించుకోవాలని కోరారు.

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	50,770
బంగారం (99.5 స్వచ్ఛత)	50,567
వెండి (కిలో)	53,363

టెలికం కంపెనీలకు 'సిమ్' పోటు

- మొబైల్ ఫోన్లలో ఈ- సిమ్ కావాలి
- ఈ విధంగా ఆదేశాలు జారీ చేయండి
- టెలికం శాఖకు ఆపరేటర్ల విజ్ఞప్తి
- సెమీకండక్టర్ల సంక్షోభంతో సిమ్ కార్డులకు కొరత
- వ్యతిరేకిస్తున్న ఫోన్ల తయారీదారులు

న్యూఢిల్లీ: టెలికం సేవల కంపెనీలు (ఆపరేటర్లు), మొబైల్ ఫోన్ల తయారీదారుల మధ్య పేచీ వచ్చింది. ఇదంతా సిమ్ కార్డులకు కొరత ఏర్పడడం వల్లే. కరోనా కారణంగా లాక్‌డౌన్‌లతో సెమీకండక్టర్ పరిశ్రమలో సంక్షోభం నెలకొనడం తెలిసిందే. రెండేళ్లయినా కానీ సెమీకండక్టర్ల కొరత ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ పరిశ్రమలను వేధిస్తోంది. ఇది టెలికం కంపెనీలనూ తాకింది. సిమ్‌కార్డుల సరఫరాలో కొరత నెలకొంది. అంతేకాదు, 2024కు ముందు సిమ్‌ల సరఫరా పరిస్థితి మెరుగుపడేలా లేదు. దీంతో రూ.10,000 అంతకుమించి విలువ చేసే అన్ని మొబైల్ ఫోన్లలో, ఫిజికల్ సిమ్ స్లాట్‌తోపాటు.. ఎలక్ట్రానిక్ సిమ్ (ఈ-సిమ్) ఉండేలా మొబైల్ ఫోన్ తయారీదారులను ఆదేశించాలని టెలికం ఆపరేటర్లు కోరుతున్నారు. ఇందుకు సంబంధించి సెల్యులర్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీవోఏఐ) టెలికం శాఖకు లేఖ రాసింది. కానీ, సీవోఏఐ డిమాండ్‌ను ఇండియన్ సెల్యులర్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ)ను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ ఈ నెల 10న కేంద్ర ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ల శాఖకు లేఖ రాసింది. సెల్యులర్ ఆపరేటర్లు కోరుతున్నట్టు మొబైల్ ఫోన్లలో ఈ-సిమ్ కార్డులను ప్రవేశపెట్టడం వాటి తయారీ వ్యయాలు పెరిగేందుకు దారితీస్తుందని పేర్కొంది. అదనపు హార్డ్‌వేర్ అవసరంతోపాటు, డిజైన్‌లోనూ మార్పులు అవసరమవుతాయని వివరించింది.



ధరలు పెరిగే ప్రమాదం..

ప్రస్తుతం ఈ-సిమ్ ఆప్షన్ ఖరీదైన ఫోన్లలోనే ఉంది. కేవలం 1-2 శాతం మంది చందాదారులే ఈ ఫోన్లను వినియోగిస్తున్నారు. రూ.10,000పైన ధర ఉండే ఫోన్లు మొత్తం ఫోన్ల విక్రయాల్లో 80 శాతంగా ఉన్నాయని ఐసీఈఏ అంటోంది. ఈ-సిమ్‌ను తప్పనిసరి చేస్తే భారత మార్కెట్లో అమ్ముడుపోయే ఫోన్ల కోసం ప్రత్యేక డిజైన్లు అవసరమవుతాయని పేర్కొంది. ఎందుకంటే ఇతర దేశాల్లో ఈ-సిమ్ తప్పనిసరి అనే ఆదేశాలేవీ లేవు. దీంతో భారత మార్కెట్లో విక్రయించే ఫోన్లను ఈ-సిమ్‌కు సపోర్ట్ చేసే విధంగా తయారు చేయాల్సి వస్తుంది. ఫలితంగా మధ్య స్థాయి ఫోన్ల ధరలు పెరిగిపోతాయి. మొబైల్ ఫోన్ల మార్కెట్లో సగం రూ.10,000-20,000 బడ్జెట్‌లోనివే కావడం గమనార్హం. సిమ్‌కార్డులకు కొరత ఏర్పడడంతో వాటి ధరలు పెరిగాయన్నది సెల్యులర్ ఆపరేటర్ల మరో అభ్యంతరంగా ఉంది. దీన్ని కూడా ఐసీఈఏ వ్యతిరేకిస్తోంది. "సిమ్ కార్డుల ధర ఐదు రెట్లు పెరిగినా ఫర్వాలేదు. కానీ, ఈ-సిమ్ కోసం ఫోన్లో చేయాల్సిన హార్డ్‌వేర్ మార్పుల కోసం అయ్యే వ్యయంతో పోలిస్తే తక్కువే" అన్నది ఐసీఈఏ వాదనగా ఉంది. అన్ని మొబైల్ ఫోన్లకు ఈ-సిమ్‌లను తప్పనిసరి చేసినట్టయితే అది మొబైల్ ఫోన్ల పరిశ్రమ వృద్ధిని దెబ్బతీస్తుందని, ఎగుమతుల పట్ల నెలకొన్న ఆశావాదాన్ని సైతం నీరుగారుస్తుందని అంటోంది.

హైలైట్స్

- సరఫరా సమస్యల కారణంగా సిమ్ కార్డుల ధర పెరిగిపోయింది: సీవోఏఐ
- సిమ్ కార్డుల ధర ఐదు రెట్లు పెరిగినా, హార్డ్‌వేర్‌లో ఈ-సిమ్‌ల కోసం చేయాల్సిన మార్పుల వల్ల అయ్యే వ్యయాలతో పోలిస్తే తక్కువే: ఐసీఈఏ
- ఈ-సిమ్ కార్డులతో సిమ్‌కార్డుల వ్యర్థాలను (నంబర్ పోర్టబులిటీ రూపంలో) నివారించొచ్చు: సీవోఏఐ
- 1-2 శాతం చందాదారులే ఈ సిమ్‌లను వాడుతున్నారు. అన్ని ఫోన్లకు తప్పనిసరి చేయొద్దు: ఐసీఈఏ
- సిమ్ కార్డుల సరఫరా 2024లోపు మెరుగుపడే అవకాశాలు కనిపించడం లేదు: సీవోఏఐ
- 6-9 నెలల్లో సరఫరా సాధారణ స్థితికి వచ్చేస్తుంది: ఐసీఈఏ

త్వరలో కుదురుకుంటుంది..

సిమ్‌కార్డుల కొరత సమస్య త్వరలోనే సమసిపోతుందని ఐసీఈఏ అంటోంది. వచ్చే 6-9 నెలల్లో సాధారణ పరిస్థితి ఏర్పడొచ్చని చెబుతోంది. కానీ, సిమ్ సరఫరాదారులతో సీవోఏఐ ఇదే విషయమై చేసిన సంప్రదింపుల ఆధారంగా చూస్తే.. సిమ్ కార్డుల సరఫరా 2024కు ముందు మెరుగయ్యే అవకాశాల్లేవని తెలుస్తోంది.

జోయాలుక్కాస్ గ్రూప్... లగ్జరీ హెలికాప్టర్ కొనుగోలు



త్రిస్సూర్: జోయాలుక్కాస్ గ్రూప్ రూ.90 కోట్ల విలువైన లియోనార్డ్ ఏడబ్ల్యూ 10 గ్రాండ్‌న్యూ ట్విన్-ఇంజిన్ కలిగిన లగ్జరీ హెలికాప్టర్‌ను కొనుగోలు చేసింది. గంటకు 289 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఈ చాపర్ అత్యాధునిక సాంకేతిక, భద్రతా ఫీచర్లను కలిగి ఉంది. ఇద్దరు పైలెట్లతో సహా ఏడుగురిని ఒకేసారి తీసుకెళ్లగలదు. దేశవ్యాప్తంగా విస్తరించిన కంపెనీ కార్యకలాపాల్లో ఉన్నతాధికారులు మరింత చురుగ్గా పాల్గొనేందుకు హెలికాప్టర్ సాయపడుతుందని సంస్థ ఎండీ జాయ్ అలుక్కాస్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

6-9-2022	
విశాఖ	475-00
చిత్తూరు	493-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	435-00
విజయవాడ	435-00
రిటైల్ ధర (డజను)	66.00
5-9-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	410-00
వరంగల్	412-00
రిటైల్ ధర	4.70

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

బీపీసీఎల్, కొచ్చిలో 102 గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు

కేరళ రాష్ట్రం, కొచ్చిలోని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(బీపీసీఎల్), కొచ్చి రిఫైనరీ.. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 102
- » **విభాగాలు:** కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, అప్లైడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ, ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటర్ ఇంజనీరింగ్, మెటలర్జీ ఇంజనీరింగ్.
- » **అర్హత:** సంబంధిత విభాగంలో ప్రథమ శ్రేణిలో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- » **వయసు:** 01.09.2022 నాటికి 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **స్టైపెండ్:** నెలకు రూ.25,000 చెల్లిస్తారు.
- » **శిక్షణా వ్యవధి:** ఏడాది
- » **శిక్షణా ప్రదేశం:** బీపీసీఎల్, కొచ్చి రిఫైనరీ.
- » **ఎంపిక విధానం:** విద్యార్హత డిగ్రీ మార్కులు, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఎన్ఏటీఎస్ పోర్టల్‌లో వివరాల నమోదుకు చివరితేది:** 08.09.2022
- » **బీపీసీఎల్ పోర్టల్‌లో దరఖాస్తుకు చివరితేది:** 13.09.2022
- » **వెబ్‌సైట్:** www.bharatpetroleum.in

ఈసీఐఎల్, హైదరాబాద్‌లో 284 ట్రేడ్ అప్రెంటిస్‌లు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్).. ట్రేడ్ అప్రెంటిస్‌షిప్ శిక్షణ(ఒక ఏడాది) ఇచ్చేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 284
- » **ఖాళీల వివరాలు:** ఎలక్ట్రీషియన్-50, ఎలక్ట్రానిక్ మెకానిక్-100, ఫిట్టర్-50, ఎంఎంవీ-01, టర్నర్-10, మెషినిస్ట్-10, మెషినిస్ట్(జి)-03, ఎంఎం టూల్ మెయింటెనెన్స్-02, కార్పెంటర్-05, సీవోపీఏ-20, డీజిల్ మెకానిక్-03, ప్లంబర్-01, ఎస్ఎండబ్ల్యూ-01, వెల్డర్-15, పెయింటర్-03.
- » **వయసు:** 14.10.2022 నాటికి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. » **అర్హత:** సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి. » **ఎంపిక విధానం:** ఐటీఐ మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రభుత్వ క్యాక్యూఎస్ ఐటీఐ-గర్ల్స్, సంతోష్‌నగర్, సైదాబాద్, హైదరాబాద్ చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 12.09.2022
- » **వెబ్‌సైట్:** www.ecil.co.in

ఈఎస్ఐసీ, హైదరాబాద్‌లో 169 పోస్టులు

హైదరాబాద్ సనత్ నగర్‌లో కేంద్ర కార్మిక-ఉపాధి మంత్రిత్వ శాఖకు చెందిన ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఈఎస్ఐసీ), మెడికల్ కాలేజ్.. ఒప్పంద ప్రాతిపదికన ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 169
- » **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సీనియర్ రెసిడెంట్, స్పెషలిస్ట్, సూపర్ స్పెషలిస్ట్.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎండీ, ఎమ్మెస్సీ, ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతోపాటు బోధనానుభవం ఉండాలి.
- » **వయసు:** 26.07.2022 నాటికి ఫ్యాకల్టీ/అడ్జంక్ట్ ఫ్యాకల్టీకి 69ఏళ్లు, సూపర్ స్పెషలిస్ట్‌కి 69 ఏళ్లు, స్పెషలిస్ట్‌కు 66ఏళ్లు, సీనియర్ రెసిడెంట్‌కు 45ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:** అకడమిక్ క్వాలిఫికేషన్ స్కోరు, టీచింగ్ అనుభవం, నీట్ స్కోర్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.09.2022
- » **ఇంటర్వ్యూలు ప్రారంభ తేది:** 13.09.2022
- » **వెబ్‌సైట్:** www.esic.nic.in

జేఎన్ఏఎఫ్ఏయూ, హైదరాబాద్‌లో బీఆర్క్ ప్రవేశాలు

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం ప్రాంగణంతోపాటు దాని పరిధిలోని 11 అనుబంధ కళాశాలల్లో 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (బీఆర్క్) కోర్సులో ప్రవేశాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలచేసింది.

- » **మొత్తం సీట్ల సంఖ్య:** 830
- » **అర్హత:** 10+2 (ఫిజిక్స్, కెమిస్ట్రీ-మ్యాథమేటిక్స్) లేదా డిప్లొమా(మ్యాథమేటిక్స్) ఉత్తీర్ణతతోపాటు నాటా-2022/జేఈఈ(మెయిన్)-2022 పేపర్-2ఎ(బీఆర్క్) స్కోరు సాధించి ఉండాలి.
- » **సీట్ల వివరాలు:** విశ్వవిద్యాలయ కళాశాలలోని సీట్లలో 64% సీట్లను ఏపీ విద్యార్థులకు, 36% సీట్లను తెలంగాణ విద్యార్థులకు కేటాయిస్తారు. ప్రైవేట్ కళాశాలల్లో 15% అన్ రిజర్వ్‌డ్ సీట్లకు ఏపీ విద్యార్థులు కూడా పోటీపడవచ్చు.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.09.2022
- » **వెబ్‌సైట్:** www.jnafau.ac.in

టీచర్ కొలువు.. సొంతం చేసుకోండిలా!

- » 502 స్కూల్ అసిస్టెంట్, పీజీటీ, టీజీటీ, ఎస్‌జీటీ, మ్యూజిక్ టీచర్ పోస్టులు
- » ప్రభుత్వ, మున్సిపల్, మోడల్ స్కూల్స్, స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్స్‌లో ఉద్యోగాలు
- » కొనసాగుతున్న ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ

ఉపాధ్యాయ వృత్తిలో స్థిర పడాలనే లక్ష్యంతో బీఈడీ, డీఈడీ వంటి కోర్సులు పూర్తి చేసుకుని.. ప్రభుత్వ కొలువు కోసం ఎదురు చూస్తున్న ఉద్యోగార్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. రాష్ట్రంలోని పలు విభాగాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో.. మొత్తం 502 టీచర్ పోస్ట్‌ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అంతేకాకుండా పరీక్ష తేదీని సైతం ప్రకటించడం విశేషం! దీంతో టీచర్ కొలువుల అభ్యర్థులు తమ లక్ష్య సాధనకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో.. ఏపీ ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన టీచర్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ వివరాలు, అర్హతలు, పరీక్ష విధానం, విజయానికి ప్రిపరేషన్ గైడెన్స్..



ఏపీ జాబ్స్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏపీ ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం-ప్రభుత్వ పాఠశాలలు(ఎంపీపీ, జడ్పీపీ, మున్సిపల్), మహాత్మ జ్యోతిబా పులే ఏపీ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ పరిధిలోని మోడల్ స్కూల్స్, అదే విధంగా స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్స్‌లోని ఎస్‌జీటీ, ఎస్ఏ, పీజీటీ, టీజీటీ, మ్యూజిక్ టీచర్ స్థాయిలో..మొత్తం 502 పోస్ట్‌లను భర్తీ చేయనున్నారు.

పోస్టుల వివరాలు

- ప్రభుత్వ, జడ్పీపీ, ఎంపీపీ, జీపీఏ పాఠశాలల్లో -సెకండరీ గ్రేడ్ టీచర్స్: 69, స్కూల్ అసిస్టెంట్స్: 123, మ్యూజిక్ టీచర్స్: 7.
- మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్స్ పాఠశాలల్లో ఎస్‌జీటీలు: 5
- మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్స్ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్స్: 10
- మోడల్ స్కూల్స్‌లో 176 పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లు, 31 ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు.
- స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్స్‌లో.. 81 స్కూల్ అసిస్టెంట్ పోస్ట్‌లు. ■ వీటికోసం వేర్వేరుగా మూడు నోటిఫికేషన్లు విడుదల చేశారు.

అర్హతలు

- దరఖాస్తు చేసుకున్న పోస్ట్‌లను అనుసరించి సంబంధిత సబ్జెక్ట్‌లతో ఇంటర్మీడియెట్, డిగ్రీ, బీఈడీ, డీఈడీ,స్పెషల్ ఎడ్యుకేషన్ బీఈడీ తదితర అర్హతలు ఉండాలి. **వయసు:** జూలై 1, 2022 నాటికి 18-44 ఏళ్లు (ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు అయిదేళ్ల సడలింపు లభిస్తుంది)

ఎంపిక విధానం

- ఆయా విభాగాల పరిధిలోని పాఠశాలల్లో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్, మ్యూజిక్ టీచర్స్, స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్స్ పోస్ట్‌లను భర్తీ చేసే క్రమంలో టెట్, టెట్ కమ్ టీఆర్‌టీ విధానంలో రాత పరీక్షలు నిర్వహించనున్నారు. అన్ని పోస్ట్‌ల పరీక్షలను కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహిస్తారు.
- స్కూల్ అసిస్టెంట్ పోస్ట్‌లకు నిర్వహించే టీచర్ రిక్రూట్‌మెంట్ పరీక్ష నాలుగు విభాగాలుగా 80 మార్కులకు ఉంటుంది. రాత పరీక్షకు 80శాతం, టెట్ స్కోర్‌కు 20 శాతం వెయిటేజీ కల్పిస్తారు.
- ఎస్‌జీటీలకు సంబంధించి 100 మార్కులకు టెట్ కమ్ టీఆర్‌టీ పేరుతో పరీక్ష నిర్వహిస్తారు.
- మ్యూజిక్ టీచర్ రాత పరీక్షకు 70 మార్కులు, స్కిల్ టెస్ట్‌కు 30 మార్కులు కేటాయిస్తారు.

మోడల్ స్కూల్స్.. ఎంపిక ఇలా

- మోడల్ స్కూల్స్‌లోని పీజీటీ, టీజీటీ పోస్టులకు కూడా రాత పరీక్ష ఆధారంగానే ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.
- పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్(పీజీటీ) పోస్ట్‌లకు రెండు పేపర్లుగా పరీక్ష ఉంటుంది.
- పేపర్-1ను ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ టెస్ట్‌గా 100 ప్రశ్నలు-100 మార్కులకు నిర్వహిస్తారు. పీజీటీ, టీజీటీ స్థాయిలో నాన్-లాంగ్వేజెస్ సబ్జెక్ట్‌ల అభ్యర్థులకు ఈ పరీక్ష ఉంటుంది. పేపర్-2ను టీఆర్‌టీ పేరుతో నాలుగు విభాగాలుగా 100 మార్కులకు నిర్వహిస్తారు.
- టీజీటీ పోస్టులకు కూడా రెండు పేపర్లుగా పరీక్ష నిర్వహిస్తారు. పేపర్-1ను ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ టెస్ట్‌గా 100మార్కులకు 100ప్రశ్నలతో నిర్వహిస్తారు. పేపర్-2 నాలుగు విభాగాలుగా 80 మార్కులకు ఉంటుంది. మిగతా 20 మార్కులు ఏపీ టెట్ స్కోర్‌కు వెయిటేజీ ఇస్తారు.
- రెండు పోస్ట్‌లకు సంబంధించి పేపర్-1ను అర్హత పేపర్‌గా నిర్దేశించారు. ఈ పేపర్‌లో కనీస అర్హత మార్కులు(జనరల్ కేటగిరీ అభ్యర్థులు 60శాతం,రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 50శాతం) సాధిస్తేనే పేపర్-2 మూల్యాంకన చేస్తారు.
- పేపర్-1ను గంటన్నర, పీజీటీ పేపర్-2 మూడు గంటలు, టీజీటీ పేపర్-2 రెండున్నర గంటల వ్యవధిలో నిర్వహిస్తారు.
- **స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ పరీక్ష ఇలా:** ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ ఫర్ డిజేబుల్డ్ ఎట్ సెకండరీ స్టేజ్ కేటగిరీలో స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగంలోని స్కూల్ అసిస్టెంట్ పోస్ట్‌లకు 100 మార్కులకు రాత పరీక్ష నిర్వహిస్తారు. సమగ్ర శిక్ష అభియాన్‌లో ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ టీచర్‌గా పనిచేస్తున్న వారికి.. వారి సర్వీస్ పీరియడ్ ఆధారంగా అయిదు మార్కుల వెయిటేజీ ఇస్తారు.

ఏపీ టీచర్ రిక్రూట్‌మెంట్-ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** సెప్టెంబర్ 18, 2022 ■ **ఆన్‌లైన్ మాక్‌టెస్ట్ సదుపాయం:** అక్టోబర్ 17 నుంచి ■ **అన్ని పోస్ట్‌లకు పరీక్ష తేదీ:** అక్టోబర్ 23 నుంచి (ప్రతి పోస్ట్‌కు రెండు సెషన్లలో పరీక్ష నిర్వహిస్తారు) ■ **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** http://cse.ap.gov.in

గెలుపు మార్గమిదే

ఎస్‌జీటీ

జీకే, కరెంట్ అఫైర్స్‌లో సిలబస్‌పై పూర్తిస్థాయి అవగాహన ఏర్పరచుకోవాలి. సబ్జెక్టుల వారీ వ్యూహాత్మక ప్రణాళికతో అధ్యయనం సాగించాలి. స్టాక్ జీకే, కరెంట్ అఫైర్స్‌పై ప్రత్యేక దృష్టిసారించాలి. అదే విధంగా భౌగోళిక నామాలు, నదీతీర నగరాలు, దేశాలు-రాజధానులు, ప్రపంచంలో మొట్టమొదట చోటుచేసుకున్న సంఘటనలు, అవార్డులు, సదస్సులు, వార్తల్లో వ్యక్తులు, బడ్జెట్, అంతర్జాతీయ రాజకీయ అంశాలు, శాస్త్రసాంకేతిక అంశాలు వంటి వాటి గురించి క్షుణ్నంగా తెలుసుకోవాలి.

విద్యా దృక్పథాలు

దేశంలో విద్యా చరిత్ర, కమిటీలు; వర్తమాన భారతదేశంలో విద్యా సంబంధిత అంశాలు; ఉపాధ్యాయ సాధికారత; చట్టాలు-హక్కులు; జాతీయ పాఠ్యప్రణాళికా చట్టం(ఎన్‌సీఎఫ్-2005); విద్యా హక్కు చట్టం, నూతన విద్యా విధానం తదితర అంశాలపై పట్టు సాధించాలి.

విద్యా మనోవిజ్ఞానశాస్త్రం

శిశు వికాసం అభివృద్ధి, వైయక్తిక భేదాలు, అభ్యసనం, మూర్తిమత్వం.. అంశాలు చాలా ముఖ్యమైనవి. శిశు వికాసంలో.. వికాసం, పెరుగుదల, పరిపక్వత భావన -స్వభావం, వికాస నియమాలు, వికాసంపై ప్రభావం చూపే కారకాలు, వికాస దశలు తదితర అంశాలపై దృష్టి సారించాలి. ముఖ్య భావనలకు సంబంధించిన అనువర్తనాలను తప్పనిసరిగా అధ్యయనం చేయాలి. కాన్సెప్ట్‌లపై పట్టుసాధించాలి.

కంటెంట్

- తెలుగు(ఆప్షనల్), ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్, సైన్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టుల కంటెంట్‌లో సన్నద్ధతకు పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను అధ్యయనం చేయాలి. తెలుగులో కవులు-కావ్యాలు, అర్థాలు, పర్యాయపదాలు, జాతీయాలు తదితరాలతోపాటు భాషాంశాలను చదవాలి. ఇంగ్లిష్‌లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్, టెన్సెస్, టైప్స్ ఆఫ్ సెంటెన్సెస్, ఆర్టికల్స్, ప్రిపోజిషన్స్ తదితరాలపై పట్టు సాధించాలి.
- గణితంలో.. అర్థమెటిక్, సంఖ్యా వ్యవస్థ, క్షేత్ర గణితం, రేఖా గణితం, బీజ గణితం, సాంఖ్యక శాస్త్రం అంశాలపై పట్టు సాధించాలి. పదో తరగతి స్థాయిలోని మ్యాథమెటిక్స్‌ను అధ్యయనం చేయడం లాభిస్తుంది.
- సైన్స్‌లో.. జీవ ప్రపంచం, మొక్కలు, జంతువులు, ఆహారం, పోషణ, ఆహార పిరమిడ్, మానవ శరీరం, పదార్థాలు, కొలతలు, ప్రమాణాలు, ఆమ్లాలు-క్షారాలు, శక్తి రూపాలు, పునరుత్పాదక ఇంధన వనరులు తదితర అంశాలపై దృష్టి సారించాలి.
- ధ్వని, విద్యుత్, కాంతి, ఉష్ణం చాప్టర్లలోని ముఖ్య భావనలు, శాస్త్రవేత్తలు, ఆవిష్కరణలపై పట్టుసాధించాలి. అదే విధంగా జీవవైవిధ్యం, ఆవరణ వ్యవస్థలు, పర్యావరణ సమస్యలు, భూతాపం తదితర అంశాలు ముఖ్యమైనవి.
- సోషల్ స్టడీస్‌లో.. స్థానిక భౌగోళిక అంశాలు, ఖండాలు, పారిశ్రామిక విప్లవం, మనీ-బ్యాంకింగ్, ప్రభుత్వం; రాజకీయ వ్యవస్థలు, జాతీయ ఉద్యమం, భారత రాజ్యాంగం, పరిపాలన, సాంఘిక సంస్థలు, అసమానతలు, మతం -సమాజం, సంస్కృతి, కమ్యూనికేషన్ తదితర అంశాలపై అవగాహన అవసరం.

స్కూల్ అసిస్టెంట్

- ఆయా సబ్జెక్టుల కంటెంట్ ప్రిపరేషన్‌కు ఆరు నుంచి ఇంటర్మీడియెట్ వరకు.. ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను చదవాలి. మ్యాథమెటిక్స్‌కు సంబంధించి ప్రధానంగా బీజగణితం, సదిశా బీజగణితం, వైశ్లేషిక రేఖాగణితం, కలన గణితం, త్రికోణమితి అంశాలపై పట్టు సాధించాలి. బయాలజీలో జీవ ప్రపంచం, సూక్ష్మజీవుల ప్రపంచం, జీవశాస్త్రం-ఆధునిక పోకడలు,జంతు ప్రపంచం తదితర పాఠ్యాంశాలు కీలకం.
- సోషల్ స్టడీస్‌లో భారత స్వాతంత్ర్య ఉద్యమం, ప్రపంచ యుద్ధాలు-అనంతర పరిస్థితులు; రాజ్యాంగం, యూఎన్‌వో, సమకాలీన ప్రపంచ అంశాలు; జాతీయ ఆదాయం, భారత ఆర్థిక వ్యవస్థ లక్షణాలు తదితర అంశాలపై దృష్టి సారించాలి. వరల్డ్ జాగ్రఫీ, ఇండియన్ జాగ్రఫీలనూ ప్రత్యేకంగా చదవాలి.

క్లుప్తంగా

ఎయిడ్స్‌పై చైతన్యానికి వీడియోలు, మీమ్స్ పోటీలు

- ఏపీ శ్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహణ



సాక్షి, అమరావతి: ఏపీని ఎయిడ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా యువతలో వ్యాధి పట్ల చైతన్యం, అవగాహన పెంచడం కోసం విద్యార్థులకు వీడియో, మీమ్స్ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ(ఏపీ శ్యాక్స్) సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ క్రమంలో వ్యాధి నియంత్రణ అంశంపై నిముషం నిడివి గల వీడియోలు, మీమ్స్ రూపొందించి safelifeandhra@gmail.com కు మెయిల్ ద్వారా పంపాలని సూచించారు. ఈ నెల 12లోగా వీడియోలు, మీమ్స్ పంపాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎంట్రీలను తెలుగు, ఇంగ్లీషు భాషల్లో పంపొచ్చని తెలిపారు. ఎంపికైన ఎంట్రీలకు బహుమతుల్ని అందజేయడంతో పాటు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ సోషల్ మీడియా పేజీలన్నింటిలోనూ ప్రజలను చైతన్య పరచేందుకు వాటిని ఉపయోగిస్తామని తెలిపారు.

గ్రామీణ ప్రాంత ప్రభుత్వ బడులకు 'ఇన్సినిరేటర్'

- రాష్ట్రాలకు లేఖ రాసిన కేంద్రం

సాక్షి, అమరావతి: విద్యార్థినులు రుతుక్రమం సమయంలో ఉపయోగించే ప్యాడ్లను ఎప్పటికప్పుడు దహనం చేసేందుకు వీలుగా ప్రభుత్వ బడుల్లో ఇన్సినిరేటర్ పరికరాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. వీటిని అవసరమైన చోట్ల గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ బడుల్లో ఏర్పాటు చేయనుంది. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌లకు నేరుగా విడుదల చేసే నిధుల నుంచి లేదా స్వచ్ఛ భారత్ (గ్రామీణ) నిధుల నుంచి వీటిని కొనుగోలు చేసేందుకు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సైతం అనుమతిచ్చింది. ఇందుకు సంబంధించి కేంద్ర పంచాయతీరాజ్ శాఖ జాయింట్ సెక్రటరీ రేఖా యాదవ్ సోమవారం అన్ని రాష్ట్రాల పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శులకు లేఖ రాశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇన్సినిరేటర్ వినియోగంపై విద్యార్థినులందరికీ అవగాహన కల్పించాలని కోరారు. కాగా ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం 6,500 గ్రామ పంచాయతీలకు ఇన్సినిరేటర్లను సరఫరా చేసింది. వాటిని ప్రభుత్వ బడుల్లోనే అందుబాటులో ఉంచేందుకు కూడా ఆయా జిల్లాల కలెక్టర్లకు వెసులుబాటు కల్పించింది. ఇంకా అవసరమైన చోట్ల అదనంగా అందుబాటులోకి తెచ్చేందుకు కూడా అధికారులు ఆలోచన చేస్తున్నారు.

ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్లలో డిజిటల్ పేమెంట్లు

- పరికరాలను ఉచితంగా అందజేయనున్న పేటీఎం సంస్థ



సాక్షి, అమరావతి: 'ఫిష్ ఆంధ్ర' పేరుతో ఏర్పాటు చేస్తోన్న రిటైల్ అవుట్‌లెట్లలో డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే లక్ష్యంతో పేటీఎం సంస్థతో రాష్ట్ర మత్స్యసహకార సంస్థ మంగళవారం ఒప్పందం చేసుకోనుంది. విజయవాడలో జరగనున్న ఈ కార్యక్రమంలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, మత్స్య శాఖ స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య, మత్స్య శాఖ కమిషనర్ కె.కన్నబాబు సమక్షంలో మత్స్యసహకార సంస్థ చైర్మన్ కె.అనిల్ బాబు, పేటీఎం చీఫ్ బిజినెస్ మేనేజర్ అభయ్‌శర్మ ఒప్పందం చేసుకోనున్నారు. ఒప్పందం మేరకు రూ.22 వేల విలువైన పాయింట్ ఆఫ్ సేల్, క్యూ ఆర్ కోడ్‌తో కూడిన పేమెంట్ ఆడియో సౌండ్ బాక్సులను పేటీఎం సంస్థ ఉచితంగా సమకూర్చనుంది. వీటిని ఫిష్ ఆంధ్ర యాప్‌తో అనుసంధానం చేస్తారు. ఒప్పందం మేరకు ఈ నెలాఖరుకల్లా 2వేల రిటైల్ అవుట్‌లెట్లలో పరికరాలను ఏర్పాటు చేస్తారు. ఆ తర్వాత దశల వారీగా మిగిలిన వాటికి కూడా అందజేస్తారు.

రాష్ట్రంలోనే క్యాన్సర్‌కు చెక్

వైద్యానికి బయటకు వెళ్లకూడదన్నది రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశం

- 'సాక్షి' ఇంటర్వ్యూలో ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు నోరి దత్తాత్రేయుడు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో క్యాన్సర్ నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వ చర్యలు బాగున్నాయని ప్రముఖ వైద్య నిపుణులు, రాష్ట్ర ప్రభుత్వ క్యాన్సర్ కేర్ సలహాదారు నోరి దత్తాత్రేయుడు ప్రశంసించారు. క్యాన్సర్ చికిత్స కోసం రాష్ట్రం విడిచి వెళ్లాల్సిన అవసరం లేకుండా చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఉన్నారని కొనియాడారు. ఈ మేరకు రాష్ట్రంలో క్యాన్సర్ కట్టడికి మెరుగైన చర్యలు చేపడుతున్నారని అభినందించారు. ఈ మేరకు నోరి దత్తాత్రేయుడు 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. క్యాన్సర్ వ్యాధికి చికిత్స అందించడంలో ప్రపంచంలోనే గొప్ప వైద్యుడిగా పేరు తెచ్చుకున్న నోరి దత్తాత్రేయుడు చెబుతున్న వివరాలు ఆయన మాటల్లోనే..

సీఎం జగన్ ఒక్కటే మాట చెప్పారు..

గతేడాది సీఎం జగన్‌ను కలిశాను. ఈ సందర్భంగా 'రాష్ట్ర ప్రజలు క్యాన్సర్ చికిత్సకు ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన పనిలేకుండా ఇక్కడ ఏ విధమైన చర్యలు తీసుకోవాలో సూచించండి' అని నాతో అన్నారు. దీంతో రాష్ట్ర వైద్య శాఖతో కలిసి క్యాన్సర్ చికిత్స వనరులను బలోపేతం చేశాం. ఇంకోవైపు వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచడం, ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించడం కోసం స్క్రీనింగ్ నిర్వహించడం వంటి వివిధ అంశాలపై ప్రణాళిక రూపొందించాం.



మంత్రి రజనితో సమావేశమైన డాక్టర్ దత్తాత్రేయుడు

అమెరికా తరహాలో నోటిఫైడ్ జబ్బుల జాబితాలో..

క్యాన్సర్‌ను సమర్థవంతంగా కట్టడి చేసేందుకు ఈ వ్యాధిని ప్రభుత్వం నోటిఫైడ్ జబ్బుల జాబితాలో చేర్చింది. దీంతో రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లలో ఎక్కడ కొత్తగా క్యాన్సర్ కేసును గుర్తించినా, చికిత్స అందించినా వైద్య శాఖకు తప్పనిసరిగా రిపోర్ట్ చేయాల్సి ఉంది. ఈ విధానం వల్ల ప్రభుత్వం వద్ద రాష్ట్రంలో నమోదయ్యే క్యాన్సర్ కేసుల సమాచారం పక్కాగా ఉంటుంది. తద్వారా కేసుల నమోదుకు అనుగుణంగా వైద్య సదుపాయాల కల్పన, నియంత్రణ చర్యలకు ఆస్కారం ఉంటుంది. అమెరికా వంటి దేశాల్లో ఈ తరహా విధానాన్ని అవలంబిస్తున్నారు.

ఏటా 1.3 మిలియన్ క్యాన్సర్ కేసులు..

దేశంలో ఏటా 1.3 మిలియన్ క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయి. ఇందులో 60 శాతం కేసులు నియంత్రించదగ్గవే. ప్రజల్లో వ్యాధి పట్ల అవగాహన పెంచితే నియంత్రణ సాధ్యమవుతుంది. మరో 20 శాతం కేసులను స్క్రీనింగ్ ద్వారా తొలి దశలోనే గుర్తించవచ్చు. పెద్ద ఎత్తున స్క్రీనింగ్ నిర్వహించడం ద్వారా తొలి దశలోనే క్యాన్సర్ కేసులు గుర్తించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుండటం శుభపరిణామం.

క్యాన్సర్‌పై విజయమే లక్ష్యం

– వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి రజని

క్యాన్సర్‌పై పూర్తి స్థాయి విజయం సాధించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ పనిచేస్తున్నారని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని వైద్య, ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయంలో సోమవారం మంత్రితో ఏపీ ప్రభుత్వ క్యాన్సర్ కేర్ సలహాదారు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి రజని మాట్లాడుతూ.. వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా తొలి దశలోనే క్యాన్సర్ కేసులను గుర్తించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజలకు వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని చెప్పారు. క్యాన్సర్ స్క్రీనింగ్‌పై గ్రామస్థాయి సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. త్వరలో తీసుకొస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గ్రామ స్థాయిలోనే క్యాన్సర్‌కు విస్తృత స్క్రీనింగ్ చేపడతామని తెలిపారు. క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తిస్తే సులభంగా నయం చేయవచ్చన్నారు. ఈ సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి నవీన్ కుమార్ పాల్గొన్నారు.

క్యాన్సర్ చికిత్సకు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో స్విమ్స్..

తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (స్విమ్స్)ను క్యాన్సర్ వ్యాధి చికిత్స, పరిశోధనకు సంబంధించి ప్రపంచ స్థాయి ప్రమాణాలతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది. మరోవైపు రాష్ట్రంలో రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్రల్లో పూర్తి స్థాయిలో సమగ్ర క్యాన్సర్ కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. ఈ చర్యలతో క్యాన్సర్ వైద్యాన్ని ప్రభుత్వం వేరే స్థాయికి తీసుకెళ్లబోతోంది.

నేషనల్ క్యాన్సర్ గ్రిడ్‌లోకి ఏపీ..

ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందిన క్యాన్సర్ రోగుల డేటా ఆధారంగా రాష్ట్రంలో ఏ జిల్లాలో..ఏ రకం క్యాన్సర్ కేసులు అధికంగా నమోదవుతున్నాయో వైద్య శాఖ అధ్యయనం చేసింది. మరోవైపు నోటిఫైడ్ జబ్బుల జాబితాలో క్యాన్సర్‌ను చేర్చడం ద్వారా డేటాను సేకరిస్తోంది. ఈ డేటాను నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ (ఎన్‌సీజీ)తో పంచుకుంటోంది. అలాగే అక్కడి డేటాను మనం పొందేలా ఎన్‌సీజీలోకి ఏపీ చేరింది. ఇది ఎంతో ఉపయుక్తం.

ఏఎంఆర్‌పై ప్రత్యేక కార్యాచరణ

యాంటీబయోటిక్స్ అతి వినియోగంతో శరీరంలో యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) పెరిగి ప్రాణాంతక వ్యాధులు సోకిన సమయంలో మందులకు జబ్బు లొంగని పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో ఏఎంఆర్‌పై ప్రత్యేక కార్యాచరణను రాష్ట్ర వైద్య శాఖ రూపొందించింది. ప్రపంచ నిపుణుల సలహాలు, సూచనలు తీసుకుని అధికారులు ముందుకు వెళుతున్నారు. 5 నుంచి 10 రోజుల్లో తగ్గిపోయే వైరల్ ఫీవర్స్‌కు కూడా అవసరం లేకపోయినా యాంటీబయోటిక్స్ వాడుతున్నారు. అయితే వీటిని ఎప్పుడు వాడాలి.. ఎలా వాడాలి.. ఎందుకు వాడాలి.. అని ప్రజలను చైతన్యపరిచేలా కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయం.

క్షేత్ర స్థాయిలో పర్యటనలు తప్పనిసరి

- సీజనల్ వ్యాధులు ఉన్నచోట వెంటనే చర్యలు చేపట్టాలి
- వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు మంత్రి రజని ఆదేశం

సాక్షి, అమరావతి: జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా పర్యటించాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని ఆదేశించారు. దీనివల్ల పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, డీహెచ్‌లు, ఏహెచ్‌లలో వైద్య సేవలు మెరుగవుతాయన్నారు. సీజనల్ వ్యాధులపై మంగళగిరి నుంచి అన్ని జిల్లాల వైద్య, ఆరోగ్య శాఖాధికారులతో సోమవారం మంత్రి రజని వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉన్న చోట్ల వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యాధుల వ్యాప్తిని గమనిస్తూ అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. డెంగీ, మలేరియా వ్యాధి నిర్ధారణ కిట్లను అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ రూ.వేల కోట్లు వైద్య శాఖ కోసం ఖర్చు చేస్తున్నారని గుర్తు చేశారు. అన్ని విషజ్వరాలకు ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చికిత్స అందేలా చేస్తున్నారన్నారు. డెంగీ, మలేరియా, చికెన్‌గున్యాతోపాటు కలరా, డయేరియా నివారణకు కావాల్సిన మందులన్నీ ప్రభుత్వాస్పత్రుల్లో సరిపడా ఉన్నాయన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధుల నుంచి వచ్చే వినతులపై తక్షణమే స్పందించాలన్నారు. ఈ విషయంలో స్పందించని అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని మరింత చిత్తశుద్ధితో నిర్వహించాలని చెప్పారు. వెంటనే ఫీవర్ సర్వేను చేపట్టాలని, 15 రోజుల్లోగా ఇది పూర్తికావాలని ఆదేశించారు. ఈ సర్వేకు సంబంధించి ఏ రోజు వివరాలు ఆ రోజు తనకు నేరుగా పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్‌రెడ్డి, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ నివాస్, డీఎంఈ రాఘవేంద్రరావు, ఆరోగ్యశ్రీ సీఈవో హరేంధిర ప్రసాద్, ఏపీవీవీపీ కమిషనర్ వినోద్‌కుమార్, డీహెచ్ డాక్టర్ వి.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ గురుకులాల్లో సీబీఎస్ఈ బోధన

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నాగార్జున వెల్లడి



విద్యాభివృద్ధిని సమీక్షిస్తున్న మంత్రి మేరుగు

సాక్షి, అమరావతి: ఎస్సీ సంక్షేమ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో ఈ ఏడాది నుంచి సీబీఎస్ఈ సిలబస్‌లో విద్యాబోధన ప్రారంభించినట్టు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున వెల్లడించారు. సీబీఎస్ఈ విధానంలో విద్యాబోధన కోసం టీచర్లకు అవసరమైన శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో విద్యాబోధన మెరుగుదల కోసం తీసుకుంటున్న చర్యలపై అధికారులతో మంత్రి నాగార్జున సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఎస్సీ గురుకులాల్లో 8వ తరగతి నుంచి సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రారంభించామన్నారు. కొత్త విధానంలో విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు గురుకులానికి చెందిన ఉపాధ్యాయులకు అజీం ప్రేమ్‌జీ యూనివర్సిటీ ద్వారా శిక్షణ ఇప్పించినట్టు తెలిపారు. గురుకుల విద్యార్థులకు బోధన మరింత సరళీకృతం చేసేందుకు డిజిటల్ క్లాస్ రూములు, వర్చువల్ క్లాస్ రూముల ద్వారా పాఠాలు చెప్పేందుకు ప్రణాళికను రూపొందించినట్టు తెలిపారు. పరీక్షల విధానంలోనూ మార్పులను తెచ్చామన్నారు. ముఖ్యంగా 9, 10 తరగతులు, ఇంటర్ విద్యార్థులకు ప్రతివారం పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టామని, ముందుగా రెండు టెస్టులు నిర్వహించాకే క్వార్టర్లీ, హాఫ్ ఇయర్లీ, ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ విధంగా వారాంతపు పరీక్షలు కాకుండా ప్రధానమైన ఏడు టెస్టులు, పరీక్షలు పెట్టడం ద్వారా విద్యార్థులు వారు విన్న పాఠాలను పూర్తిగా అవగతం చేసుకుని ఎలాంటి పరీక్షలకైనా సిద్ధంగా ఉండేలా చర్యలు చేపట్టినట్టు చెప్పారు. విద్యార్థుల్లో పాజిటివ్ దృక్పథం కోసం అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ సంస్థలు ముందుకొచ్చాయని, వాటితో త్వరలోనే ఒప్పందాలు కూడా చేసుకుంటున్నట్టు చెప్పారు. సమావేశంలో ఎస్సీ గురుకులాల సంస్థ కార్యదర్శి పావన మూర్తి, డిప్యూటీ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ బీవీ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లెక్క.. ఇక పక్కా!

- 4 రోజుల ముందే విద్యుత్ కొనుగోళ్లపై అంచనా
- ఎనర్జీ ఫోర్‌కాస్టింగ్ సాంకేతికత అభివృద్ధి
- ఏపీ ట్రాన్స్‌కో సరికొత్త ప్రయోగం
- తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యుత్ కొనే అవకాశం
- ప్రస్తుతం ఒకరోజు ముందు వరకే విద్యుత్ డిమాండ్ అంచనా



సాక్షి, అమరావతి: విద్యుత్ కొనుగోళ్లలో సరికొత్త సాంకేతికత రాష్ట్ర విద్యుత్ సంస్థలకు అందుబాటులోకి వచ్చింది. ఇప్పటివరకు రాష్ట్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ ఉపయోగించి ఒక రోజు ముందు విద్యుత్ డిమాండ్ అంచనా వేస్తున్నారు. ఇప్పుడు పవన విద్యుత్, సౌర విద్యుత్, మార్కెట్ సూచన, డిస్పాచ్ మోడల్, ఫ్రీక్వెన్సీ సూచనల కోసం 4 రోజుల ముందే డిమాండ్‌ను అంచనా వేసేలా ఎనర్జీ ఫోర్‌కాస్టింగ్ సాంకేతికత (నూతన సాఫ్ట్‌వేర్)ను విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)ల సమన్వయంతో ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ఏపీ ట్రాన్స్‌కో) అభివృద్ధి చేసింది.


భవిష్యత్ డిమాండ్‌ను ఎదుర్కొనేలా

ఏపీ ట్రాన్స్‌కోకు ప్రస్తుతం 400 కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్లు 5532.161 సర్క్యూట్ కిలోమీటర్లు (సీకేఎం) ఉన్నాయి. మరో 12200.9 సీకేఎం 220 కేవీ లైన్లు ఉన్నాయి. 132 కేవీ లైన్లు 13568.18 సీకేఎం పొడవున విస్తరించాయి. వీటి ద్వారా విద్యుత్ పంపిణీ సంస్థలకు ఏటా సగటున 70 వేల మిలియన్ యూనిట్ల విద్యుత్ పంపిణీ జరుగుతోంది. వచ్చే మార్చినాటికి విద్యుత్ డిమాండ్ రోజుకు అత్యధికంగా 250 మిలియన్ యూనిట్లకు చేరుతుందని ఏపీ ట్రాన్స్‌కో గ్రిడ్ నిర్వహణ విభాగం అంచనా వేసింది. ప్రస్తుత లైన్లపై అదనపు భారం మోపకుండా ఈ అసాధారణ పెరుగుదలను ఎదుర్కొనేందుకు చర్యలు మొదలయ్యాయి. ఆ ప్రయత్నాల్లో 'ఎనర్జీ ఫోర్‌కాస్టింగ్' కూడా ఒకటని ఏపీ ట్రాన్స్‌కో చెబుతోంది.

ముందస్తు అంచనాలతో ప్రయోజనాలు

విద్యుత్ సంస్థలు దీర్ఘకాలిక సంప్రదాయ పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ (పీపీఏ) కాలం నుండి స్వల్పకాలిక ఒప్పందాలు (షార్ట్ టర్మ్ టెండర్లు) వైపు మళ్లుతున్నాయి. ఈ క్రమంలో ఇంధన ధరల అంచనా ప్రపంచవ్యాప్తంగా ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఎనర్జీ ఫోర్‌కాస్టింగ్ ద్వారా థర్మల్, సోలార్, విండ్, గ్యాస్ వంటి ప్రతి విద్యుత్ ఉత్పత్తి స్టేషన్ నుండి డిస్కంలకు ఎంత విద్యుత్ పంపిణీ చేయాలో నాలుగు రోజుల ముందే తెలుసుకోవచ్చు. ప్రతి 15 నిమిషాలకు ఇది అప్‌డేట్ అవుతుంటుంది. అంతేకాదు తక్కువ ఖర్చుతో విద్యుత్ పంపిణీ ఎక్కడి నుంచి ఎప్పుడు జరుగుతుందో కచ్చితంగా అంచనా వేసే అవకాశం ఉంటుంది. పవర్ జనరేటర్లు, డిస్కంలు తగిన బిడ్డింగ్ వ్యూహాలను రూపొందించడానికి ధర అంచనా డేటాను ఉపయోగిస్తున్నాయి. జనరేటర్ల ధరల గురించి కచ్చితమైన సూచనను తెలుసుకొంటే దాని లాభాలను పెంచుకోవడానికి బిడ్డింగ్ వ్యూహాన్ని రూపొందించవచ్చు. అలాగే మరుసటి రోజు కచ్చితమైన ధర ఎంతో అంచనా వేయగలిగితే డిస్కంలు సొంత ఖర్చులను తగ్గించుకోవడానికి వ్యూహాన్ని రూపొందించుకోవచ్చు.

ఖర్చు తగ్గుతుంది



పవన, సౌర విద్యుత్ కొనుగోళ్లలో, ఫ్రీక్వెన్సీ సూచనలు తెలుసుకోవడంలో జాతీయ స్థాయిలో విద్యుత్ రంగ నిపుణుల సహకారంతో నాలుగు రోజుల ముందే అంచనాలు రూపొందించడానికి ఈ సాంకేతికతను అభివృద్ధి చేశాం. గ్రిడ్ డిమాండ్‌ను తీర్చడానికి, అతి తక్కువ తేడాతో విద్యుత్ డిమాండ్‌ను అంచనా వేయడానికి ఎనర్జీ ఫోర్‌కాస్టింగ్ మోడల్ ఉపయోగపడుతుంది. దీనిద్వారా బహిరంగ మార్కెట్‌లో తక్కువ ధరకు విద్యుత్‌ను కొనొచ్చు. తద్వారా విద్యుత్ కొనుగోలు ఖర్చు తగ్గుతుంది.

–బీ శ్రీధర్, సీఎండీ, ఏపీ ట్రాన్స్‌కో

ఆరోపణలతో స్వామీజీ ఆవేదన..

మఠాధిపతి ఆత్మహత్య

- కర్ణాటక బెళగావి జిల్లాలో ఘటన
- ఇద్దరు మహిళల ఆడియో కాల్ వైరల్
- అందులోని సంభాషణలతో స్వామీజీ మనస్తాపం



యశవంతపుర: లైంగిక దాడి ఆరోపణలతో కర్ణాటక చిత్రదుర్గలోని ప్రఖ్యాత మురుఘ మఠాధిపతి శివమూర్తి శరణుస్వామి ఈనెల 1న అరెస్టయిన ఘటన మరిచిపోకముందే.. బెళగావి జిల్లా బైలహొంగల తాలూకా నేగినహాళ గ్రామంలోని గురు మడివాళేశ్వర మఠాధిపతి బసవ సిద్ధలింగస్వామి (28) శనివారం తెల్లవారుజామున మఠంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈయన రాష్ట్రంలో అత్యంత బలమైన లింగాయత్ వర్గానికి చెందినవారు.

బసవ సిద్ధలింగస్వామి గత కొన్నేళ్లుగా ఈ మఠాన్ని నిర్వహిస్తున్నారు. వారం రోజుల క్రితం ఇద్దరు మహిళలు మాట్లాడిన ఫోన్‌కాల్ ఆడియో వైరల్ అయింది. ఇందులో స్వామి పేరు ప్రస్తావనకు వచ్చింది. రాష్ట్రంలోని అనేకమంది స్వామీజీలు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని, వారు విద్యార్థినులు, మహిళల జీవితాలను నాశనం చేస్తున్నట్లు ఆడియోలో మహిళలు ఆరోపించారు. ఇందులో పలువురు స్వామీజీల పేర్లను వారు ప్రస్తావించారు. ఇది వైరల్ కావడంతో బసవ సిద్ధలింగస్వామి మానసిక వేదనకు గురైనట్లు సమాచారం. ఆదివారం అర్ధరాత్రి వరకు స్వామి భక్తులతో కలిసి ఉన్నారు. ఇంతలో సోమవారం తెల్లవారుజామున భక్తులు రాగా, ఉరికి వేలాడుతున్న స్వామి మృతదేహం కనిపించింది.

నన్ను క్షమించాలి.. ఏ తప్పూ చేయలేదు

నేను ఏ తప్పూ చేయలేదు. నా మరణంపై ఎవరినీ విచారించవద్దు. ఈ లోకం గొడవ చాలు, నా తల్లి, భక్తులు నన్ను క్షమించాలి అని స్వామీజీ రాసిన డెత్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆడియోలో మాట్లాడిన మహిళలపై చర్యలు తీసుకోవాలని భక్తులు డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. పోలీసులు మఠాన్ని సందర్శించి విచారణ చేపట్టారు.

నెల్లూరు జిల్లాకు జాతీయ అవార్డు

- ఆజాదీకా అమృత్ మహోత్సవం, పథకాల అమలులో 4వ స్థానం
- అవార్డుకు ఎంపిక చేసిన కేంద్రం



నెల్లూరు జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు

నెల్లూరు (పొగతోట): ఆజాదీకా అమృత్ మహోత్సవం కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు జాతీయ స్థాయి అవార్డు లభించింది. దేశవ్యాప్తంగా 780 జిల్లాల్లో 120 రోజుల పాటు ఈ కార్యక్రమాల అమలు తీరును కేంద్ర ప్రభుత్వం పరిశీలించింది. ఉత్తమ పనితీరు కనబర్చిన టాప్ 10 జిల్లాలను కేంద్ర ప్రభుత్వం అవార్డులకు ఎంపిక చేసింది. ఇందులో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా 4వ స్థానంలో నిలిచింది. త్వరలో ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు ఢిల్లీలో ఈ అవార్డు అందుకోనున్నారు.

యాసిడ్ పోసి.. గొంతు కోసి..

- గుర్తు తెలియని వ్యక్తి అత్యాచార యత్నం.. ప్రతిఘటించిన బాలిక
- యాసిడ్‌తో దాడిచేసి.. కత్తితో పొడిచి పరార్
- నెల్లూరు జిల్లాలో దారుణం




చికిత్స పొందుతున్న బాలిక

వెంకటాచలం (శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా) : ఇంట్లో ఎవరూలేని సమయంలో 14ఏళ్ల బాలికపై ఆమె ఇంట్లో గుర్తుతెలియని ఓ వ్యక్తి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాలిక ప్రతిఘటించడంతో వెంట తెచ్చుకున్న యాసిడ్‌ను ఆమెపై పోసి, కత్తితో గొంతు కోసి దారుణానికి ఒడిగట్టాడు. ఈ ఘటన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం నక్కల కాలనీలో సోమవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెముడుగుంట పంచాయతీ నక్కలకాలనీకి చెందిన 14ఏళ్ల బాలిక బుజబుజ నెల్లూరులోని ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. సోమవారం సాయంత్రం స్కూలు నుంచి ఇంటికి వచ్చింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఆమె ఇంట్లోకి ప్రవేశించి బాలికపై అత్యాచారానికి యత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో వెంట తెచ్చుకున్న యాసిడ్‌ను బాలిక నోరు, ముఖంపై పోశాడు. అనంతరం కత్తితో గొంతు కోసి అక్కడ నుంచి పరారయ్యాడు. బాలిక కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని ఆమెను హుటాహుటిన జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలిక పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో ఆమె తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. విషయం తెలుసుకున్న సీఐ గంగాధర్, ఎస్ఐ అయ్యప్ప నక్కలకాలనీ, ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి విచారించారు. అయితే.. ఈ దారుణానికి ఒడిగట్టిన వ్యక్తి ఒక్కరా, లేక ఇద్దరు ముగ్గురు ఉన్నారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

884.80 అడుగులకు చేరిన 'శ్రీశైలం' నీటిమట్టం

శ్రీశైలం ప్రాజెక్ట్/విజయపురిసౌత్: శ్రీశైలం జలాశయం నీటిమట్టం సోమవారం సాయంత్రం 884.80 అడుగులకు చేరుకుంది. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి 1,19,093 క్యూసెక్కుల వరద ప్రవాహం శ్రీశైలానికి వచ్చి చేరుతోంది. మూడు గేట్లను 10 అడుగుల మేర తెరిచి 83,949 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఇక ఆదివారం నుంచి సోమవారం వరకు కుడిగట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి అనంతరం 66,566 క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 95,562 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేశారు. బ్యాక్ వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 5 వేల క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 1,688 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం ఈ జలాశయంలో 214.3637 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



సాగర్ జలాశయం

మరోవైపు సాగర్ జలాశయం నుంచి 1,60,129 క్యూసెక్కుల నీటిని దిగువ విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్ నీటిమట్టం 589.10 అడుగులుండగా 309.3558 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గరిష్టస్థాయి నీటిమట్టం 590.00 అడుగులు అయితే.. నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలు.

99% మందికి పింఛన్లు

- 62.02 లక్షల మందికి రూ. 1577.07 కోట్లు పంపిణీ

సాక్షి, అమరావతి: సెప్టెంబర్‌లోనూ 99 శాతం మందికి ప్రభుత్వం సామాజిక పింఛన్లను పంపిణీ చేసింది. ఈ నెలలో రాష్ట్ర వ్యాప్తంగా 62,69,877 మంది లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం రూ.1,594.66 కోట్లు విడుదల చేసిన విషయం తెలిసిందే. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి 62,01,988 మందికి రూ.1,577.07 కోట్లు పంపిణీ చేశారు. కర్నూలు జిల్లాలో అత్యధికంగా 99.15 శాతం పంపిణీ జరగ్గా, అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యల్పంగా 97.91 శాతం మేర పంపిణీ జరిగినట్టు సెర్ప్ అధికారులు చెప్పారు.



విశాఖలో చికిత్స పొందుతున్న చిట్టిబాబుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ ముసలయ్య



గుంటూరులో పుష్పవతమ్మకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ భారతి



నెల్లూరు నగరం మూలాపేటలో సుబ్బరత్తమ్మకు పింఛను నగదు అందజేస్తున్న వలంటీర్ స్రవంతి

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.